సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 131

మంగళవారం 1-8-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '



మహిళా సహకార వెలుగులు

సేంద్రియ సాగులో పురోగమిస్తున్న మహిళా రైతులపై కథనం - 13లో



విజయమా.. ప్రయోగమా!

నేడు వెస్టిండీస్‌తో మూడో వన్డే ఆడనున్న టీమిండియా - 14లో



డీకే శివకుమార్‌కు ఊరట

అవినీతి కేసులో దర్యాప్తుకు సంబంధించి కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించింది.

వివరాలు 6లో ▸



రైల్లో కానిస్టేబుల్ కాల్పులు

జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఓ ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ జరిపిన కాల్పుల్లో ఏఎస్‌ఐతోపాటు ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు.

వివరాలు 6లో ▸



చంద్రయాన్–3 కక్ష్య దూరం పెంపు

చంద్రయాన్–3ను చంద్రుని కక్ష్యవైపు మళ్లించే ప్రక్రియను శాస్త్రవేత్తలు విజయవంతంగా చేప ట్టారు. కక్ష్య దూరాన్ని మరోసారి పెంచారు.

వివరాలు 6లో ▸



మహిళలకు ప్రధాని ప్రశంసలు

భోజపత్ర కాలిగ్రఫీని జీవనోపాధిగా మార్చు కున్న ఉత్తరాఖండ్‌లోని నీతి–మానా లోయ మహిళలను ప్రధాని మోదీ ప్రశంసించారు.

వివరాలు 6లో ▸

గుదిబండ..'అప్పు'డే!

టీడీపీ దిగిపోయే నాటికి రాష్ట్రంపై రుణ భారం రూ.2,64,451 కోట్లు

ఇప్పుడు నాలుగేళ్లలో రూ.1,77,991 కోట్లే

- భారీగా సంక్షేమ పథకాలు, నగదు బదిలీతో పేదలకు లబ్ధి
- సామాజిక హితం లక్ష్యంగా సాగుతున్న సర్కారు పాలన
- పార్లమెంట్ సాక్షిగా వాస్తవాలు మరోసారి వెలుగులోకి
- ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ఏపీ అప్పులు
- ఈ ఏడాది మార్చి చివరకు మొత్తం అప్పులు రూ.4,42,442 కోట్లు
- ఫైనాన్స్ కమిషన్ సిఫార్సుల ప్రకారమే అంతా..
- రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల్లో సుస్థిరత, పారదర్శకత
- మా వ్యయ విభాగం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉంది
- లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సాక్షి, అమరావతి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అప్పులపై టీడీపీతో పాటు దాని అనుబంధ ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనతో మరోసారి తేలిపోయింది. ఏపీ ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన అప్పులు రూ.1,77,991 కోట్లు మాత్రమేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో స్పష్టం చేశారు. 2019 నాటికి ఏపీకి రూ.2,64,451 కోట్లు అప్పులుండగా 2023 మార్చి నాటికి రూ.4,42,442 కోట్లకు చేరినట్లు తెలిపారు. ''ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అసెస్ చేస్తోందా? 2019 మే నుంచి ఏపీ ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసింది? ఆర్థిక పరిస్థితిని అంచనా వేశారా?..'' అంటూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణ రాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్‌ఆర్‌బీఎం) నిబంధనల మేరకు వ్యవహరిస్తోందని తేల్చి చెప్పారు. ద్రవ్యలోటు తగ్గింపు..

మిగతా 11వ పేజీలో ▸



పార్లమెంట్‌లో రచ్చరచ్చ

- మణిపూర్ అంశంపై వెంటనే చర్చ చేపట్టాలి
- ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలి
- ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు, నినాదాలు
- లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా

6లో

మణిపూర్ దురాగతం.. భయానకం



- సుప్రీంకోర్టు ధర్మాసనం ఆందోళన
- మహిళలపై జరిగిన హింసను ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడలేం
- ఇతర రాష్ట్రాలను ప్రస్తావించి మణిపూర్ దారుణాలను సమర్థించుకోలేరు
- బాన్సురీ స్వరాజ్ పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆరు ప్రశ్నలు
- 24 గంటల్లోగా జవాబు చెప్పాలని ఆదేశం

6లో

ఫ్యాక్ట్ చెక్

వరద సహాయక చర్యలపైనా అక్కసు

- ఈనాడు బురద రాతలు
- గతంలో కంటే మిన్నగా సహాయక చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- ముందుగానే అప్రమత్తం చేసి, ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించిన సీఎం జగన్
- వరద సాయానికి రూ.12 కోట్లు ముందుగానే విడుదల
- వలంటీర్ నుంచి ఉన్నతాధికారుల వరకు వరద ప్రభావిత గ్రామాల్లోనే మకాం
- ఐదు జిల్లాల్లో 237 గ్రామాల్లోని 49,262 మంది 85 పునరావాస కేంద్రాలకు తరలింపు
- పునరావాస కేంద్రాల్లో తాగు నీటితో సహా అన్ని సౌకర్యాలు
- లోటు లేకుండా నిత్యావసరాల పంపిణీ.. బాధితులు ఇళ్లకు తిరిగి వెళ్లేప్పుడు రూ.2 వేల వరకు సాయం
- దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు సాయం.. ఇంతకు ముందు ఈ సాయం రూ.5 వేలే
- పునరావాస కార్యక్రమాలకు తక్షణ సాయం రూ.3 కోట్లు విడుదల.. బాబు హయాంలో వరద బాధితులకు ప్రత్యేక సాయం ఊసే లేదు

3లో



వీఆర్‌ఏలకు వెన్నుపోటు పొడిచింది బాబే

- వారికి డీఏ వర్తించదని 2018లో టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది
- ఆ అన్యాయాన్ని సరిదిద్దేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కసరత్తు
- త్వరలో వారికి న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకునే చాన్స్
- ఏ ఒక్క వీఆర్‌ఏ నుంచి డీఏ రికవరీ జరగలేదు..
- అయినా.. ఈనాడు తప్పుడు రాతలు

- వివరాలు 12లో

ఐటీ కంపెనీల భారీ విస్తరణ

విశాఖ, విజయవాడలో విస్తరిస్తున్న టెక్ మహీంద్ర

- 4 నెలల్లోనే విజయవాడలో సీటింగ్ కెపాసిటీ 350కి పెంపు
- విశాఖ క్యాంపస్‌లో అదనంగా మరో 1,000 సీట్లు పెంచుతున్నట్లు ప్రకటించిన విప్రో.. విజయవాడకు అదనంగా తిరుపతిలో హెచ్‌సీఎల్ క్యాంపస్ ఏర్పాటుకు ప్రణాళిక
- గడిచిన నాలుగేళ్లలో ఐటీ రంగంలో కొత్తగా 29,500 ఉద్యోగాల కల్పన.. 2014–19 ఐదేళ్ల కాలంలో ఐటీ ఉద్యోగులు 24,350 ఉంటే ఇప్పుడు 53,850కు పెరుగుదల



- వివరాలు 11లో

క్లెయిమ్ చేయని డిపాజిట్లు వారసులకే

ఇందుకోసం వంద రోజులపాటు ప్రత్యేక డ్రైవ్



- ప్రతి జిల్లాలో ప్రతీ బ్యాంకు టాప్–100 క్లెయిమ్ చేయని డిపాజిట్లు గుర్తించాలి.. ఈ సమయంలో వాటిని సెటిల్ చేయడానికి చర్యలు తీసుకోవాలి
- గత ఐదేళ్లలో క్లెయిమ్ చేయని డిపాజిట్లు రూ.42,272 కోట్లు
- అన్ని బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలు జారీ
- పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి వెల్లడి

- వివరాలు 16లో

నారీ శక్తికి 'చేయూత'

వైఎస్సార్ చేయూతతో 13 లక్షల మంది మహిళలకు శాశ్వత జీవనోపాధి: సీఎం జగన్

- తొలివిడత సాయం పొందినప్పుడే స్వయం ఉపాధికి అనుసంధానించాలి
- ఇప్పటివరకు మూడు విడతల్లో లబ్ధిదారులకు రూ.14,129.11 కోట్లు
- స్త్రీనిధి ద్వారా 9 శాతం వడ్డీకే రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి
- పొదుపు మహిళలకు ఆగస్టు 10న మరో విడత 'వైఎస్సార్ సున్నా వడ్డీ'
- గ్రామ కంఠాల్లో ఇళ్ల యజమానులకు భూహక్కు పత్రాల జారీ వేగవంతం
- సెప్టెంబరుకు దాదాపుగా పూర్తి కానున్న గ్రామ సచివాలయ భవనాలు
- ఇక పట్టణాల్లోనూ వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీల నిర్మాణం



అతిపెద్ద ఇనార్బిట్ మాల్

- విశాఖలో రూ.600 కోట్లతో నిర్మిస్తున్న రహేజా గ్రూప్
- 250కిపైగా బ్రాండ్లకు వేదిక.. 8,000 మందికి ఉపాధి
- రెండో దశలో ఐటీ క్యాంపస్.. మూడోదశలో స్టార్ హోటల్
- నేడు సీఎం జగన్ చేతుల మీదుగా మాల్‌కు శంకుస్థాపన

12లో

సాక్షి, అమరావతి: వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఇప్పటివరకు 13 లక్షల మంది మహిళలు ప్రతి నెలా తమ కుటుంబానికి స్థిరమైన ఆదాయాన్ని పొందేలా శాశ్వత జీవనోపాధులు కల్పించినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో మొత్తం రూ.75 వేలు ఇవ్వనుండగా ఇప్పటివరకు మూడు విడతల్లో లబ్ధిదారులకు రూ.14,129.11 కోట్లు అందచేసినట్లు చెప్పారు. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖతో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాల అమలు తీరుపై సీఎం జగన్ సమీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని మహిళలు ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసుకుని స్వయం ఉపాధి కల్పనకు వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఈ సందర్భంగా సీఎం జగన్ ఆదేశించారు. 'చేయూత' కార్యక్రమంలో స్వయం ఉపాధిని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. లబ్ధిదారులు తొలి విడత డబ్బులు అందుకున్నప్పుడే స్వయం ఉపాధి కార్యక్రమాలకు అనుసంధానం చేస్తే మహిళలకు

మిగతా 12వ పేజీలో ▸

ఇదండీ జగత్




సీమకు సైంధవుడు!

చంద్రబాబు నిర్వాకాలపై మండిపడుతున్న రాయలసీమ రైతన్నలు

- తెలుగుగంగ కెనాల్ లైనింగ్, బ్రహ్మంసాగర్ లీకేజీలపై నాడు మొద్దు నిద్ర
- గాలేరు–నగరిలో కమీషన్ల వసూళ్లపైనే బాబు దృష్టి
- గండికోట, చిత్రావతి నిర్వాసితులకు పునరావాసం మాటే లేదు
- వైఎస్ జగన్ వచ్చాక రూ.600 కోట్లతో తెలుగుగంగ కెనాల్‌కు లైనింగ్
- రూ.90 కోట్లతో మట్టికట్టకు డయాఫ్రమ్ వాల్‌తో బ్రహ్మంసాగర్ లీకేజీలకు అడ్డుకట్ట.. డిజైన్ మేరకు తెలుగు గంగ ద్వారా నీటిని తరలించి బ్రహ్మంసాగర్‌లో పూర్తి స్థాయిలో నిల్వ
- ఆయకట్టుకు సమృద్ధిగా నీటి సరఫరాతో రైతుల జీవితాల్లో వెలుగులు
- అవుకు రెండో సొరంగం పూర్తి.. 20 వేల క్యూసెక్కుల తరలింపునకు లైన్ క్లియర్
- రూ.వెయ్యి కోట్లతో గండికోట నిర్వాసితులకు, రూ.600 కోట్లతో చిత్రావతి నిర్వాసితులకు పునరావాసం.. ఆ రెండు రిజర్వాయర్లలో పూర్తి స్థాయిలో నీటి నిల్వ
- శ్రీశైలంలో 800 అడుగుల నుంచే మూడు టీఎంసీలు తరలించేలా రాయలసీమ ఎత్తిపోతల
- ఎన్జీటీలో కేసులతో సైంధవుడిలా అడ్డుపడుతున్న చంద్రబాబు
- హంద్రీ–నీవాలో అంతర్భాగంగా ముచ్చుమర్రి ఎత్తిపోతలను చేపట్టిన మహానేత వైఎస్సార్
- 2009 నాటికే 90 శాతం పూర్తి
- వైఎస్ దాదాపు పూర్తి చేసిన ఈ పథకాన్ని 2017లో జాతికి అంకితం చేసిన చంద్రబాబు
- కమీషన్ల కక్కుర్తితో కుప్పానికి 'హంద్రీ–నీవా' తరలింపులో బాబు వైఫల్యం.. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేయిస్తున్న సీఎం జగన్

4లో



రాష్ట్రంలో 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో వెలగబెట్టిందేమీ లేకపోగా, పోజులివ్వడానికి మాత్రం ఎప్పుడూ ముందుంటారు. ఇతరులు చేసిన పనులను సైతం నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకోవడంలో ఈ పెద్దమనిషిది అందె వేసిన చేయి. కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పడం, అదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే గుడ్లురిమి చూడటం, 'పచ్చ' మూక/మీడియాతో ఎదురు దాడి చేయించడం ఆయన గారికి మంచి నీళ్లు తాగినంత సులువు. రాయలసీమలో పుట్టి ఆ ప్రాంతానికే వెన్నుపోటు పొడవడంలో కూడా ఆయనకు ఆయనే సాటి. ఓటుకు కోట్లు కేసుకు జడిసి కృష్ణా జలాలపై హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆ తప్పిదాన్ని సరిచేస్తుంటే సైంధవుడిలా అడ్డుపడుతున్నారు. తగుదునమ్మా అంటూ ఇప్పుడు 'సీమ' ప్రాజెక్టుల వద్ద ఫొటో సెషన్‌కు బయలుదేరారు. ఇలా ఏ మొహం పెట్టుకుని వెళ్తున్నావు చంద్రబాబూ!?



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం..

అదో సామాజిక ఆర్థిక నేరం

కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు గత ప్రభుత్వ పెద్దలకు కల్పతరువుగా మారిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణాన్ని సామాజిక–ఆర్థిక నేరంగా హైకోర్టు అభివర్ణించింది. రూ.371 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణలున్నందున భాస్కర్‌ప్రసాద్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని హైకోర్టు తేల్చిచెప్పింది.

16లో

INSPIRED BY INNOVATION, DEFINED BY EXCELLENCE



Talent that is chosen by globally renowned companies

1200+ PLACEMENT OFFERS IN 100+ TOP MNCS

HIGHEST PAY PACKAGE 46 LPA

Above 7 LPA:	Above 5 LPA:	Above 10 LPA:
200 OFFERS	446 OFFERS	57 OFFERS

OUR CURRICULUM

- Minor & Honors B.Tech degrees in all engg. disciplines
- NBA accredited programs
- 100% Career upskilling placements and higher education
- Innovation & Startups through 'EPICS' in curriculum
- Global certifications through 20+ collaborative labs in the campus and industry MOUs
- Alumni scholarships for underprivileged students in UG & PG

ACKNOWLEDGEMENTS & RECOGNITIONS

- NIRF-Innovation Ranking 2023 Band 51-100
- Ranked below 200 for 6 years successively by NIRF, MoE, GOI
- Smart India Hackathon 2022 winners at IIT Roorkee
- AICTE – CII 'Platinum' rating for 4 successive years in a row: 2017, 2018, 2019 and 2020
- Best practices of excellence in tune with the expectations of UGC/AICTE/Industry
- Only private institute selected under 'Margdarshan' by AICTE in Andhra Pradesh in 2018
- NABL accredited labs in Civil Engineering, a prestigious progress in academic institutions

TOP RECRUITERS: amazon, Texas Instruments, Adobe, Wells Fargo, Cisco, Walmart, National Instruments, AT&T, Morgan Stanley, Larsen & Toubro, Bosch, Ashok Leyland, Hyundai, JSW, NTPC, kcp

VELAGAPUDI RAMAKRISHNA SIDDHARTHA ENGINEERING COLLEGE (AUTONOMOUS)

Estd. 1977

Kanuru, Vijayawada-520 007, A.P. Phone: 0866-2582333. www.vrsiddhartha.ac.in



WHEN OUR STUDENTS EXCEL, WE SHINE.

Our belief that excellence is not a skill but a way of thinking, creates the perfect learning environment that shapes winners. While our world-class facilities and holistic approach ensure prestigious rankings and accreditations. Not surprisingly, we attract the best campus placements with coveted offers every year.

921 OFFERS RECEIVED FROM 70 COMPANIES

HIGHEST PAY PACKAGE 44 LPA | SUPER DREAM & DREAM OFFERS 187 (FROM 5 LPA TO 44 LPA)

SUPER DREAM & DREAM OFFERS

amazon	Walmart	Wells Fargo	Airbus	Juspay
44 LPA	25 LPA	20 LPA	12 LPA	11 LPA

accenture	cognizant	Capgemini	virtusa	Hexaware
238 OFFERS (4.5-6.5 LPA)	154 OFFERS (4 - 6.75 LPA)	84 OFFERS (4.25-7.5 LPA)	56 OFFERS (6 - 7.5 LPA)	35 OFFERS (4.0-6 LPA)

IBM, SoCtronics, virtusa, Berger, Synopsys, JSW, SSHS, Sonata, Accolite Digital, THIS, JPMorgan, tcs, Deloitte

- NAAC Accredited with A+
- All UG Programmes accredited by NBA
- Ranked 73 by Times Survey
- Ranked 98 by Outlook
- Ranked 141 by the week (Engineering colleges All India)
- Ranked 130 by Business World
- Careers360 – Outlook 2023 – AAA+ Rating
- Ranked 142 by India Today
- CII_AICTE ratings: Gold for 3 Years, Platinum for 2 Years

Minor & Honours B.Tech Degrees

NBA Accredited All UG Programs

MSME Host Recognised as host Institute for MSME Govt of India

61 Lakhs worth Scholarships given to Meritorious students

EXCELLENCE IN PLACEMENTS 2023

921 Offers as on date	8.60 LPA top 50 students average pay	4.50 LPA median pay	44 LPA highest pay	160+ 6 LPA CTC

ACKNOWLEDGEMENTS & RECOGNITIONS


- NIRF Ranking – 201-250 band for three Consecutive years
- NIRF-Innovation Ranking Band-101-150
- Smart India Hackathon Winners at BITS Mesra, Ranchi & MIT Aurangabad
- Granted PARAMARSH SCHEME by UGC to hand hold 6 HEI to participate in NAAC accreditation
- Received Influential Student award from APSCHE
- Reputed organisations like EPAM, Hexaware, Virtusa have established their Centres of Excellence in PVPSIT
- 58 Lakhs worth Google Scholarship received by B.Tech students under Women Engineers Programme
- Virtusa Neural Hack Season 5 & 6 winning team member at International level
- MOU's with 69+ Industries
- E Yantra Lab tie up with IIT Bombay
- MOUs with NITTTR Chennai, Chandigarh & Kolkata

ADMISSIONS OPEN FOR STUDENTS WANTING TO EXCEL IN THEIR CAREER

PRASAD V. POTLURI SIDDHARTHA INSTITUTE OF TECHNOLOGY (AUTONOMOUS)

Vijayawada. www.pvpsiddhartha.ac.in

సీఎం జగన్‌కు హెచ్‌ఆర్‌సీ వార్షిక నివేదిక అందజేత



సీఎం వైఎస్ జగన్‌కు హెచ్‌ఆర్‌సీ నివేదికను అందించిన చైర్మన్, సభ్యులు

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ మంధాత సీతారామమూర్తి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) 2022 –23 వార్షిక నివేదికను సీఎం జగన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్యుడిషియల్ సభ్యులు దండే సుబ్రహ్మణ్యం, నాన్ జ్యుడిషియల్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసరావు గోచిపాత తదితరులు పాల్గొన్నారు.

నార్కో టెస్ట్‌కు నేను రెడీ : పొంగూరు ప్రియ

మాజీ మంత్రి నారాయణకూ నిర్వహించాలని డిమాండ్



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తనకు అనారోగ్యంగా ఉన్నా..ఓపిక చేసుకొని రాయదుర్గం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఇప్పటి వరకు పోలీసులు తనకు ఎఫ్‌ఐఆర్ కాపీ ఇవ్వలేదని, ఎవరి ఒత్తిళ్లకు లొంగి ఇలా చేస్తున్నారని మాజీ మంత్రి నారాయణ మరదలు పొంగూరు ప్రియ సోమవారం ట్విట్టర్‌లో ప్రశ్నించారు. తాను జనసేన పార్టీకి, పవన్‌కళ్యాణ్‌కు వీరాభిమానినని తెలిపారు. తనకు సమస్య వస్తే పవన్ పట్టించుకోలేదని, ఆయన సీఎం అయితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తాను చెప్పిన వాటిల్లో నిజాలు నిగ్గుతేల్చేందుకు నార్కో టెస్ట్‌కు సిద్ధమని, తనది తప్పని తేలితే నారాయణ కాళ్లు పట్టుకుని క్షమాపణ కోరతానని చెప్పారు. నారాయణకు కూడా నార్కో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నారాయణ వైద్యశాలలో సుప్రసిద్ధులైన మహిళా డాక్టర్లు చాలా మంది నారాయణ లైంగిక వేధింపులు తాళలేక అక్కడ ఉద్యోగాలు మానేసి వెళ్లిన వాస్తవాలు ఆధారాలతో సహా తన వద్ద ఉన్నాయన్నారు. సాటి మహిళల పేర్లు చెప్పి వారిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకే వారి పేర్లను చెప్పడంలేదని తెలిపారు.

కులవాదులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

1,037వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: బహుజనులకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను అడ్డుకుంటూ.. పదే పదే తప్పుడు కేసులు వేస్తున్న కులవాదులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 1,037వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరచిన విధంగా బహుజనులకు అన్ని రకాలుగా న్యాయం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అడుగులు వేస్తుంటే అడ్డుకునేందుకు కులవాదులు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. నాయకులు ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, పులి దాసు, నూతక్కి జోషి పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలపైనా అక్కసు

గతంలో కంటే మిన్నగా సహాయక చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. అయినా ఈనాడు బురద రాతలు

సాక్షి, అమరావతి/ సాక్షి, పాడేరు: గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎంతో ముందు చూపుతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పకడ్బందీగా వరద సహాయక చర్యలు చేపట్టడమే రామోజీరావు అక్కసుకు కారణమైంది. ఎలాంటి నష్టం జరగకుండా, ఏ లోటూ లేకుండా వరద బాధితులు పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉండటం చూసి ఆయన తట్టుకోలేక కన్నీటి వరద కారుస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ నిరంతర పర్యవేక్షణలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికార యంత్రాంగం మొత్తం గోదావరి వరద బాధితులకు సహాయక చర్యల్లో నిమగ్నమైనా ఈనాడు మాత్రం అవి కనపడకుండా కళ్లు మూసుకొని, అధికార యంత్రాంగం మొద్దునిద్రలో ఉన్నట్లుగా భ్రమిస్తోంది. ఆ భ్రమలనే వార్తలుగా మలచి సీఎం వైఎస్ జగన్ పైన, ప్రభుత్వం పైన రకరకాల పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోంది. వరదల సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులను అప్రమత్తం చేశారు. జూలై 28వ తేదీన ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వరదల వల్ల ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదని స్పష్టం చేశారు. అవసరమైన అన్ని చర్యలు ఆగమేఘాలపై తీసుకునేలా యంత్రాంగాన్ని నడిపించారు. గ్రామ వలంటీర్ నుంచి సచివాలయాల సిబ్బంది, ఐఏఎస్ అధికారులు, రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది వరద ప్రభావిత గ్రామాల్లోనే మకాం వేసి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. గత ప్రభుత్వంలో కంటె ఇప్పుడు ఎంతో మిన్నగా వరద సహాయక చర్యలు చేపట్టారు. ఏ ప్రాంతానికి వెళ్లినా ఇవి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

85 పునరావాస కేంద్రాలకు 49 వేల మంది తరలింపు

వరద ప్రభావిత ఐదు జిల్లాల్లో 237 గ్రామాల్లోని 49,262 మందిని 85 పునరావాస కేంద్రాలకు తరలించారు. 10 లాంచీలు, 230 బోట్లతో బాధితుల్ని పెద్దఎత్తున తరలించే దృశ్యాలు అన్ని చోట్లా కనిపిస్తూనే ఉన్నాయి. పది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రభుత్వ సిబ్బంది ముంపు గ్రామాల్లో తిరుగుతూ అందరినీ పునరావాస కేంద్రాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ కల్పించారు. తాగునీరు, నిత్యావసరాలకు ఎటువంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, ఫాగింగ్ వంటి పారిశుధ్య చర్యలు చేపట్టారు. అవసరమైన వారికి వెంటనే వైద్యం అందించేందుకు వైద్య బృందాలను నియమించారు. బాధితులకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి క్షణం అందుబాటులో ఉంటున్నారు. బాధితులకు నిత్యావసరాలకు లోటు రాకుండా అన్ని రకాల సరకులని స్టాక్ పాయింట్లకు ముందే పంపించారు. ప్రతి బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, లీటర్ పామాయిలు ఇస్తున్నారు.



చింతూరు పునరావాస కేంద్రంలో కూరగాయలు పంపిణీ చేస్తున్న సిబ్బంది



ఆస్పత్రికి తరలించిన గర్భిణిలకు భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

ముందే రూ.12 కోట్లు విడుదల

వరద సహాయక చర్యల కోసం సీఎం జగన్ 5 జిల్లాలకు తక్షణమే రూ.12 కోట్లు విడుదల చేశారు. గతంలో ఎప్పుడూ ఇలా వరదల సమయంలోనే ముందుగా నిధులు విడుదల చేయలేదు. చంద్రబాబు హయాంలో వరదలు వచ్చి, అంతా మునిగిపోయి ప్రజలు గగ్గోలు పెట్టిన తర్వాత అరకొరగా నిధులిచ్చేవారు. దీంతో జిల్లా కలెక్టర్లు రకరకాల ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా సహాయక చర్యల ప్రారంభానికి ముందే నిధులిచ్చే సంప్రదాయానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. వరద బాధితులకు అందించే ప్రత్యేక ఆర్థిక సాయం విషయంలోనూ సీఎం సరికొత్త రీతిలో ముందుకెళుతుండడం ఈనాడుకు మింగుడుపడడం లేదు. చంద్రబాబు హయాంలో ఈ ప్రత్యేక సాయం ఊసే ఉండేది కాదు. వరద తగ్గిన తర్వాత తెలుగు తమ్ముళ్లు బాధితులకు ఇచ్చినట్లు రాసేసుకుని ఆ సొమ్ముని మింగేసేవారు. ఇప్పుడు అలాంటివేమీ లేకుండా వరద తగ్గిన తర్వాత బాధితులు తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు రూ.1,000 నుంచి రూ.2,000 ఆర్థిక సాయం అందిస్తున్నారు. వరదల వల్ల దెబ్బతిన్న ఇళ్లకు ఇచ్చే పరిహారాన్ని కూడా సీఎం వైఎస్ జగన్ రూ.10 వేలకు పెంచారు. గతంలో ఇది రూ.5 వేలు మాత్రమే.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇవేమీ కనిపించని ఈనాడు

ఈనాడు బృందం తిరిగినట్లుగా చెప్పుకొంటున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రభుత్వ చర్యలు విస్పష్టంగా కనిపిస్తున్నా, అక్కడ ఏదీ జరగనట్లే అబద్ధాలు రాసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. వరదలపై ముఖ్యమంత్రి ముందస్తుగా ఆదేశించిన వెంటనే జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పెద్ద ఎత్తున సహాయక కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టర్‌తో సహా అధికార యంత్రాంగం చింతూరులో మకాం వేసింది. వరదపై ప్రజలను ముందుగానే అప్రమత్తం చేసింది. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. సిద్ధం చేసింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సిద్ధంగా ఉంచింది. చింతూరు డివిజన్లోని నాలుగు మండలాల్లో 177 గ్రామాలు వరదలకు ప్రభావితమవగా 110 పునరావాస కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 24,279 కుటుంబాలను తరలించింది.

బాధితులకు సత్వర సాయం

వరద బాధితులకు తక్షణ సాయం అందించేందుకు ప్రభుత్వం నాలుగు మండలాల్లో ముందుగానే స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి నిత్యావసర సరకులను నిల్వ చేసింది. ముంపు ప్రాంతాల్లో జూలై, ఆగస్టు నెలల రేషన్‌ను ముందుగానే పంపిణీ చేసింది. నాలుగు మండలాల్లో సహాయక చర్యల నిమిత్తం రూ.3 కోట్లు మంజూరు చేసింది.



వరద ముంపు గ్రామాల ప్రజలకు టార్పాలిన్‌లను తరలిస్తున్న సిబ్బంది

అల్లూరి సీతారామరాజు జిల్లా నాలుగు మండలాల్లో బాధితులకు పంపిణీ చేసిన నిత్యావసరాలు

బాధితులకు ఇచ్చిన బియ్యం: 1,211 మెట్రిక్ టన్నులు
పాలు: 10 వేల లీటర్లు
కందిపప్పు: 18,674 కిలోలు
మంచి నూనె: 3,200 లీటర్లు
ఉల్లిపాయలు: 31 వేల కిలోలు
బంగాళాదుంపలు: 31 వేల కిలోలు
దొండకాయలు: 22 వేల కిలోలు
వంకాయలు: 3,800 కిలోలు
క్యాబేజీ: 1,000 కిలోలు
కొవ్వొత్తులు: 25 వేలు
అగ్గిపెట్టెలు: 4,800
టార్పాలిన్లు: 840

ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు



సీఎం జగన్ ఆదేశాల మేరకు వరద బాధితులకు ఎలాంటి నష్టం జరగకుండా నాలుగు మండలాల్లో ముందస్తు చర్యలు చేపట్టాం. ప్రతి మండలానికి ప్రత్యేకాధికారులను నియమించాం. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలను సురక్షితంగా తరలించి వారికి నిత్యావసరాలు, కూరగాయలు పంపిణీ చేశాం. గర్భిణులను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాం. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించాం. గోదావరి, శబరి నదుల్లో వరద తగ్గడంతో ఆయా ముంపు గ్రామాల్లో సహాయక కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తున్నాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్, అల్లూరి సీతారామరాజు జిల్లా

అన్ని విధాలుగా ఆదుకున్నారు



పునరావాస కేంద్రంలో తలదాచుకున్న మాకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంది. పక్కా భవనంలో విద్యుత్ సౌకర్యంతో పాటు నిత్యావసరాలు కొరత లేకుండా అందించింది. ప్రభుత్వ సిబ్బంది అందుబాటులో ఉంటూ మా బాగోగులు చూసుకున్నారు

– కొండా సరోజిని, చింతూరు

అన్ని సౌకర్యాలు కల్పించారు



ఇంటి సమీపంలోకి వరద వస్తుండడంతో గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తీసుకొచ్చారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు కల్పించారు. తాగు నీటికి ఇబ్బంది లేదు. బియ్యం, పప్పులు, కూరగాయలు, పాలు అందించారు.

– మాటూరి శ్రీనివాసరావు, చింతూరు శబరిఒడ్డు

అధికారులు అప్రమత్తం చేశారు



వరద సమాచారంపై అధికారులు మమ్మల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలించారు. అందరం ఇక్కడ సురక్షితంగా ఉన్నాం.

– బొర్రా పద్మారెడ్డి, వడ్డిగూడెం, వీఆర్‌పురం మండలం

అధికారుల స్పందన బాగుంది



వరదల సమయంలో అధికారుల స్పందన బాగుంది. ప్రభుత్వం చేపట్టిన సహాయక కార్యక్రమాలతో అందరం సురక్షితంగా ఉన్నాం. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న మాకందరికీ నీరు, బియ్యం, పాలు సహా అన్నీ అందుబాటులో ఉంచుతున్నారు. ఏ లోటూ రాకుండా చూస్తున్నారు.

– యడ్ల బాయమ్మ, టేకులబోరు, కూనవరం మండలం

రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణపై సంఘాల సలహాలు

- స్థానికత, జోనల్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణపై చర్చ
- సర్వీసెస్ శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఉద్యోగ సంఘాలతో భేటీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్స్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్మెంట్)కి సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు 1975కు సవరణ ప్రతిపాదనపై రాష్ట్ర సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్ అధ్యక్షతన సోమవారం సచివాలయంలో వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. రాష్ట్ర విభజన అనంతరం పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో స్థానికత, జోనల్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ చేస్తున్నందున రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ ప్రతిపాదనపై సమావేశంలో చర్చించారు. ఉద్యోగ సంఘాల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించారు. తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన రాష్ట్ర స్థాయి కమిటీకి నివేదించనున్నట్లు కార్యదర్శి భాస్కర్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్ రెడ్డితోపాటు పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమైన పోలా భాస్కర్

జోన్ల సంఖ్యపై తర్జనభర్జన

జిల్లాల సంఖ్య పెరిగినందున జోనల్ వ్యవస్థపై రాష్ట్రపతి ఉత్తర్వులకు సవరణ చేయాల్సి ఉంది. జోనల్ వ్యవస్థపై ఎలా చేస్తే బాగుంటుందో అభిప్రాయాలను స్వీకరించారు. ఇప్పుడున్న నాలుగు జోన్లు కొనసాగించాలా? లేక ఆరు జోన్లకు పెంచాలా? అనే అంశంపై చర్చ జరిగింది. తిరుపతి, అల్లూరి సీతారామరాజు జిల్లాలను ఏ జోన్‌లో కలపాలనే అంశంపై కొంత సందిగ్ధత నెలకొంది. గతంలో 10వ తరగతి లోపు ఏడేళ్ల ఎక్కడ చదివితే అది లోకల్ స్టేటస్‌గా పరిగణించారు. దీన్ని 7 వరకు తగ్గించడంపై చర్చ జరిగింది. లోకల్ క్యాడర్‌లో ఏ పోస్టులు ఉండాలి? జోనల్ స్థాయిలో ఏ పోస్టులు ఉండాలి? అనే వాటిపై అభిప్రాయాలను సేకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, నిరుద్యోగులతో ముడిపడిన అంశాలు ఉన్నందున కార్యవర్గ సభ్యులతో చర్చించి లిఖిత పూర్వకంగా తెలియచేస్తాం. రాష్ట్రపతి ఉత్తర్వుల వల్ల లోకల్ క్యాడర్‌లోకి వెళ్లే సచివాలయ ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్న మా విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

- కె.వెంకటరామిరెడ్డి, ఏపీ సెక్రటేరియేట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్

ఏకాభిప్రాయానికి వచ్చాక కేంద్రానికి..

ఉమ్మడి రాష్ట్రంలో 1974లో రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి నాలుగు జోన్లు కొనసాగుతున్నాయి. వీటిని ఆరు చేయాలా? లేదంటే ఏడు జోన్లుగా మార్చాలా? అనే అంశంపై చర్చ జరిగింది. రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగా చేపట్టాలని కోరాం. ఏకాభిప్రాయానికి వచ్చాక కేంద్రానికి నివేదిస్తారు. జూనియర్ అసిస్టెంట్ స్థాయిని జిల్లా క్యాడర్‌గా, సూపరింటెండెంట్‌లోపు క్యాడర్‌ను జోనల్ క్యాడర్ గానూ, ఫస్ట్ గెజిటెడ్ స్థాయిని మల్టీ జోనల్ క్యాడర్‌గా గతంలో ఇచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వులను అలాగే ఉంచాలి. జిల్లా స్థాయి బదిలీలను వారి అంగీకారంతో చేపట్టాలని కోరాం. జూనియర్ లేదా సీనియర్ అసిస్టెంట్లను దూర ప్రాంతానికి బదిలీ చేస్తే ఇబ్బందులు పడతారు. ఆ నిబంధన సవరించాలని కోరాం. గోదావరి, వంశధార, హంద్రీనీవా, వెలిగొండ, శ్రీశైలం, పోలవరం ప్రాజెక్టుల్లో పని చేస్తున్న వారికి రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించడం లేదు. రూ.500 కోట్లు దాటిన ప్రతి ప్రాజెక్టుకు రాష్ట్రపతి ఉత్తర్వులు, జోనల్ సిస్టమ్‌ను అమలు చేయాలి. ప్రాజెక్టుల వద్ద సిబ్బంది సంఖ్య తక్కువగా, పని ఎక్కువగా ఉంది.

- బండి శ్రీనివాస్, ఏపీఎన్జీవో అధ్యక్షుడు

లిఖితపూర్వకంగా తెలియజేస్తాం

1975లో తెచ్చిన జోనల్ వ్యవస్థలో మార్పులపై రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను అడిగింది. కొత్త జిల్లాలకు ఉద్యోగులను కేటాయించినప్పుడు తొలుత వారికి ఆప్షన్ ఇవ్వాలని కోరాం. సీనియారిటీ పరిగణలోకి తీసుకోవాలి. ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లను 6కి పెంచడంపై అభిప్రాయాలను అడిగారు. దీనిపై గురువారం సాయంత్రం నాటికి లిఖిత పూర్వకంగా తెలియచేస్తాం.

- బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్

పార్టీ నుంచి వెళ్లినందుకు థ్యాంక్యూ వెరీమచ్

కరణం బలరామ్, శిద్దా రాఘవరావును ఉద్దేశించి లోకేశ్ వ్యాఖ్య



దర్శి, ముండ్లమూరు: 'టీడీపీలో గెలిచి వైఎస్సార్‌సీపీలోకి వెళ్లిన ఓ పెద్దాయనకు, దర్శి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయినా పార్టీ ఓడిపోయిన తర్వాత వెళ్లిపోయిన మరొక నేతకు థ్యాంక్యూ వెరీమచ్..' అని టీడీపీ నాయకుడు నారా లోకేశ్ అన్నారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావును ఉద్దేశించి వారి పేర్లు ప్రస్తావించకుండా ఆయన ఇలా వ్యంగ్యంగా మాట్లాడారు. యువగళం పేరుతో లోకేశ్ చేపట్టిన పాదయాత్ర సోమవారం ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలో కొనసాగింది. ముండ్లమూరులో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ '2019 నుంచి 2024 మధ్యలో కార్యకర్తలు ఎన్ని కేసులు పెట్టించుకుంటే అంత పెద్ద పదవి ఇప్పించే బాధ్యత నాది. టీడీపీ అధికారంలోకి వస్తే కార్యకర్తలకు జెండాలు ఇవ్వను.. కర్రలు ఇస్తా...' అని కార్యకర్తలను రెచ్చగొట్టారు. స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను కలెక్షన్ గోపాల్... అంటూ విమర్శలు చేశారు. అయితే ముండ్లమూరులో సభ పెట్టి కనీసం ఆ మండలానికి ఏమి చేస్తామనేది చెప్పకుండా కేవలం కార్యకర్తలను రెచ్చగొట్టే ధోరణిలోనే లోకేశ్ ప్రసంగించడంపై టీడీపీ నాయకులే తీవ్ర అసహనం వ్యక్తంచేస్తూ మధ్యలోనే వెళ్లిపోయారు. దర్శి నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌ని ప్రకటించాలని కార్యకర్తలు కేకలు వేస్తున్నా... లోకేశ్ పట్టించుకోకుండా ప్రసంగించడం విశేషం.

తెలుగు శాసనాలను భద్రపరచండి



సీఎస్‌కు వినతిపత్రం అందిస్తున్న తొలి వెలుగుదివ్వె, తెలుగు మూలాల అధ్యయన సంఘం ప్రతినిధులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జిల్లా కలమల్ల, ఎర్రగుడిపాడులోని తొలి తెలుగు శాసనాలను, ఇదే జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 33 శాసనాలను విజయవాడలోని బాపు మ్యూజియానికి తరలించి భావితరాల కోసం భద్రపరచాలని తొలి వెలుగుదివ్వె, తెలుగు మూలాల అధ్యయన సంఘం ప్రతినిధులు సీఎస్ జవహర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎస్‌కు సోమవారం ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, సభ్యుడు రామచంద్రారెడ్డి, తెలుగు మూలాల అధ్యయన సంఘం ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు వినతిపత్రం అందించారు.

మానవ అక్రమ రవాణా కట్టడికి చర్యలు

'క్యాంపెయిన్ విముక్తి' సదస్సులో సీఐడీ ఎస్పీ ఫకీరప్ప



'క్యాంపెయిన్ విముక్తి' పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐడీ ఎస్పీ ఫకీరప్ప, బబిత, సరిత తదితరులు

సాక్షి, అమరావతి: మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు సీఐడీ విభాగం అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా పని చేస్తోందని సీఐడీ ఎస్పీ ఫకీరప్ప పేర్కొన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీఐడీ విభాగం 'క్యాంపెయిన్ విముక్తి' పేరిట విజయవాడలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ స్వేచ్ఛ, స్వాభిమాన్ హెల్ప్‌లైన్, క్యాంపెయిన్ విముక్తి వంటి వినూత్నమైన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ గౌరవ కార్యదర్శి బబిత మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన వన్ స్టాప్ క్రైసిస్ టీమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ, కార్మిక శాఖ, లీగల్ సర్వీసెస్ అథారిటీ మరింత సమన్వయంగా పని చేయాలని చెప్పారు. ఉమెన్ ప్రొటెక్షన్ వింగ్ ఎస్పీ కేజీవీ సరిత మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన 13 జిల్లాల్లోనూ త్వరలో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ డీసీపీ అజిత వేజెండ్ల, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గణేశన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నీ మారుతున్నాయని మీరు గ్రహిస్తే మీరు పట్టి ఉంచడానికి ప్రయత్నించేది ఏమీ ఉండదు. మీరు వైఫల్యానికి భీతి చెందకపోతే మీరు సాధించలేనిది ఏదీ లేదు.

– తావోయిజం

సాక్షి

మంగళవారం, 1 ఆగస్టు 2023

దక్షిణాసియాపై ఉగ్ర పంజా

ఉగ్రవాద బెడద ఇంకా సజీవంగానే ఉన్నదని మన పొరుగునున్న పాకిస్తాన్‌లో తరచు జరిగే దాడులు నిరూపిస్తుండగా మన దేశంతోపాటు బంగ్లాదేశ్, మయన్మార్‌లలో తన కార్యకలాపాలు విస్తరించుకోవటానికి అల్ కాయిదా పథకరచన చేస్తున్నదని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి అనుబంధ నివేదిక హెచ్చరిస్తోంది. ఉగ్రవాద సంస్థల తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తూ అవసరమైన ఆంక్షలను సిఫార్సు చేసే విభాగం ఈ నివేదికను రూపొందించింది. ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో అఫ్గానిస్తాన్‌లో అడుగుపెట్టి రెండు దశాబ్దాలపాటు సాగించిన పోరాటం చెప్పుకోదగ్గ ఫలితం ఇవ్వకపోగా, అన్నివిధాలా దెబ్బతిన్న అమెరికా రెండేళ్ల క్రితం అక్కడినుంచి వెనుదిరిగింది. దేశంలోని అన్ని వర్గాల మధ్యా సామరస్య సాధనకు ప్రయత్నించటం, అఫ్గాన్ సమస్యతో సంబంధం వున్న దేశాలకు శాంతిప్రక్రియలో చోటీయటం వంటివేమీ చేయకుండానే అమెరికా కాడి కింద పారేసింది. దాని ఫలితంగానే ఆ దేశంలో మహిళలను దారుణంగా అణిచేయటం, ప్రత్యర్థులను కున్నవారిని తుదముట్టించటం కొనసాగుతూనే ఉంది. ఆఖరికి తమ గడ్డపై నుంచి ఎటువంటి ఉగ్రవాద కార్యకలాపాలనూ అనుమతించబోమని అమెరికాకు ఇచ్చిన హామీని సైతం తాలిబన్ పాలకులు తుంగలో తొక్కారు. భద్రతా మండలి తాజా నివేదిక దాన్నే ధ్రువీకరిస్తోంది.

తమ భూభాగంలో అల్ కాయిదా లేనేలేదని తరచు బుకాయిస్తున్న తాలిబన్‌ల తీరుకు భిన్నంగా అడపా దడపా ఆ ఉగ్ర సంస్థ జాడల గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం ఆ దేశంలో అల్ కాయిదా ముఖ్యులు దాదాపు 60 మంది వరకూ ఉండగా, ఉగ్ర కార్యకలాపాలు నిర్వహించే మరో 400 మంది ఉన్నారని భద్రతామండలి నివేదిక తెలిపింది. వీరికి మద్దతుగా నిలబడే బంధువర్గాన్నీ, సన్నిహితులనూ పరిగణనలోకి తీసుకుంటే మొత్తం 2,000 మంది ఉంటారని ఆ నివేదిక అంచనా వేసింది. అల్ కాయిదా నేతృత్వంలో రూపుదిద్దుకున్న మరో ఉగ్ర సంస్థ భారత ఉపఖండ అల్ కాయిదా (ఏక్యూఐఎస్)కు ప్రస్తుతం 200 మంది ఉగ్రవాదులున్నారని, ఈ సంస్థ పాకిస్తాన్‌లోని తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ)తో విలీనమై మన దేశంలోని జమ్మూ, కశ్మీర్‌తోపాటు మయన్మార్, బంగ్లాదేశ్‌లలో కార్యకలాపాలకు సిద్ధమవుతున్నదని భద్రతామండలి నివేదిక అంటున్నది. టీటీపీ ఆనుపానులు కనిపెట్టడంలో, ఆ సంస్థను నియంత్రించటంలో పాకిస్తాన్ పదే పదే విఫలమవుతోంది. టీటీపీతో పాకిస్తాన్ ప్రభుత్వం జరుపుతున్న చర్చలు నిరుడు నవంబర్‌లో విఫలమయ్యాక ఉగ్ర దాడులు మళ్లీ పెరిగాయి. ఈ ఏడాది జనవరిలో ఒక మసీదుపై దాడిచేసి 95 మంది ప్రాణాలు తీసిన ఉగ్రవాదులు, తాజాగా ఆదివారం ఖైబర్ ఫక్తున్‌ఖ్వా రాష్ట్రంలో ఆత్మాహుతి దాడి జరిపి, 40 మంది మరణానికి కారకులయ్యారు. అయితే ఈ దాడుల వెనక తాము లేమని టీటీపీ చెబుతోంది. ఆ సంస్థకు దన్నుగా నిలుస్తున్న అఫ్గాన్ ప్రభుత్వం కూడా ఖండిస్తోంది. ఇరుగు పొరుగుకు ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తున్న దేశంగా ముద్రపడిన పాకిస్తాన్ చివరకు అదే ఉగ్రవాదం సాలెగూటిలో చిక్కుకుని విలవిల్లాడటం, దాడుల కారకులెవరో కూడా గుర్తుపట్టలేని నిస్సహాయ స్థితిలో పడటం వింతేమీ కాదు. దేశంలో లెక్కకు మించిన ఉగ్రవాద సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని పాక్ సైన్యం అంచనా వేస్తోంది. ఇవన్నీ అటు సైన్యం పైనా, ఇటు పౌరుల పైనా తరచు దాడులు సాగిస్తున్నాయి. ఉగ్రవాద సంఘటనలు జరిగినప్పుడు ఏ సంస్థా తన ప్రమేయం ఉన్నదని ప్రకటించటం లేదు. ఇప్పుడు టీటీపీ, అల్ కాయిదాలు విలీనం కాబోతున్న వార్త నిజమే అయిన పక్షంలో దక్షిణాసియా ప్రాంత దేశాలతోపాటు పాకిస్తాన్‌కు కూడా మరింత ముప్పు ఖాయం. ఈ రెండు సంస్థలూ అఫ్గాన్‌లో ఇప్పటికే శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నాయని తాజా నివేదిక వెల్లడించింది.

ఆ సంస్థలను అన్నివిధాలా కట్టడి చేస్తున్నామని భ్రమల్లో కూరుకుపోయిన ప్రపంచ దేశాలు ఒకసారి సమీక్షించుకోవటం మంచిది. తమ గడ్డపై ఉగ్రవాద కార్యకలాపాలకు అనుమతించబోమని గతంలో ఇచ్చిన హామీకి తాలిబన్‌లు కట్టుబడటం లేదని ఈ పరిణామాలన్నీ నిరూపిస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలేమిటన్న అంశంపై ఐక్యరాజ్యసమితి దృష్టి పెట్టాలి. తగినన్ని నిధులు లేకుండా, ఎవరి అండదండలూ లేకుండా ఉగ్రవాద సంస్థలు వర్ధిల్లటం ఉత్తమాట. దాదాపు 20 ఉగ్రవాద సంస్థలు పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో తిష్ఠ వేసి, కార్యకలాపాలు సాగిస్తున్న సంగతి తాలిబన్ పాలకులకు తెలియదనుకోవటం భ్రమ. తమతోపాటు కలిసినడుస్తున్నట్టు కనిపిస్తున్న నేతల్లో కొందరు వేరే ఉగ్ర సంస్థలకు విధేయులుగా మసులుకుంటున్నారని, వారు వివిధ ప్రభుత్వ విభాగాల్లోకి ప్రవేశిస్తున్నారని తాలిబన్‌లకు తెలియదనుకోవటం అమాయకత్వం. ఆ సంస్థల నేతలను ఉద్దేశపూర్వకంగానే అధికారిక వ్యవస్థల్లోకి ప్రవేశపెడుతున్నారని జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. పాకిస్తాన్ సైతం మొదట్లో టీటీపీకి, అల్ కాయిదాకు సహాయ సహకారాలందించిన మాట వాస్తవం. టీటీపీ నాయకత్వం తనకు ఎదురుతిరగటం మొదలయ్యాక దానిపై దాడులు సాగిస్తోంది. ఒక బ్రిగేడియర్‌ను కోల్పోవటంతో సహా ఎన్నో నష్టాలను చవిచూస్తోంది. అటు అమెరికాకు తప్పుడు సమాచారం అందించి తాలిబన్‌లను అఫ్గాన్‌లో పునఃప్రతిష్ఠించటంలో కీలక పాత్ర పోషించి దెబ్బతింది. ఏ విలువలకూ కట్టుబడని పాలకుల చేతుల్లో అఫ్గాన్ ఉండటం దక్షిణాసియా ప్రాంత దేశాలకు మాత్రమే కాదు... ప్రపంచానికే ముప్పు తెస్తుంది. కనుక తాజా నివేదికపై భద్రతా మండలి దృష్టి సారించాలి. ఇతరత్రా అంశాల్లో ఎలాంటి విభేదాలున్నా ఉగ్రవాదాన్ని కట్టడి చేయటంలో అన్ని దేశాలూ ఏకాభిప్రాయానికి రావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** పౌర్ణమి రా.12.50 వరకు, తదుపరి బ.పాడ్యమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ సా.5.10 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** రా.8.54 నుండి 10.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.58 నుండి 11.44 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.05 నుండి 12.34 వరకు, తిరిగి తె.5.52 నుండి 7.21 వరకు (తెల్లవారితే బుధవారం)

సూర్యోదయం: 5.42
సూర్యాస్తమయం: 6.31
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

ఇన్ బాక్స్

దేశానికే ఆదర్శం

భారతదేశ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఏ రాష్ట్రంలో ఏర్పాటు చేయనటువంటి ఒక గొప్ప వ్యవస్థను మన ఆంధ్ర ప్రదేశ్‌లో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పరచింది. అదే 'వలంటీర్' వ్యవస్థ. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికీ, పరిపాలనను ప్రజల గడప దగ్గరకు చేర్చడానికీ ఈ వ్యవస్థ దోహదం చేసింది. ఇవ్వాళ వలంటీర్ వ్యవస్థ గురించి నిజానికి ప్రత్యేకంగా 'ఇదీ లాభం' అని చెప్ప వలసిన అవసరమే లేదు. అది ఎన్నో అద్భుత విజయాలను సాధించింది, సాధిస్తోంది. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న సమయంలో ఈ వలంటీర్ వ్యవస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం సాయం అద్భుతంగా సకాలంలో అందింది. దీంతో మొట్టమొదటిసారిగా ఇటువంటి వ్యవస్థ అత్యవసర సమయాల్లో ప్రజలను ఆదుకోవడానికి ఎంతో అవసరమని దేశవ్యాప్తంగా తెలిసివచ్చింది.



రాష్ట్రంలోని ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున నియామకం జరగడంతో ఆ యా కుటుంబాలకు సంబంధించిన సమస్త విషయాలనూ సమన్వయం చేసి ఇటు ప్రభుత్వానికీ, అటు ప్రజలకూ వారధిగా నిలిచే అరుదైన అవకాశం వలంటీర్లకు లభించింది. ఎప్పటికప్పుడు హెల్త్ సర్వేలు చేస్తూ తన పరిధిలో ఉన్న కుటుంబాల ఆరోగ్య సమస్యలను ప్రభుత్వానికి నివేదించడంలో వలంటీర్ల వ్యవస్థ ఒక గొప్ప విజయాన్ని సాధించిందనడంలో అతిశయోక్తి లేదు.


ఉదయాన్నే ఐదు గంటలకే తలుపు తట్టి అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వానికి ప్రతిరూపంగా వారు నిలుస్తున్నారు. కాబట్టే సాక్షాత్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఈ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం అని కొనియాడారు. అంతేకాదు అనేకమంది ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల్లోనూ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి అధ్యయనాలు నిర్వహి స్తున్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు, పౌర సేవలు తక్షణమే ప్రజలకు చేరడానికి వలంటీర్లు వాహికలుగా ఉన్నారని వారంతా గ్రహించడమే ఇందుకు కారణం.

– నాగెండ్ల సుమతీ రత్నం,
టీచర్, దాచేపల్లి మండలం

చంద్రబాబు నిర్వాకాలపై మండిపడుతున్న సీమ రైతన్నలు

- తెలుగుగంగ కెనాల్ లైనింగ్, బ్రహ్మంసాగర్ లీకేజీలపై నాడు మొద్దు నిద్ర
- వైఎస్ జగన్ వచ్చాక రూ.600 కోట్లతో తెలుగు గంగ కెనాల్‌కు లైనింగ్

సీమకు సైంధవుడు



హంద్రీ-నీవా సుజల స్రవంతి లిఫ్ట్

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ఎస్సార్బీసీ, తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టులకు నీటి తరలింపు ఇలా..

సంవత్సరం	నీటి తరలింపు (టీఎంసీల్లో)
చంద్రబాబు హయాంలో	
2014-15	59.56
2015-16	0.95
2016-17	67.94
2017-18	91.97
2018-19	89.87
వైఎస్ జగన్ హయాంలో	
2019-20	179.29
2020-21	134.41
2021-22	116.07
(వైఎస్సార్, కర్నూల్, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి)	
2022-23	123.44

దేశంలోనే తీవ్ర దుర్భిక్ష ప్రాంతమైన రాయలసీమకు హక్కుగా దక్కాల్సిన కృష్ణా జలాలను మళ్లించకుండా నాడు చంద్రబాబు ద్రోహం చేయగా, నేడు గరిష్ఠంగా ఒడిసిపట్టి ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధి చాటుకుంటున్నారని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి కృష్ణా జలాలపై హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టిన చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలాడటంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాకే తెలుగుగంగ, గాలేరు-నగరి సుజల స్రవంతిలో పూర్తి సామర్థ్యం మేరకు నీటి తరలింపు పనులను పూర్తి చేయడంతోపాటు తెలుగుగంగలో అంతర్భాగమైన వెలిగోడు, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు రిజర్వాయర్లలో, ఎస్సార్బీసీలో అంతర్భాగమైన గోరకల్లు, అవుకు రిజర్వాయర్లు, గాలేరు-నగరిలో భాగమైన గండికోట, పైడిపాలెం, సర్వారాయసాగర్, వామికొండలతోపాటు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారని గుర్తు చేస్తున్నారు. వెలిగొండ ప్రాజెక్టు మొదటి సొరంగాన్ని ఇప్పటికే పూర్తి చేయగా రెండో సొరంగం కూడా దాదాపుగా పూర్తి అయింది. నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను తరలించడం ద్వారా ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేయడానికి అడుగులు ముందుకు వేస్తున్నారు. తెలుగుగంగ, గాలేరు-నగరి, కేసీ కెనాల్, ఎస్సార్బీసీలకు హక్కుగా దక్కిన జలాలను వాడుకోవడం కోసం రాయలసీమ ఎత్తిపోతలను సీఎం వైఎస్ జగన్ చేపడితే దానిపై ఎన్జీటీలో కేసులు వేయించి సైంధవుడిలా అడ్డుపడే దుస్సాహసానికి చంద్రబాబు ఒడిగట్టారని రైతులు మండిపడుతున్నారు. శ్రీశైలానికి వరద వచ్చే 30 నుంచి 40 రోజుల్లోనే రాయలసీమ ప్రాజెక్టులను నింపేలా కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచడం, అవసరమైన చోట కొత్త ప్రాజెక్టులను నిర్మించడం కోసం రాయలసీమ కరవు నివారణ పథకం కింద సీఎం జగన్ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేస్తున్నారు. విభజన చట్టం 11వ షెడ్యూలులో పేర్కొన్న తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ ప్రాజెక్టులు అనుమతి ఉన్నవేనని కేంద్రం గుర్తించేలా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయించడం ద్వారా రైతుల హక్కులను సీఎం జగన్ పరిరక్షించారని న్యాయ నిపుణులు ప్రశంసిస్తున్నారు.

గాలేరు-నగరి సుజల స్రవంతి


శ్రీశైలం నుంచి 38 టీఎంసీల కృష్ణా జలాలను తరలించి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 1.55, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,03,500, నెల్లూరు జిల్లాలో 1,500 వెరసి 2.60 లక్షలకు సాగునీరు, ఐదు లక్షల మందికి తాగునీరు అందించేలా గాలేరు-నగరి సుజల స్రవంతి పథకాన్ని జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో చేపట్టారు. 2009 నాటికే వరద కాలువ, గండికోట రిజర్వాయర్, పైడిపాళెం, వామికొండ, సర్వారాయసాగర్‌ల జలాశయాలతోపాటు ఈ ప్రాజెక్టులో సింహభాగం పూర్తి చేశారు.

నాడు అలా...

- 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గాలేరు-నగరి ప్రాజెక్టులో వివిధ ప్యాకేజీల్లో అరకొరగా మిగిలిన పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై 60-సీ నిబంధన కింద వేటు వేసి అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసి అస్మదీయ కాంట్రాక్టర్లకు అప్పగించి ప్రజాధనాన్ని దోచిపెట్టారు. వరద కాలువలో అంతర్భాగమైన అవుకు వద్ద తవ్వాల్సిన జంట సొరంగాల్లో ఫాల్ట్ జోన్(పెలుసుమట్టి)లో 165 మీటర్ల మేర మాత్రమే పనులు చేయాలి. వాటిని చేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు ఒక సొరంగానికి ఫాల్ట్ జోన్‌లో పనులు చేయకుండా కాలువ(లూప్)తో సరిపుచ్చారు.
- కమీషన్లు రావనే కారణంతో గాలేరు-నగరిలో అంతర్భాగమైన గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసంపై చంద్రబాబు దృష్టి పెట్టలేదు. దాంతో కేవలం నాలుగైదు టీఎంసీలను మాత్రమే నిల్వ చేయగలిగారు. పైడిపాలెం, వామికొండసాగర్, సర్వారాయసాగర్‌లను పట్టించుకోలేదు.
- చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పది టీఎంసీల సామర్థ్యం) నిర్వాసితులకు కూడా చంద్రబాబు పునరావాసం కల్పించలేదు. ఏటా కేవలం సగటున రెండు మూడు టీఎంసీలు నిల్వ చేసి ఆయకట్టుకు నీళ్లందించకుండా రైతుల కడుపుకొట్టారు.

నేడు ఇలా..

- సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక వరద కాలువలో అంతర్భాగమైన అవుకు వద్ద మొదటి సొరంగాన్ని పూర్తి సామర్థ్యం మేరకు అంటే పది వేల క్యూసెక్కులను తరలించేలా అభివృద్ధి చేయించారు. రెండో సొరంగంలో ఫాల్ట్ జోన్‌లో మిగిలిపోయిన పనులను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేశారు. ఇప్పుడు గాలేరు-నగరి ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులను తరలించడానికి లైన్ క్లియర్ చేశారు. శ్రీశైలానికి వరద వచ్చిన 30 రోజుల్లోనే గాలేరు-నగరి కింద ప్రాజెక్టులను నింపేలా వరద కాలువ సామర్థ్యాన్ని 30 వేలకు పెంచిన సీఎం జగన్ ఆ పనులను కూడా శరవేగంగా చేస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా అవుకు వద్ద చేపట్టిన మూడో సొరంగం కూడా దాదాపుగా పూర్తి కావస్తోంది.



గండికోట రిజర్వాయర్

- గండికోట రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లు వెచ్చించి పునరావాసం కల్పించడం ద్వారా పూర్తి స్థాయిలో అంటే 26.85 టీఎంసీలను నిల్వ చేయడానికి మార్గం సుగమం చేశారు. 2020-21, 2021-22, 2022-23లలో గండికోటలో ఏటా 26.85 టీఎంసీలను నిల్వ చేసి ఆయకట్టుకు నీళ్లందించి.. రాయలసీమ రైతులకు ప్రయోజనం చేకూర్చారు. పైడిపాలెం (ఆరు టీఎంసీలు), వామికొండసాగర్(1.6 టీఎంసీలు), సర్వారాయసాగర్(3.06 టీఎంసీలు)లలోనూ గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేస్తూ ఆయకట్టుకు నీళ్లందిస్తూ రైతులకు దన్నుగా నిలుస్తున్నారు.
- చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.600 కోట్లతో పునరావాసం కల్పించడం ద్వారా పూర్తి స్థాయిలో పది టీఎంసీలను నిల్వ చేయడానికి మార్గం సుగమం చేశారు. 2020-21, 2021-22, 2022-23లలో ఏటా పది టీఎంసీలను నిల్వ చేస్తూ ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా రైతుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్ వెలుగులు నింపారు.

తెలుగు గంగ..

శ్రీశైలానికి వరద వచ్చే రోజుల్లో తరలించే 29 టీఎంసీల కృష్ణా జలాలకు 30 టీఎంసీల పెన్నా జలాలను జతచేసి 59 టీఎంసీలను మళ్లించడం ద్వారా ఉమ్మడి కర్నూలు (1.08 లక్షల ఎకరాలు), వైఎస్సార్ కడప(1.67 లక్షల ఎకరాలు), ఎస్పీఎస్ఆర్ నెల్లూరు (2.54 లక్షల ఎకరాలు), చిత్తూరు జిల్లా (46 వేల ఎకరాలు) కలిపి మొత్తం 5.75 లక్షల ఎకరాలకు నీళ్లందించాలన్నది తెలుగుగంగ ప్రాజెక్టు ఉద్దేశం.

నాడు అలా...

- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎస్సార్ఎంసీ (శ్రీశైలం కుడి ప్రధాన కలువ) ద్వారా బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు చేరే జలాల్లో 15 వేల క్యూసెక్కులను తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలిగోడు రిజర్వాయర్‌కు తరలించేలా 7.8 కి.మీ. పొడవున తవ్విన లింక్ కెనాల్‌కు లైనింగ్ చేయకపోవడం వల్ల 6 నుంచి 7 వేల క్యూసెక్కులను కూడా తరలించేందుకు వీలయ్యేది కాదు. దీంతో వెలిగోడు రిజర్వాయర్(16.95 టీఎంసీలు) నిండేది కాదు. లింక్ కెనాల్‌కు లైనింగ్ చేసి పూర్తి సామర్థ్యంతో నీటిని తరలించడం ద్వారా వెలిగోడును సకాలంలో నింపాలన్న ఆలోచన కూడా 2014-19 మధ్య చంద్రబాబు చేయలేదు.
- వెలిగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మంసాగర్‌కు ఐదు వేల క్యూసెక్కులను తరలించేలా 42.566 కిమీల పొడవున తవ్విన తెలుగుగంగ ప్రధాన కాలువకు లైనింగ్ చేయకపోవడంతో 2 నుంచి 2,500 వేల క్యూసెక్కులు కూడా తీసుకెళ్లలేని దుస్థితి. బ్రహ్మంసాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 17.74 టీఎంసీలు. మట్టికట్టకు లీకేజీలకు అడ్డుకట్ట వేయకపోవడం వల్ల ఏటా సగటున నాలుగైదు టీఎంసీలు కూడా నిల్వ చేయలేని పరిస్థితి. తెలుగుంగ ప్రధాన కాలువకు లైనింగ్ చేసి పూర్తి సామర్థ్యం మేరకు నీటిని తరలించి బ్రహ్మంసాగర్ మట్టికట్టకు లీకేజీలకు అడ్డుకట్ట వేసి పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయాలనే ఆలోచన కూడా చంద్రబాబు చేసిన పాపాన పోలేదు. ఆయకట్టుకు నీళ్లందించకుండా రైతులను దెబ్బతీశారు.

నేడు ఇలా..



వెలిగోడు రిజర్వాయర్

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలిగోడు రిజర్వాయర్ వరకూ లింక్ కెనాల్‌ను, వెలిగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మంసాగర్ వరకూ ఉన్న తెలుగుగంగ ప్రధాన కాలువకు రూ.600 కోట్లు వెచ్చించి లైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఆ కాలువల ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు నీటిని తరలించడానికి మార్గం సుగమం చేశారు. దీంతో 2019, 2020, 2021, 2022లో వెలిగోడు రిజర్వాయర్‌ను సకాలంలో నింపగలిగారు.



బ్రహ్మంసాగర్ జలాశయం

- బ్రహ్మంసాగర్ మట్టికట్టకు రూ.90 కోట్లు వెచ్చించి డయాఫ్రమ్ వాల్ ద్వారా లీకేజీలకు అడ్డుకట్ట వేసి పూర్తి స్థాయిలో నీటి నిల్వకు లైన్ క్లియర్ చేశారు. 2021-22 నుంచే బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు. తెలుగుగంగ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీటిని అందిస్తూ రైతుల జీవన ప్రమాణాలను పెంచేలా సీఎం జగన్ కృషి చేశారు.

హంద్రీ-నీవా సుజల స్రవంతి

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2014లో సీఎంగా బాధ్యతలు చేపట్టాక శ్రీశైలం నుంచి రోజుకు 3,850 క్యూసెక్కుల చొప్పున 120 రోజుల్లో 40 టీఎంసీలను తరలించి రాయలసీమ జిల్లాల్లో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించేలా హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకాన్ని చేపట్టారు. తన హయాంలోనే రూ.6,862.26 కోట్లు ఖర్చు చేసి సింహ భాగం పూర్తి చేశారు. హంద్రీ-నీవాకు తొలుత శ్రీశైలం రిజర్వాయర్‌లో 834 అడుగుల నుంచి నీటిని ఎత్తిపోసేలా మల్యాల వద్ద పంప్‌హౌస్ నిర్మించిన మహానేత వైఎస్.. ఆ తర్వాత నీటి మట్టం 795 అడుగుల్లో ఉన్నా నీటిని తరలించేలా ముచ్చుమర్రి ఎత్తిపోతల 2007, ఆగస్టు 31న చేపట్టి, 2009 నాటికే 90 శాతం పూర్తి చేశారు.

నాడు అలా..

- విభజన నేపథ్యంలో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. హంద్రీ-నీవాలో మిగిలిన పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై 60-సీ నిబంధన కింద వేటు వేసి.. ఆ తర్వాత వాటి అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసి కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు దండుకున్నారు. జీవో 22(ప్రైస్ ఎస్కలేషన్), జీవో 63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు)లను అక్రమంగా వర్తింపజేసి కాంట్రాక్టర్లకు ప్రజాధనాన్ని దోచిపెట్టి.. కమీషన్లు వసూలు చేసుకున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పూర్తి చేసిన ముచ్చుమర్రి ఎత్తిపోతలను 2017 జనవరి 3న జాతికి అంకితం చేసిన నాటి సీఎం చంద్రబాబు.. ఇది తన ఘనతే అన్నట్లుగా ప్రచారం చేసుకున్నారు. ఇప్పటికీ నిస్సిగ్గుగా ముచ్చుమర్రి ఎత్తిపోతలను తానే చేపట్టానని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు.
- హంద్రీ-నీవా అంతర్భాగంగా తన సొంత నియోజకవర్గం కుప్పానికి కృష్ణా జలాలను తరలించేందుకు చేపట్టిన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను కూడా కమీషన్ల కక్కుర్తితో చంద్రబాబు పూర్తి చేయలేకపోయారు. అంచనా వ్యయాన్ని రూ.200 కోట్ల నుంచి రూ.440 కోట్లకు పెంచి.. సీఎం రమేష్‌కు కట్టబెట్టిన చంద్రబాబు.. సులభంగా చేయగలిగి, అధికంగా లాభాలు వచ్చే పనులు చేసి కమీషన్లు వసూలు చేసుకున్నారు తప్ప తన సొంత నియోజకవర్గం కుప్పానికి నీళ్లు తీసుకెళ్లడంలో విఫలమయ్యారు.
- మహానేత వైఎస్ పూర్తి చేసిన హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా టీడీపీ హయాంలో ఏ ఒక్క ఏడాదీ పూర్తి సామర్థ్యం మేరకు నీటిని తరలించకుండా సీమ రైతులకు చంద్రబాబు ద్రోహం చేశారు.

నేడు ఇలా..

- వైఎస్ జగన్ సీఎం అయ్యాక.. శ్రీశైలానికి వరద వచ్చే రోజులు తగ్గిన నేపథ్యంలో కేవలం 60 రోజుల్లోనే 40 టీఎంసీలు తరలించేలా హంద్రీ-నీవా ప్రధాన కాలువ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపట్టారు.
- హంద్రీ-నీవాలో మిగిలిన పనులను పూర్తి చేయడంతోపాటు హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులను అనుసంధానం చేయడం ద్వారా సాగు, తాగునీటిని పుష్కలంగా అందించే పనులకు శ్రీకారం చుట్టారు.
- హంద్రీ-నీవాలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మిగిలిన పనులను పూర్తి చేసి.. ఈ ఏడాదే కృష్ణా జలాలను కుప్పానికి తరలించే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు వేస్తున్నారు. ప్రతి ఏటా డిజైన్ సామర్థ్యం కంటే అధికంగా హంద్రీ-నీవా ద్వారా నీటిని తరలించి, రాయలసీమను సస్యశ్యామలం చేస్తున్నారు.

రైతుల హక్కులు నాడు తాకట్టు.. నేడు పరిరక్షణ

- విభజన నేపథ్యంలో శ్రీశైలం, నాగార్జునసాగర్‌లు ఉమ్మడి ప్రాజెక్టులుగా కేంద్రం గుర్తించింది. శ్రీశైలం నిర్వహణను ఆంధ్రప్రదేశ్‌కు, నాగార్జునసాగర్ నిర్వహణను తెలంగాణకు అప్పగించింది. తెలంగాణ సర్కార్ తన భూభాగంలోని శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్కేంద్రాన్ని ఏపీకి అప్పగించకుండా తన అధీనంలోనే ఉంచుకోవడం పాటు ఏపీ భూభాగంలోని నాగార్జునసాగర్ కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను కూడా అధీనంలోకి తీసుకుంది. రాష్ట్ర హక్కులను హరించేలా తెలంగాణ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంపై నాటి సీఎం చంద్రబాబు నోరుమెదపలేదు.
- శ్రీశైలంలో నీటిమట్టం 796 అడుగుల్లో ఉన్నప్పుడే కృష్ణా బోర్డు అనుమతి లేకుండా విద్యుదుత్పత్తిని ప్రారంభించి రోజూ 44 వేల క్యూసెక్కులను తరలిస్తున్న తెలంగాణ సర్కార్.. 800 అడుగుల నుంచి రోజూ 24,014 క్యూసెక్కులు తరలించేలా పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల, 802 అడుగుల నుంచి రోజూ 3200 క్యూసెక్కులు తరలించేలా కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యం పెంచడంతోపాటు విభజన చట్టంలో లేని ఎస్సెల్బీసీ నుంచి 826 అడుగుల నుంచే రోజూ 4 వేల క్యూసెక్కులు తరలించే పనులను వేగవంతం చేసింది. 796-826 అడగుల మధ్య నీటి మట్టం ఉన్నప్పుడే రోజూ 6.5 టీఎంసీలు తరలించడానికి తెలంగాణ సిద్ధమైంది.
- శ్రీశైలంలో 834(మల్యాల), 795(ముచ్చుమర్రి) అడుగుల నుంచి హంద్రీ-నీవా ద్వారా రోజుకు 3850 క్యూసెక్కులు మాత్రమే తరలించే సామర్థ్యం ఏపీకి ఉంది. శ్రీశైలంలో 881 అడుగుల్లో నీటి మట్టం ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కులను తరలించడానికి ఆస్కారం ఉంటుంది. కానీ 881 అడుగుల్లో నీటి మట్టం శ్రీశైలంలో ఏడాదికి సగటున 15 నుంచి 20 రోజులు కూడా ఉండటం లేదు. తెలంగాణ సర్కార్ రోజూ 6.5 టీఎంసీలను తోడేస్తే శ్రీశైలంలో నీటి మట్టం పెరగదు. అప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు నీళ్లందవు. ఓటుకు కోట్లు కేసుకు జడిసి బాబు నోరుమెదపలేదు.
- వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాక.. శ్రీశైలంలో 800 అడుగుల నీటి మట్టం ఉన్నప్పుడే రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు దిగువన కాలువలోకి ఎత్తిపోయడం ద్వారా తెలుగుగంగ, గాలేరు-నగరి, కేసీ కెనాల్, ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు నీళ్లందించడంతోపాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలతోపాటు చెన్నైకి తాగునీటిని అందించేలా రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టారు. ఇది పూర్తయితే తనకు భవిష్యత్ లేదని చంద్రబాబు అడ్డంకులు సృష్టిస్తున్నారు.

క్లుప్తంగా...

మృత్యుంజయేశ్వరుని సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ సరస వెంకట నారాయణ భట్టీ

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా): చౌడేపల్లెలోని మృత్యుంజయేశ్వరస్వామి వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్టీ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు రాజశేఖర దీక్షితులు స్వాగతం పలికారు. స్వామివారికి న్యాయమూర్తి, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఆవరణంలోని శ్రీషణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి, పార్వతీదేవిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం కప్పి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంట పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.కార్తీక్ ఉన్నారు.

కిలో పుట్టగొడుగులు @ రూ.1,200



పుట్టగొడుగులు

చిత్తూరు అర్బన్: టమాటా ధరలతో హడలిపోతున్న జనం చిత్తూరు మార్కెట్‌లో సోమవారం కేజీ పుట్టగొడుగులు రూ.1200 ధర పలకడం చూసి ముక్కున వేలేసుకున్నారు. గుడిపాల మండలం చిత్తపారకు చెందిన మోహన్ గ్రామంలోని కూరగాయలు తీసుకొచ్చి చిత్తూరు మార్కెట్‌లో విక్రయిస్తుంటాడు. సోమవారం ఉదయం పొలం గట్టుపై వెళుతుండగా.. సహజ సిద్ధంగా లభించే పుట్టగొడుగులు దొరికాయి. దాదాపు ఐదు కిలోల వరకు పుట్టగొడుగుల్ని సేకరించిన మోహన్, చిత్తూరుకు వచ్చి వీటిని విక్రయించాడు. మామూలుగా పొలం గట్లపై కిలో రూ.600 వరకు పలికే సహజ సిద్ధమైన పుట్టగొడుగులను రూ.1,200 చెప్పినా జనం కొనుగోలు చేయడం విశేషం.

2022-23లో దుర్గగుడి ఆదాయం రూ.156.97 కోట్లు

- రికార్డు స్థాయిలో పెరిగిన ఆదాయం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.156.97 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో భ్రమరాంబ సోమవారం తెలిపారు. కరోనా అనంతరం 2021-22లో దేవస్థానానికి రూ.86.80 కోట్ల మేర ఆదాయం సమకూరగా ఇప్పుడు సుమారు రూ.70.17 కోట్ల మేర ఆదాయం అధికంగా లభించిందన్నారు. కరోనాకు ముందు..రోజుకు 20 వేల నుంచి 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, కరోనా అనంతరం..రోజుకు 30 వేల నుంచి 40 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా, భవానీ దీక్షలతో పాటు ఆషాఢం, శ్రావణ మాసం, ఇతర పర్వదినాలతో పాటు శుక్ర, శని, ఆదివారాల్లో అమ్మవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య రోజుకు 70 వేల మందికి పైనే ఉంది.

నేడు బంగాళాఖాతంలో వాయుగుండం!

- కోస్తాంధ్రకు మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తర బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 9.5 కిలో మీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. ఈ తీవ్ర అల్పపీడనం వాయవ్య దిశగా పయనిస్తూ మంగళవారం తెల్లవారుజాము సమయానికి అదే ప్రాంతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. మరోవైపు రాష్ట్రంపైకి పశ్చిమ, వాయవ్య గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా మంగళ, బుధవారాల్లో ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులు కూడా సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30-40 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది.

ఆంగ్లంలో సుశిక్షిత సైన్యం

భాషపై పట్టుకోసం నిష్ణాతులతో ఉపాధ్యాయులకు శిక్షణ

- విశాఖ జిల్లా అధికారుల వినూత్న ఆలోచన
- ఐడియల్ లెర్నింగ్ సంస్థతో ఒప్పందం
- కలెక్టర్ చొరవతో సీఎస్ఆర్ నిధుల వినియోగం

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఇంగ్లిష్ మీడియం చదువులకు ప్రాధాన్యం ఇస్తోంది. 2023-24 విద్యా సంవత్సరానికి మంగళవారం నుంచి ప్రారంభమవుతున్న ఫార్మటివ్ పరీక్షలతో అదనంగా ఇంగ్లిష్‌లో విద్యార్థుల నైపుణ్యాన్ని తెలుసుకునేందుకు 'టోఫెల్' పరీక్షను సైతం నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మేలు చేయాలనే ఉన్నతాశయంతో ఇలాంటి ప్రయోగాలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుండగా.. వీటిని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు విశాఖ జిల్లా అధికారులు సైతం చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. దీనిలో భాగంగానే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3 నుంచి 10వ తరగతి వరకు బోధించే ఇంగ్లిష్ సబ్జెక్టు టీచర్లకు రోజుకు 50 మంది చొప్పున జిల్లాలోని మొత్తం 500 మందికి శిక్షణ ఇప్పించేలా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఐడియల్ లెర్నింగ్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారుల ప్రతిపాదనలకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సానుకూలంగా స్పందించి, శిక్షణకు అయ్యే మొత్తాన్ని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ నెల 28న ప్రారంభమైన శిక్షణ మూడు నెలల పాటు కొనసాగనుంది. విదేశాలకు వెళ్లి చదువుకుంటామనే పేద విద్యార్థులకు తోడ్పాటుగా నిలిచేలా జగనన్న విదేశీ విద్యా కానుక అందజేస్తోంది. అయితే విదేశాల్లో చదువులకు జీఆర్ఈ, కాట్, ఐఇఎల్ట్స్, క్లాట్, టోఫెల్, సాట్ వంటి అంతర్జాతీయ స్థాయి ఎంట్రన్స్ పరీక్షలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు ఇలాంటి పోటీ పరీక్షలపై అవగాహనలేక వెనుకబడి పోతున్నారు. ఉపాధ్యాయులకు ఇలాంటి శిక్షణతో ఆ లోటు భర్తీ కానుంది.



శిక్షణా తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

పట్టుసాధించేలా



ఇంగ్లిష్ మీడియం చదువులకు ప్రాధాన్యం పెరిగింది. ఉపాధ్యాయులకూ సబ్జెక్టుపై పట్టుండాలి. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సహకారంతో విశాఖ జిల్లాలో తొలిసారిగా ఇలాంటి శిక్షణ ఇస్తున్నాం.

– బి.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష, ఏపీసీ, విశాఖపట్నం

మెలకువలు నేర్పుతున్నాం..



ఇంగ్లిష్ భాషలో మెలకువలు తెలిస్తే.. విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో బోధించవచ్చు. అలాంటి మెలకువలనే వారికి నేర్పుతున్నాం. ప్రతి ఉపాధ్యాయుడు కనీసం 30 గంటలైనా శిక్షణలో పాల్గొంటే మంచి ఫలితాలొస్తాయి. విద్యాశాఖాధికారులు ఈ విషయంలో చొరవ తీసుకోవాలి. – ఫిలిప్, ట్రైనర్, ఐడియల్ లెర్నింగ్ సంస్థ, విశాఖపట్నం

ఉపయోగకరంగా ఉంది..



నా 23 ఏళ్ల సర్వీసులో ఇలాంటి శిక్షణ ఇదే తొలిసారి. ఇంగ్లిష్ మీడియం బోధన అమలు చేస్తున్నందున ఇలాంటి శిక్షణ ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– రామలక్ష్మి, ఉపాధ్యాయురాలు, జెడ్పీ హైస్కూల్, గిరిజాల, విశాఖపట్నం

అలా ఉంటేనే మెరుగైన ఫలితాలు



విద్యార్థులకు పాఠాలు చెప్పే మేము, మళ్లీ విద్యార్థిగా మారి శిక్షణకు హాజరవుతున్నాం. ఉపాధ్యాయుడైనా నిత్య విద్యార్థిగా ఉంటేనే ఉత్తమ ఫలితాలు వస్తాయి. నిరంతరం నేర్చుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన రీత్యా శిక్షణ ఎంతో మేలు చేస్తుంది.

– ఆర్.విజేత, జీవీఎంసీ హైస్కూల్, మల్కాపురం, విశాఖపట్నం



ఏలూరు జిల్లా శివకాశీపురం పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనం వడ్డిస్తున్న అధికారులు



పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయలంకలో తాగునీరు అందిస్తున్న వలంటీర్లు



కోనసీమ జిల్లా బోడసకుర్రు మత్స్యకార కాలనీలో పడవపై వెళ్లి భోజనాలు అందిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

లంకలను వీడని వరద

కోనసీమ జిల్లాలో ముమ్మరంగా సహాయక చర్యలు

- ఇక్కడ 32 పునరావాస కేంద్రాల ఏర్పాటు..10వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ముంపు గ్రామాల్లో బాధితులకు ముమ్మరంగా సహాయక చర్యలు
- బాధితులకు పెద్ద ఎత్తున నిత్యావసరాల పంపిణీ
- పశువులకు గడ్డి కొరత లేకుండా ముందస్తు చర్యలు
- కోలుకుంటున్న పోలవరం ముంపు గ్రామాలు
- మరో రెండ్రోజుల్లో యథాతథంగా రాకపోకలు



ఏలూరు జిల్లా కుక్కునూరులో బాధితులకు ప్రభుత్వం అందించిన నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీవో జీవీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు


సాక్షి, అమలాపురం/సాక్షి ప్రతినిధి, ఏలూరు/చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఎగువ ప్రాంతాల్లో గోదావరి వరద తగ్గుతుండగా దిగువన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లంకల్లో ఇంకా ముంపు వీడలేదు. మంగళవారం నుంచి ముంపు తగ్గుతుందని భావించినా పౌర్ణమి కారణంగా వరద నీరు దిగడం ఆలస్యమవుతోందని స్థానికులు చెబుతున్నారు. ముమ్మిడివరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, ఐ.పోలవరం, పి.గన్నవరం మండలాల్లోని లంక గ్రామాల్లో ఇళ్లు ఇంకా ముంపులోనే ఉన్నాయి. 10 మండలాల్లోని 30 గ్రామాలపై వరద ప్రభావం పడింది. 32 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. 3,046 కుటుంబాలకు చెందిన 10,140 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 175 పడవలు ఏర్పాటుచేశారు. ఇప్పటివరకూ 51,432 మందికి భోజనాలు.. 1.60 లక్షల ప్యాకెట్ల మంచినీరు, 11 వేల 20 లీటర్ల వాటర్ క్యాన్లు అందజేశారు. లంక గ్రామాల్లో 78 వైద్య బృందాలను ఏర్పాటుచేసి, చికిత్స అందిస్తున్నారు. వరదకు ముందే పశువుల కోసం ఎండుగడ్డి స్టాక్ పాయింట్లు పెట్టడంవల్ల పాడి రైతులకు గడ్డి కొరత రాకుండా చూశారు. 125 లంక గ్రామాల్లో 24,673 పశువులకు దాణా అందజేశారు. 134 మెట్రిక్ టన్నుల ఎండుగడ్డి, 200 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా సిద్ధంచేశారు.

ఏలూరు జిల్లాలో ఇలా..

మరోవైపు.. ఏలూరు జిల్లాలోని పోలవరం ముంపు మండలాలు కోలుకుంటున్నాయి. రెండ్రోజుల్లో ముంపు గ్రామాలకు యథావిధిగా రాకపోకలు ప్రారంభమయ్యే అవకాశముంది. గ్రామస్తులకు పునరావాసంతో పాటు నిత్యావసరాల పంపిణీ, సహాయక చర్యలు పెద్దఎత్తున కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా.. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మొత్తం 45 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 13,764 మంది ప్రజలు వరద బారినపడ్డారు. వీరిలో 9,489 మంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లగా, 12 పునరావాస కేంద్రాల్లో 4,275 మంది ఆశ్రయం పొందుతున్నారు. ప్రతి కుటుంబానికీ 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, పామాయిల్, ఉల్లి, బంగాళాదుంపతో పాటు ఏడున్నర కేజీల కూరగాయలు పంపిణీ చేస్తున్నారు. మరోవైపు.. విలీన మండలాల్లో కూడా గోదావరి, శబరి నదుల వరద తగ్గుతోంది. అధికారులు సహాయక చర్యలను మరింత ముమ్మరం చేశారు. లాంచీలు, మర పడవల సాయంతో కూరగాయలు, పాలు, మంచినూనె, టార్పాలిన్లు పంపించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ చింతూరులో, ఐటీడీఏ పీఓ సూరజ్ ధనుంజయ్ గనోరే వీఆర్‌పురంలో, రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్ కూనవరంలో మకాంవేసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ బాధితులకు ధైర్యం చెప్పారు.

'కృష్ణా'లో పెరిగిన వరద

- ఆల్మట్టిలోకి 1.30 లక్షల క్యూసెక్కులు
- ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్ గేట్లు ఎత్తివేత
- శ్రీశైలంలోకి 80,175 క్యూసెక్కులు.. 79.63 టీఎంసీల నిల్వ
- పులిచింతలలోకి 12,773 క్యూసెక్కులు
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 12 వేల క్యూసెక్కులు కడలిలోకి..



849.8 అడుగుల నీటి నిల్వతో శ్రీశైలం డ్యామ్

సాక్షి, అమరావతి: పశ్చిమ కనుమల్లో వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా ప్రధాన పాయలో ఎగువన మళ్లీ వరద ప్రవాహం పెరుగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి సోమవారం సా.6 గంటలకు 1.30 లక్షల క్యూసెక్కులు చేరుతుండటం.. నిల్వ 106.67 టీఎంసీలకు చేరుకోవడంతో మళ్లీ గేట్లు ఎత్తేసి దిగువకు 57 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో నారాయణపూర్ డ్యామ్ గేట్లు ఎత్తేసి అదే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. ఆ మేరకు జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులలోకి వరద ప్రవాహం కొనసాగనుంది. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 80,175 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 849.8 అడుగుల్లో 79.63 టీఎంసీలకు చేరుకుంది.

పులిచింతలలో 32.55 టీఎంసీలు..

ఇక శ్రీశైలం ప్రాజెక్టుకు దిగువన వర్షపాత విరామంతో నాగార్జునసాగర్‌లోకి వరద ప్రవాహం చేరడంలేదు. మూసీ నుంచి పులిచింతలలోకి 12,773 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటినిల్వ 32.55 టీఎంసీలకు చేరుకుంది. మున్నేరు, కట్టలేరు, బుడమేరుల్లో ప్రవాహం మరింత తగ్గడంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద కృష్ణా వరద సాధారణ స్థాయికి చేరుకుంది. ఈ బ్యారేజ్‌లోకి 19,997 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు విడుదల చేయగా మిగులుగా ఉన్న 12 వేల క్యూసెక్కులను అధికారులు సముద్రంలోకి వదిలేస్తున్నారు. మరోవైపు.. తుంగభద్ర డ్యామ్‌లోకి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. 38,031 క్యూసెక్కులు చేరుతుండటంతో తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వ 76.32 టీఎంసీలకు చేరుకుంది.

శాంతిస్తున్న గోదావరి

- భద్రాచలం వద్ద 39.90 అడుగులకు తగ్గిన నీటి మట్టం
- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- నేడు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మరింతగా తగ్గనున్న వరద

సాక్షి, అమరావతి/ధవళేశ్వరం : పరివాహక ప్రాంతంలో వర్షపాత విరామం ఏర్పడటం.. ఉపనదుల్లో ప్రవాహం తగ్గడంతో గోదావరి క్రమంగా శాంతిస్తోంది. భద్రాచలం వద్ద సోమవారం సా.6 గంటలకు వరద ప్రవాహం 8,00,450 క్యూసెక్కులకు.. నీటిమట్టం 39.90 అడుగులకు తగ్గింది. ఇక్కడ ఆదివారం రాత్రి ఏడు గంటల సమయానికి 16 అడుగులకు చేరిన నీటిమట్టం క్రమంగా తగ్గుతూ సోమవారం రాత్రి 8 గంటలకు 14.40 అడుగులకు తగ్గింది. దీంతో అక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించుకున్నారు. పోలవరం ప్రాజెక్టులోకి చేరుతున్న ప్రవాహం కూడా తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి 11,69,697 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి మట్టం స్పిల్ వేకు ఎగువన 33.4, దిగువన 25.16, ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 34.42, దిగువ కాఫర్ డ్యామ్ వద్ద 24.6 మీటర్లకు తగ్గింది. వచ్చిన వరదను వచ్చినట్టుగా పోలవరం ప్రాజెక్టు 48 గేట్ల నుంచి అధికారులు దిగువకు వదిలేస్తున్నారు. ఇక ఆదివారంతో పోలిస్తే సోమవారం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద 2.50 లక్షల క్యూసెక్కులు తగ్గింది. ఈ బ్యారేజ్‌లోకి 14,03,738 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 11,300 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 13,92,438 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.



వరద ఉధృతి నుంచి బయట పడుతున్న ఏలూరు జిల్లా రుద్రమకోట గ్రామం

మరోవైపు.. గోదావరిలో ఎగువనున్న కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజ్ వద్ద ప్రవాహం 3.08 లక్షలకు చేరుకుంది. దీంతో మంగళవారం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద వరద ఉధృతి మరింతగా తగ్గనుంది.

వైఎస్సార్‌సీపీ నేత పొలంలో చీనీచెట్ల నరికివేత

బత్తలపల్లి (తాడిమర్రి): అనంతపురం జిల్లా బత్తలపల్లి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఎంపీపీ బగ్గిరి త్రివేణి దంపతులు సాగు చేస్తున్న చీనీ చెట్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికేశారు. తాడిమర్రి మండలం ఎం.అగ్రహారం రెవెన్యూ గ్రామ పొలాల్లోని నాలుగున్నర ఎకరాల్లో రెండేళ్ల కిందట 650 చీనీ చెట్లను సాగు చేశారు. సోమవారం కుటుంబ సభ్యులు పొలంలోకి వెళ్లే సరికి నరికి వేసిన 150 చీనీచెట్లు కనిపించాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

క్లుప్తంగా...

విద్యార్థిని వాటర్ బాటిల్‌లో మూత్రం పోసిన విద్యార్థులు

జైపూర్: తోటి విద్యార్థిని పట్ల కొందరు విద్యార్థులు అమానుషంగా ప్రవర్తించారు. ఆమె మంచినీళ్ల బాటిల్‌లో మూత్రం పోశారు. ఈ ఘటన రాజస్తాన్‌లోని భిల్వారా జిల్లా లుహారియా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓ బాలిక స్థానిక స్కూలులో చదువుకుంటోంది. శుక్రవారం కొందరు విద్యార్థులు ఆమె మంచినీళ్ల బాటిల్‌లో మూత్రం కలిపారు. ఇది తెలియని బాలిక ఆ నీళ్లు తాగింది. దుర్వాసన రాగా ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేసింది. తన పుస్తకాల బ్యాగులో ప్రేమ లేఖ కూడా ఉన్నట్లు తెలిపింది. స్పందించకపోవడంతో కుటుంబసభ్యులకు తెలిపింది. వారు పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. తహశీల్దారు, పోలీసులకు కూడా వారు తెలిపారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో అనుమానితుల ఇళ్లపై రాళ్ల దాడికి దిగారు.

మూడేళ్లలో 3,110 మనీ లాండరింగ్, 12 వేల ఫెమా కేసులు

న్యూఢిల్లీ: గడిచిన మూడేళ్ల కాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 3,110 మనీలాండరింగ్ కేసులు, విదేశీ మారక ద్రవ్య నిబంధనల ఉల్లంఘనల కింద మరో 12 వేల కేసులు నమోదు చేసినట్లు కేంద్రం సోమవారం తెలిపింది. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. ఆయా కేసుల తీవ్రత ఆధారంగానే మనీలాండరింగ్ నిరోధక చట్టం-2002, ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా)-1999 కింద ఈడీ కేసులు నమోదు చేసినట్లు మంత్రి పంకజ్ చౌదరి వివరించారు.

వర్షాలు, వరదలతో 9 ఏళ్లలో 17 వేల మంది మృతి

న్యూఢిల్లీ: దేశంలో 2012-2021 సంవత్సరాల మధ్య సంభవించిన వరదలు, భారీ వర్షాలతో 17,422 మంది చనిపోయినట్లు కేంద్రం తెలిపింది. సోమవారం రాజ్యసభలో జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి విశ్వేశ్వర్ తుడు ఒక ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానంగా ఈ వివరాలను ఆయన వెల్లడించారు. అతి తక్కువ సమయంలో అతి భారీ వర్షాలు కురియడమే పట్టణ ప్రాంతాల్లో వరదలకు ప్రధాన కారణమన్నారు. ఆక్రమణలకు గురైన సహజ నీటి వనరులు, విచ్చలవిడిగా నిర్మాణాలు, నాణ్యతలేని మురుగు వ్యవస్థ వంటివి సమస్యను మరింత పెంచుతున్నాయని వివరించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2012-21 సంవత్సరాల కాలంలో వర్షాలు, వరదలతో పంటలు, నివాసాలు, ఇతరాలకు కలిపి మొత్తం రూ.2.76 లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు.



శునకంలా వాకింగ్ చేస్తున్న టోకో

అచ్చు శునకంలా

అచ్చం కుక్కను తలపించే వేషధారణ
జపాన్‌లో ఓ యూట్యూబర్ ప్రయోగం
జీవితకాల కోరిక తీర్చుకున్న వైనం
అందుకు రూ.12 లక్షలు వెచ్చించిన టోకో
యూట్యూబ్‌లో 10 లక్షలు దాటిన వ్యూస్

జిహ్వకో రుచి. పుర్రెకో బుద్ధి. వెర్రి వేయి విధాలు. జపాన్‌లో ఓ వ్యక్తి చేసిన పని చూస్తే ఇలాంటి సామెతలన్నీ వరుసబెట్టి గుర్తు రాక మానవు! అచ్చం కుక్కలా కనిపించేందుకు మనవాడు ఏకంగా 12 లక్షల రూపాయలు ఖర్చు పెట్టాడు. పైగా ఆ వేషంలో ఆరుబయట యథేచ్ఛగా తిరిగాడు. అలా జీవితకాల ముచ్చట నెరవేర్చుకుని మురిసిపోయాడు!

జపాన్‌కు చెందిన టోకో అనే వ్యక్తి ఓ యూట్యూబర్. తన చానల్ పేరేమిటో తెలుసా? ఐ వాంట్ టు బీ యాన్ యానిమల్ (జంతువులా మారాలనుకుంటున్నా). దానికి ఏకంగా 31 వేల మందికి పైగా సబ్‌స్క్రైబర్లున్నారు. మనవాడి జీవితకాలపు కోరికుంది. ఏమిటో తెలుసా? ఎలాగైనా కుక్కలా మారడం! దాన్ని తీర్చుకోవడానికి జపాన్‌లో సినిమాలకు, టీవీ షోలకు కాస్ట్యూమ్స్ సరఫరా చేసే జెప్పెట్ అనే ప్రముఖ స్థానిక కంపెనీని సంప్రదించాడు. తన కోరిక వివరించాడు. అచ్చం కుక్కలా కనిపించే కాస్ట్యూమ్ డిజైన్ చేసిచ్చేందుకు వాళ్లూ సరేనన్నారు. అయితే తాను కుక్కను కాదని మనుషులు కాదు కదా, కనీసం కుక్కలు గుర్తు పట్టొద్దని టోకో షరతు విధించాడు. కుక్క వేషంలో తన లుక్ అంత సహజంగా ఉండాలన్నాడు. అందుకోసమని ఏకంగా 20 లక్షల యెన్‌లు (రూ.12 లక్షలు) చెల్లించాడు. కంపెనీ వాళ్లు దీన్నో సవాలుగా తీసుకున్నారు. 40 రోజులు కష్టపడి మరీ టోకోకు కావాల్సిన కుక్క కాస్ట్యూమ్ తయారు చేసిచ్చారు.

పార్కులో 'డాగ్' వాక్

➤ అంతా రెడీ అయ్యాక, ఒక మంచి రోజు చూసుకుని తను తయారుచేయించుకున్న కుక్క వేషం వేసి మనవాడు తొలిసారిగా షికారుకు బయల్దేరాడు. సమీపంలోని పార్కుకు వెళ్లి సందడి చేశాడు. అచ్చం కుక్కలా దొర్లుతూ, తోటి కుక్కల దగ్గరికెళ్లి వాటిని వాసన చూస్తూ హడావుడి చేశాడు. దీన్నంతటినీ వీడియో తీయించుకోవడం మర్చిపోలేదు. దాన్ని తన యూట్యూబ్ చానల్లో అప్‌లోడ్ చేస్తే చూస్తుండగానే 10 లక్షలకు పైగా వ్యూస్ వచ్చి పడ్డాయి! ''నా కుక్క వేషం సూపర్‌హిట్టయింది. జీవితకాల కల నెరవేరింది. వీడియో కూడా బంపర్ హిట్టయింది. ఎలా చూసుకున్నా కుక్క వేషం కోసం పడ్డ ప్రయాసకు తగిన ఫలితం దక్కింది'' అంటూ టోకో సంబరపడిపోతున్నాడు.

గతేడాదే చెప్పాడు

➤ మనోడు తన మనోగతాన్ని గతేడాదే బయట పెట్టాడు. మానవ శునకంగా మారాలనుందని డైలీ మెయిల్ వార్తా పత్రిక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. ''ఇలాంటి నా అభిరుచులు బయటికి తెలియడం నాకిష్టముండదు. ముఖ్యంగా నా సహోద్యోగులకు. ఎందుకంటే మరీ కుక్కలా మారాలనుందంటే వాళ్లకు విచిత్రంగా తోస్తుందేమో కదా! అందుకే ఇప్పుడు నా అసలు రూపం ఎలా ఉంటుందో అందరికీ చూపించదలచలేదు. ఇలా కుక్కలా మారాలనుందని నా క్లోజ్ ఫ్రెండ్స్‌కు కూడా చెప్పలేదు. పిచ్చనుకుంటారేమోనని భయం'' అన్నాడు టోకో! కుక్క వేషంలో తొలిసారి పార్కుకు వెళ్లినప్పుడు కాస్త నెర్వస్‌గా, మరి కాస్త భయంగా అనిపించిందట మనవాడికి. ''అయితే, అక్కడ నన్ను చూసిన మనుషులతో పాటు కనీసం కుక్కలు కూడా నేను కుక్కను కాదని పొరపాటున కూడా అనుకోలేదు. అంటే నా మిషన్ గ్రాండ్ సక్సెస్ అన్నట్టే కదా'' అంటూ సంబరపడిపోయాడు.

> టోకో కోరిక మేరకు కోలీ జాతి కుక్కలాంటి కాస్ట్యూమ్ తయారు చేసిచ్చాం. అది వేసుకున్న వాళ్లు కుక్క కాదని చెప్పినా ఎవరూ నమ్మరు. అంత సహజంగా కుదిరిందది
> – కాస్ట్యూమ్స్ తయారీ కంపెనీ జెప్పెట్ అధికార ప్రతినిధి

మణిపూర్ దురాగతం.. భయానకం

సుప్రీంకోర్టు ధర్మాసనం ఆందోళన

- మహిళలపై జరిగిన హింసను ఇతర రాష్ట్రాలతో సమానంగా చూడలేం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆరు ప్రశ్నలు
- 24 గంటల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశం



న్యూఢిల్లీ: మణిపూర్‌లో మహిళల పట్ల జరుగుతున్న దారుణాలు తీవ్ర ఆందోళనకరమని, ఇవి అసాధారణమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం నిజంగా భయంకరమైన సంఘటన అని పేర్కొంది. ఇతర రాష్ట్రాల్లో మహిళలపై చోటుచేసుకున్న దురాగతాలను మణిపూర్ మహిళల అంశంతో సమానంగా చూడలేమని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ తదితర బీజేపీయేతర పార్టీల పాలిత రాష్ట్రాల్లో మహిళలపై ఎన్నో ఘోరాలు జరిగాయని, వారికి అవమానాలు ఎదురయ్యాయని, దీనిపై విచారణ జరపాలని కోరుతూ లాయర్, బీజేపీ నేత బాన్సురీ స్వరాజ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతోపాటు మణిపూర్ హింసకు సంబంధించిన ఇతర పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బాన్సురీ పిటిషన్‌ను తోసిపుచ్చింది. రక్షిస్తే దేశంలోని మహిళలనందరినీ రక్షించండి, లేకపోతే ఎవరినీ రక్షించకండి అని చెబుతున్నారా? అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఇతర రాష్ట్రాల్లో కూడా మహిళలపై హింస జరుగుతోందంటూ మణిపూర్‌లో జరిగిన దారుణాలను సమర్థించుకోలేరని ఘాటుగా వ్యాఖ్యానించింది. మహిళలపై హింస అనేది దేశమంతటా జరుగుతోందని, స్వరాజ్ పిటిషన్‌పై తర్వాత దృష్టి సారిస్తామని పేర్కొంది. మణిపూర్ విచారణ విషయంలో తమకు సహకరించాలని భావిస్తే సహకరించవచ్చని స్వరాజ్‌కు సూచించింది.

నమోదు చేసిన కేసులెన్ని?

ఇద్దరు బాధిత మహిళల తరపున సీనియర్ లాయర్ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. రాష్ట్రంలో హింసకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయో కూడా ప్రభుత్వం వద్ద వివరాలు లేవని ఆక్షేపించారు. మణిపూర్ మారణకాండపై దర్యాప్తును సుప్రీంకోర్టు స్వయంగా పర్యవేక్షించాలని కోరారు. దీంతో మణిపూర్ హింసపై కేంద్ర ప్రభుత్వానికి, మణిపూర్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ధర్మాసనం 6 ప్రశ్నలు సంధించింది. 24 గంటల్లో వాటికి సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. 1.రాష్ట్రంలో హింసాకాండకు సంబంధించి ఇప్పటిదాకా మొత్తం ఎన్ని కేసులు నమోదు చేశారు? 2.వీటిలో జీరో ఎఫ్ఐఆర్‌లు ఎన్ని? 3.ఇతర పోలీసు స్టేషన్లకు ఎన్ని కేసులను బదిలీ చేశారు? 4.ఇప్పటివరకు ఎంతమందిని అరెస్టు చేశారు? 5.అరెస్టయిన నిందితులకు అందించిన న్యాయ సహాయం పరిస్థితి ఏమిటి? 6.సెక్షన్ 164 కింద రికార్డు చేసిన స్టేట్‌మెంట్లు ఎన్ని? అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించింది. మణిపూర్ ఘటనలపై దర్యాప్తును పర్యవేక్షించడానికి రిటైర్డ్ న్యాయమూర్తులతో ఒక కమిటీని లేదా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలన్న ఆలోచన వస్తోందని వివరించింది.

పిటిషన్‌ను తిరస్కరించిన ధర్మాసనం

మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసతోపాటు రాష్ట్రంలో అడవుల నరికివేత, గంజాయి సాగు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ తాజాగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం తిరస్కరించింది. మాయాంగ్లాంబమ్ బాబీ మైతెయి తరఫున సీనియర్ అడ్వొకేట్ మాధవి దివాన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ), జాతీయ మానవ హక్కుల సంఘం, మణిపూర్ ప్రభుత్వాన్ని ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు. కేవలం ఓ వర్గంపై నిందలు వేసేలా ఉన్న ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని ధర్మాసనం తేల్చిచెప్పింది.

14 రోజులు ఏం చేశారు?

ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం అనేది నిర్భయ తరహా కేసు కాదని, ఇది వ్యవస్థీకృతంగా జరిగిన హింస అని వెల్లడించింది. మే 4న సంఘటన జరిగితే, మే 18న కేసు పెట్టారని, మధ్యలో 14 రోజులపాటు ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీసింది. బాధిత మహిళలను రాష్ట్ర పోలీసులే చేజేతులా రాక్షస మూకకు అప్పగించినట్టుగా ఉందని న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో ఇప్పటిదాకా ఏయే చర్యలు తీసుకున్నారో తమకు నివేదిక సమర్పించాలని మణిపూర్ పోలీసులను ఆదేశించింది. మణిపూర్ హింస కేసులో తాము ఎంతవరకు జోక్యం చేసుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వ స్పందనపై ఆధారపడి ఉంటుందని ధర్మాసనం తేల్చిచెప్పింది. ప్రభుత్వ చర్యలు సంతృప్తికరంగా ఉంటే తాము జోక్యం చేసుకోబోమంది.

జైపూర్ రైల్లో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ దారుణం



ముంబై: రాజస్తాన్ నుంచి ముంబైకి వస్తున్న జైపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్ చేతన్ సింగ్(34) విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ టికారామ్ మీనాపై, వేర్వేరు బోగీలు, ప్యాంట్రీకార్‌లోని ప్రయాణికులపై తుపాకీగుళ్ల వర్షం కురిపించాడు. ఈ ఘటనలో టికారామ్, ముగ్గురు ప్రయాణికులు మరణించారు. తర్వాత రైలు దిగి కానిస్టేబుల్ పారిపోతుండగా ఆర్‌పీఎఫ్ బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ముంబైకి 100 కి.మీ.ల దూరంలోని పాల్ఘర్ వద్ద సోమవారం ఉదయం ఐదుగంటలకు ఈ కాల్పుల ఘటన జరిగింది. 'విచక్షణకోల్పోయి అతను ఎందుకిలా ప్రవర్తించాడనేది ఇంకా తెలియరాలేదు' అని గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) కమిషనర్ రవీంద్ర చెప్పారు.'కానిస్టేబుల్ చేతన్‌కు కోపం ముక్కోపి. ఆటోమేటిక్ ఆయుధం నుంచి 12 రౌండ్లకాల్పులు జరిపాడు' అని జీఆర్‌పీ మరో అధికారి వెల్లడించారు. కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన ఏఎస్సై మీనా 2025లో పదవీవిరమణ చేయాల్సి ఉంది. అతని కుటుంబానికి రైల్వే శాఖ రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. కానిస్టేబుల్ చేతన్, ఏఎస్సైల బృందం రైలులో భద్రత నిమిత్తం గుజరాత్‌లోని సూరత్‌లో రైలు ఎక్కారని అధికారులు తెలిపారు.



బీచ్ వెంట సరదాగా సైకిల్ తొక్కుతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన భార్య జిల్ బైడెన్. సోమవారం డెలావెర్‌లో రెహొబొత్ బీచ్ వద్ద తీసిందీ ఫొటో.

డీకే శివకుమార్‌కు సుప్రీంలో ఊరట


న్యూఢిల్లీ: కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సోమవారం సుప్రీంకోర్టులో ఊరట లభించింది. అవినీతి కేసులో తమ దర్యాప్తును నిలుపుదల చేస్తూ గతంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వును సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా దానిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఫిబ్రవరి పదో తేదీన హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులో కలగజేసుకోబోమని బెంచ్ స్పష్టంచేసింది. గతంలో కర్ణాటక హైకోర్టు సీబీఐ దర్యాప్తుపై స్టేను పలుమార్లు పొడిగించడం తెల్సిందే.

మా పార్టీ గెలిస్తే మా అన్నే పీఎం: షెహబాజ్

ఇస్లామాబాద్: రానున్న ఎన్నికల్లో తమ పాకిస్తాన్ ముస్లిం లీగ్ నవాజ్(పీఎంఎల్-ఎన్) మరోసారి విజేతగా నిలిచిన పక్షంలో తన సోదరుడు, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ప్రధానిగా పగ్గాలు చేపడతారని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు. లండన్‌లో గడుపుతున్న నవాజ్ స్వదేశానికి త్వరలో వస్తారన్నారు. సాధారణ ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు వీలుగా తటస్థుడిని తాత్కాలిక ప్రధానిగా ఎంపిక చేస్తామన్నారు. తాత్కాలిక ప్రధాని ఎవరనే విషయమై భాగస్వామ్య పార్టీలతోపాటు, పీఎంఎల్-ఎన్ చీఫ్ నవాజ్ షరీఫ్‌తో చర్చలు జరిపాక నిర్ణయిస్తామని తెలిపారు.

పార్లమెంట్‌లో రచ్చ రచ్చ

- మణిపూర్ అంశంపై వెంటనే చర్చ చేపట్టాలని డిమాండ్
- ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలు, నినాదాలు



విపక్ష సభ్యులను శాంతింపజేస్తున్న ధన్‌ఖడ్



రాజ్యసభలో మాట్లాడుతున్న ఖర్గే

న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండపై పార్లమెంట్‌లో తక్షణమే చర్చ ప్రారంభించాలని, ప్రధాని మోదీ సమాధానం చెప్పాల్సిందేనని ప్రతిపక్షాలు పునరుద్ఘాటించాయి. సోమవారం ఉభయ సభల్లో ఆందోళనకు దిగాయి. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభ మంగళవారానికి వాయిదా పడ్డాయి.

సినిమాటోగ్రఫీ (సవరణ) బిల్లు ఆమోదం

లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన తర్వాత స్పీకర్ బిర్లా మాట్లాడారు. వెంటనే విపక్ష ఎంపీలు తమ స్థానాల్లో లేచి నిల్చున్నారు. మణిపూర్ అంశంపై ప్రధాన మంత్రి ప్రకటన చేయాలని పట్టుబట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ వెల్‌లోకి దూసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విపక్షాల ఆందోళన మధ్యే స్పీకర్ ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. విద్యా, ఆర్థిక శాఖలకు చెందిన ప్రశ్నలపై చర్చ మొదలైంది. 'మీ స్థానాల్లోకి తిరిగి వెళ్లండి, సభకు సహకరించండి' అని స్పీకర్ పదేపదే కోరినా విపక్ష సభ్యులు లెక్కచేయలేదు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. లోక్‌సభ పునఃప్రారంభమైన తర్వాత సినిమాటోగ్రఫీ (సవరణ) బిల్లు-2023ను ఆమోదించారు. ఈ బిల్లు రాజ్యసభలో గతంలోనే ఆమోదం పొందింది. పైరసీని అరికట్టడానికి ఈ బిల్లును తీసుకొచ్చినట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ప్రతిపక్ష ఎంపీల ఆందోళన, నినాదాలు కొనసాగుతుండడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

రాజ్యసభలో వాయిదాల పర్వం

మణిపూర్ అంశంపై '267 నిబంధన' కింద వెంటనే చర్చ చేపట్టాలని ఎగువసభలో ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి జోషి చెప్పారు. విపక్ష ఎంపీలు ప్రధాని సమాధానం చెప్పాలని పునరుద్ఘాటించారు. దీంతో సభను చైర్మన్ ధన్‌ఖడ్ పలుమార్లు వాయిదా వేశారు. తొలుత ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు ఆందోళనకు దిగడంతో మధ్యాహ్నం 2 గంటల దాకా, తర్వాత మధ్యాహ్నం 2.30 గంటల దాకా, అనంతరం 3.30 గంటల వరకూ వాయిదా వేశారు. విపక్షాలు ఎంతకూ వెనక్కి తగ్గకపోవడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు.

మూడింట రెండొంతుల మెజార్టీ: పీయూష్ గోయల్

కేంద్రానికి లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజార్టీ ఉందని, ఈ విషయం అందరికీ తెలుసని కేంద్ర మంత్రి, బీజేపీ నేత పీయూష్ గోయల్ చెప్పారు. సంఖ్యలన్నీ తమకే అనుకూలంగా ఉన్నాయన్నారు. మెజార్టీని నిరూపించుకున్న తర్వాతే బిల్లులను ఆమోదించాలన్న నిబంధన ఏదీ లేదని పేర్కొన్నారు. అవిశ్వాసం తీర్మానంపై ఎప్పుడు చర్చ చేపట్టాలన్నది స్పీకర్ నిర్ణయిస్తారని వివరించారు. చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. అలాగే మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరిగే యూపీఏ ప్రభుత్వ హయాంనాటి నిర్వాకాలు బయట పడతాయన్న భయంతో కాంగ్రెస్ పార్టీ సభా కార్యకలాపాలను అడ్డుకుంటోందని పీయూష్ గోయల్ మండిపడ్డారు.

జెలెన్‌స్కీ సొంత నగరంపై క్షిపణి దాడులు



కీవ్: రష్యా సోమవారం ఉదయం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రివ్యిరిహ్‌పై రెండు క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడుల్లో పదేళ్ల బాలిక సహా ఆరుగురు చనిపోయారు. ఈ దాడుల్లో ఓ అపార్టుమెంట్, నాలుగంతస్తుల యూనివర్సిటీ భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పదేళ్ల బాలిక, ఆమె తల్లి సహా అయిదుగురు ప్రాణాలు కోల్పోగా మరో 64 మంది గాయాలపాలయ్యారని నీప్రో గవర్నర్ సెర్హీ లిసాక్ తెలిపారు. ఇంకా కొందరు శిథిలాల కింద చిక్కుకున్నట్లు చెప్పారు. పలు వాహనాలు ధ్వంసమయ్యాయన్నారు. రష్యా పాక్షికంగా ఆక్రమించిన డొనెట్స్క్ ప్రావిన్స్‌లో జరిగిన దాడిలో ఇద్దరు చనిపోగా మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ దాడికి కారణమంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. కాగా, మాస్కోపైకి ఆదివారం డ్రోన్లను ప్రయోగించిన ఉక్రెయిన్ సోమవారం రష్యాలోని బ్రియాన్స్క్‌పై డ్రోన్ దాడి జరిపింది. ఎవరూ చనిపోయినట్లు సమాచారం లేదని స్థానిక గవర్నర్ చెప్పారు. ఖరీవ్, ఖెర్సన్, డొనెట్స్క్‌లపై రష్యా శతఘ్ని కాల్పుల్లో ముగ్గురు చనిపోగా మరో ఏడుగురు గాయాలపాలయ్యారు.

చంద్రయాన్-3 కక్ష్య దూరం పెంపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): గత నెల 14వ తేదీన ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు సోమవారం అర్ధరాత్రి దాకా లూనార్ ట్రాన్స్‌ఫర్ ట్రాజెక్టరీ అనే ఆపరేషన్‌ను చేపట్టారు. ప్రొపల్షన్ మాడ్యూల్‌లో నింపిన అపోజి ఇంధనాన్ని మండించి చంద్రయాన్-3 మిషన్‌ను భూకక్ష్య నుంచి చంద్రుని కక్ష్యవైపు మళ్లించే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. ఇలా చంద్రయాన్-3 కక్ష్య దూరం మరోమారు పెంచారు. అక్కడ నుంచి ఐదు రోజులపాటు చంద్రుడి చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యలో పరిభ్రమించి వంద కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి తీసుకురావడానికి ఐదు రోజుల సమయం తీసుకుంటుంది. ఆ కక్ష్యలోకి వచ్చాక ఆగస్టు 23వ తేదీన ప్రొపల్షన్ మాడ్యూల్ చంద్రునికి 30 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకుంటుంది. తర్వాత అది ల్యాండర్‌ను జార విడుస్తుంది. ఆ రోజు సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువం ప్రాంతంలో దిగుతుంది. ల్యాండర్ విచ్చుకుని లోపలి నుంచి రోవర్ బయటకు అడుగుపెట్టనుంది. అది చంద్రుడిపై 14 రోజుల పాటు పరిశోధనలు చేసి సమాచారాన్ని అందిస్తుంది. అంటే చంద్రయాన్-3 మిషన్ చంద్రుడి కక్ష్యలోకి చేరుకోవడానికి ఇంకా 17 రోజులు, చంద్రుడిపై దిగడానికి 23 రోజులు పడుతుందన్న మాట.

ఆగస్ట్-సెప్టెంబర్ నెలల్లో సాధారణ వర్షాలు: వాతావరణ శాఖ

న్యూఢిల్లీ: దేశంలో వర్షాకాలం రెండో అర్ధభాగం(ఆగస్ట్-సెప్టెంబర్)లో సాధారణ వర్షాలే కురుస్తాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) సోమవారం తెలిపింది. జూలైలో దేశవ్యాప్తంగా అధిక వర్షాలు నమోదయ్యాయని పేర్కొంది. నైరుతి రుతుపవనాలపై ఎల్‌నినో పరిస్థితులు ప్రభావితం చేయలేకపోయాయని తెలిపింది. ఆగస్ట్, సెప్టెంబరు నెలల్లో సాధారణ వర్షపాతాన్ని అంచనా వేసినప్పటికీ, సాధారణ (422.8 మిల్లీమీటర్ల కంటే తక్కువగా (94 శాతం నుంచి 99 శాతం) కురిసే అవకాశాలున్నాయని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర మీడియాతో అన్నారు. జూన్‌లో సాధారణం కంటే 9% లోటు వర్షపాతం నమోదవగా, జూలై వచ్చే సరికి 13% అదనంగా వానలు పడ్డాయని చెప్పారు. అయితే, తూర్పు, ఈశాన్య భారతంలో 1901 తర్వాత మొదటిసారిగా అత్యల్ప వర్షపాతం 280.9 మిల్లీమీటర్లు నమోదైందని చెప్పారు. గత అయిదేళ్లలోనే అత్యధికంగా ఈసారి 1,113 భారీ వర్షపాతం ఘటనలు, 205 అత్యంత భారీ వర్షపాతం ఘటనలు జూలైలో నమోదయ్యాయని చెప్పారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

తిరువనంతపురం: తమిళనాడులోని తిరుచిరాపల్లి నుంచి షార్జాకు వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో, విమానాన్ని ముందు జాగ్రత్తగా కేరళలో తిరువనంతపురం విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు. 154 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో సోమవారం ఉదయం 10.45 గంటలకు తిరుచిరాపల్లి నుంచి ఎయిరిండియా విమానం టేకాఫ్ తీసుకుంది. కొద్దిసేపటికే ఇంజిన్‌లో సమస్యలు తలెత్తినట్లు గుర్తించిన పైలట్ అధికారులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో పూర్తి స్థాయి అత్యవసర పరిస్థితి ప్రకటించి, మధ్యాహ్నం 12.01 గంటలకు సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎయిరిండియా తెలిపింది. తిరువనంతపురం-బహ్రెయిన్ ఎక్స్‌ప్రెస్ సాంకేతిక లోపంతో నిలిచిపోయిందని ఎయిరిండియా పేర్కొంది.

నీతి-మనా లోయ మహిళలపై ప్రధాని మోదీ ప్రశంసలు

డెహ్రాడూన్: భోజపత్ర కాలిగ్రఫీని జీవనోపాధిగా మార్చుకున్న ఉత్తరాఖండ్‌లోని నీతి-మనా లోయ మహిళలను ప్రధాని మోదీ ప్రశంసించారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో వారి కృషిని ఆయన ప్రస్తావించారు. 'పురాతన కాలంలో మహాభారతాన్ని భోజపత్రపైనే రాశారు. మన సంస్కృతిలో భాగమైన భోజపత్రతో నీతి-మనా లోయ మహిళలు కళాఖండాలు, సావనీర్లు రూపొందిస్తున్నారు. దీనితో తమ జీవితాలనే మార్చేసుకున్నారు'అని కొనియాడారు. ఈ లేఖనాలను అందరూ ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నార న్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సాంస్కృతిక వారసత్వాన్ని ఉపయోగించుకోవడం అభినందనీయమన్నారు. వీరి కృషి కారణంగా ఈ ప్రాంతం పర్యాటకపరంగా ప్రాచుర్యంలోకి వచ్చిందన్నారు. అక్టోబర్‌లో చైనా సరిహద్దు సమీపంలోని బద్రీనాథ్‌ను సందర్శించిన సమయంలో స్థానిక మహిళ ఒకరు అందమైన భోజపత్ర లేఖనాన్ని బహుమతిగా అందజేసినట్లు గుర్తుకు తెచ్చుకున్నారు. నీతి-మనా లోయలోని మనా గ్రామాన్ని ప్రధాని మోదీ అప్పట్లో మొట్టమొదటి భారతీయ గ్రామంగా అభివర్ణించారు.



ఆ మైనర్ అమాయకురాలేం కాదు

టీనేజర్ గర్భవిచ్ఛిత్తి పిటిషన్‌ను తిరస్కరించిన బాంబే హైకోర్టు

ముంబై: గత సంవత్సరం డిసెంబర్ నుంచి ఒక అబ్బాయితో శారీరక బంధం కొనసాగిస్తున్న ఈ మైనర్ బాలిక అమాయకురాలేం కాదని బాంబే హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. ' సమ్మతి శృంగారంతోనే ఈ టీనేజీ అమ్మాయి గర్భం దాల్చింది. నిజంగా ఈ 17 ఏళ్ల బాలికకు గర్భం ఇష్టంలేదని భావిస్తే గర్భంవచ్చిందని నిర్ధారించుకున్న వెంటనే గర్భవిచ్ఛిత్తి కోసం దరఖాస్తు చేసుకొని ఉండాల్సింది' అని బాంబే హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్ 26వ తేదీన వెలువర్చిన ఉత్తర్వులో వ్యాఖ్యానించింది. 'ఈమెకు ఈ నెలాఖరుకల్లా 18 ఏళ్లు నిండుతాయి. కొన్ని నెలలుగా 'ఫ్రెండ్'తో అమ్మాయి శారీరక బంధం కొనసాగిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వయంగా తనే ప్రెగ్నెన్సీ కిట్ తెచ్చుకుని పరీక్షించుకుంది. సంబంధిత కేసు వివరాలు పరిశీలిస్తే బాధిత మైనర్ అమాయకురాలేం కాదని అర్థమవుతోంది' అని జస్టిస్ రవీంద్ర, జస్టిస్ వైజీ ఖోబ్రగడేల బెంచ్ అభిప్రాయపడింది. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్(పోక్సో) చట్ట నిబంధనల ప్రకారం చూస్తే తాను చైల్డ్‌నని, గర్భవిచ్ఛిత్తికి అనుమతి ఇవ్వాలంటూ తల్లి ద్వారా ఈ అమ్మాయి హైకోర్టులో పిటిషన్ వేసింది. 'వైద్యపరంగా గర్భవిచ్ఛిత్తి చట్టం' ప్రకారం 20 వారాలుదాటిన సందర్భాల్లో గర్భవిచ్ఛిత్తికి అనుమతి తప్పనిసరి. ప్రాణానికి హాని, తల్లి లేదా బిడ్డ ఆరోగ్యం విషమంగా మారొచ్చనే సందర్భాల్లోనే గర్భవిచ్ఛిత్తికి అనుమతిని ఇస్తారు. ' మరో 15 వారాల్లో డెలివరీ అనగా ఇప్పుడు గర్భవిచ్ఛిత్తి చేసినా బిడ్డ ప్రాణాలతోనే జన్మిస్తుంది. కానీ బ్రతికే అవకాశాలు తగ్గుతాయి. ఈ పరిస్థితుల్లో అబార్షన్‌కు అనుమతి ఇవ్వబోం. పుట్టాక ఎవరికైనా దత్తత ఇవ్వాలనుకుంటే ఇచ్చుకోవచ్చు. ఆమెకు ఆ స్వేచ్ఛ ఉంది' అని ధర్మాసనం స్పష్టంచేసింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



దుర్గమ్మ సేవలో ఎంపీ మిథున్‌రెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు చిత్రపటంతో సత్కరించారు.



650 మంది సర్టిఫికెట్ల పరిశీలన

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఏపీ ఈఏపీ సెట్–23 కౌన్సెలింగ్‌లో భాగంగా సోమవారం 650 మంది స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.



కేంద్ర అధికారులతో సమావేశం

చిలకలపూడి: ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో సోమవారం కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి సమావేశమయ్యారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ల నియామకం



మర్రి రాజశేఖర్



అయోధ్య రామిరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్లుగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే మర్రి శేఖర్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి రీజనల్ కో ఆర్డినేటర్లుగా పనిచేస్తున్నారు. మూడు జిల్లాల్లో పార్టీకి అందించిన సేవలకు గాను వీరిని మరో మారు రీజనల్ కో ఆర్డినేటర్లుగా కొనసాగిస్తూ వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు టోల్ ప్లాజా ప్రారంభం

మోపిదేవి(అవనిగడ్డ): మోపిదేవి సమీపంలోని మోపిదేవి వార్పు వద్ద ప్రధాన జాతీయ రహదారి 216పై నూతనంగా నిర్మించిన టోల్ ప్లాజా మంగళవారం ప్రారంభించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి వాహనాల రాకపోకలకు రుసుం వసూలు చేసేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. కారు, జీపు, వ్యాను సింగిల్ ప్రయాణానికి రూ. 35, ఒక రోజులో అప్ అండ్ డౌన్‌కి రూ. 55, తేలికపాటి వాణిజ్య వాహనం, తేలికపాటి గూడ్స్‌వాహనం లేదా మినీబస్సుకు రూ. 60, రూ.90, బస్సు లేదా ట్రక్కుకు రూ. 125, రూ.190, మూడు యాక్సిల్స్ వాణిజ్య వాహనానికి రూ. 140, రూ.205, హెచ్‌సీఎం లేదా ఈఎంఈ లేదా ఎంఏవీ(4 నుంచి 6 యాక్సిల్స్)కు రూ. 200, రూ.295, అతి భారీ వాహనాలకు రూ. 240, రూ. 360 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో వివరించారు.

సీపెట్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గన్నవరం రూరల్: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) సంస్థలో ఎంఎస్ఎంఈ, ఎన్ఎస్ఐసీ సంయుక్త సౌజన్యంతో 30మంది ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన శిక్షణ ఇస్తున్నట్లు జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మిషన్ ఆపరేటర్, ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ 6 నెలల పాటు ఇచ్చి, వారికి దేశంలోని పలు ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కలిస్తున్నట్లు, శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి, సదుపాయాలు అందిస్తామని, 10వ తరగతి పాస్ అయిన వారు, 18 సంవత్సరాలు వయస్సు గల ఎస్సీ, ఎస్టీ యువత విద్యార్హత, కులం, ఆదాయం , ఆధార్, రేషన్, బ్యాంకు పాస్‌బుక్, నాలుగు పాస్‌పోర్టు ఫొటోలతో సీపెట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు సంప్రదించాలని చెప్పారు. వివరాలకు 9893586494 నంబర్‌ను సంప్రదించాలని చెప్పారు.

పారదర్శకంగా బదిలీలు చేయాలి

లబ్బీపేట(విజయవాడతూర్పు): వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున.. ఎక్కడా అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ గెజిటెడ్, అండ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆ శాఖ స్పెషల్ కమిషనర్ అభిషేక్ కిశోర్‌ను కలిసి బదిలీల విషయమై చర్చించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్పెషల్ కమిషనర్ అభిషేక్ కిషోర్‌ను శాలువాతో సత్కరించారు.

కృష్ణయ్యకు సేవా ఆరోగ్యమిత్ర పురస్కారం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తిరువూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్యమిత్రగా పని చేస్తున్న ఇ. కృష్ణయ్యకు రాష్ట్ర ప్రభుత్వ సేవా ఆరోగ్య మిత్ర పురస్కారం లభించింది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల అమలులో నిరంతరం ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు ఆరోగ్యమిత్రగా అందించిన సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల సేవా ఆరోగ్యమిత్ర పురస్కారం అందిస్తోంది. జూన్ నెలకు గాను తిరువూరులో ఆరోగ్యమిత్రగా విశేష సేవలందిస్తున్న కృష్ణయ్యకు అవార్డు లభించింది. సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర కృష్ణయ్యకు ప్రశంసాపత్రం, రూ. 5 వేల నగదును కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు అందించారు. కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్ఓ ఎం. సుహాసిని, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ జె. సుమన్ పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధే ధ్యేయం

- వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి
- పన్నులు, అద్దెల వసూళ్లు, టెండర్ల ఎంపిక కమిటీల ఏర్పాటుకు ఆమోదం
- వీధి కుక్కల నియంత్రణలో వీఏఎస్ వివరణపై ఎమ్మెల్యే మల్లాది ఆగ్రహం
- పార్కుల పరికరాల మరమ్మతుల్లో నిర్లక్ష్యం తగదని కార్పొరేటర్ల సూచన
- విద్యాధరపురంలో కబేళా ఆధునికీకరణకు సవరణ తీర్మానం



వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే ధ్యేయమని, అందుకు నిరంతరం కృషిచేస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగర ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో సోమవారం వీఎంసీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 223 అంశాలు చర్చకు వచ్చాయి. 145 అంశాలను ఆమోదించారు. మరో 63 అంశాలను కార్యాలయ చర్యలకు ప్రతిపాదించారు. మరో ఆరు అంశాలను ర్యాటిఫై చేసి, మూడు అంశాలను రికార్డు, ఇంకో మూడు అంశాలను తిరస్కరించారు. మరో మూడు అంశాలను వాయిదా వేశారు. తొలుత ప్రశ్నోత్తరాల సమయంలో 11 ప్రశ్నలను సభ్యులు అడిగారు. పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా వేతనాలు పొందుతున్న కార్మికుల వివరాలు కావాలని ప్రశ్నించారు. వివిధ విభాగాల్లో 4,962 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారని అధికారులు సమాధానం ఇచ్చారు. పన్నులు, అద్దెల వసూళ్లు, టెండర్ల ఖరారుకు కమిటీ ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు కౌన్సిల్ సూచించింది.

వీధికుక్కల బెడదపై ప్రత్యేక కమిటీ

2023–24 ఆర్థిక సంవత్సరంలో ఏఆర్‌వీ(యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్), నగరంలోని వీధి కుక్కలకు ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కోసం నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.1.62 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదన వచ్చింది. ఈ ప్రతిపాదనపై కార్పొరేటర్లు మాట్లాడుతూ.. కుక్కల బెడద అధికంగా ఉందని, దీనిపై పలు మార్లు కౌన్సిల్ సమావేశంలో తీర్మానాలు చేసినా సమస్య పరిష్కారమవకపోగా, మరింత జటిలంగా మారిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఎందుకు జరుగుతోందంటూ ప్రశ్నించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్ పొంతన లేని సమాధానం చెప్పటంతో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కల్పించుకొని.. కార్పొరేటర్లు సమస్యలు ప్రస్తావిస్తుంటే వినే ఓపిక లేకపోతే ఎలాగని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రవర్తన మార్చుకోకుంటే ప్రభుత్వానికి సరెండర్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం వీధి కుక్కల బెడద నిరోధించటానికి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తూ సభ్యులు తీర్మానించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఎం ఫ్లోర్‌లీడర్లను కమిటీలో సభ్యులుగా నియమించారు.

ప్రధానాంశాలు ఇవీ..

- నగరంలో గాలి నాణ్యతను వృద్ధి చేసేందుకు 15వ ఆర్థిక సంఘం నుంచి విడుదలైన రూ.24 కోట్లను నగరంలోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచించిన 14 ప్రాంతాల్లో ఎండ్–టూ–ఎండ్ రోడ్డు, పేపర్ బ్లాకులు వేయటానికి ఖర్చు చేయాలని వచ్చిన ప్రతిపాదనకు సభ్యులు ఆమోదం తెలిపారు.
- వివిధ డివిజన్లలోని పార్కుల్లో ఆటపరికరాలు, ఓపెన్ జిమ్ పరికరాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, వాటిని మరమ్మతులు చేయాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు.
- నగరంలోని అజిత్‌సింగ్‌నగర్‌లోని డీస్నీల్యాండ్ స్థలంలో ఆధునిక కబేళాను పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేయాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాన్ని ఎమ్యూజ్‌మెంట్‌కు వినియోగించాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. విద్యాధరపురంలోని కబేళానే ఆధునికీకరించాలని సవరణ తీర్మానం చేశారు.
- 43వ డివిజన్‌లోని లారీస్టాండ్‌ను ఐరన్ యార్డుకు తరలించినందున, ఆ స్థలాన్ని వీఎంసీ స్వాధీనం చేసుకుని, ప్రత్యామ్నాయంగా ఐరన్ యార్డులో లారీ యజమానులకు కార్యాలయాల నిమిత్తం షెడ్డును ఏర్పాటు చేయాలని అందుకు రూ.1.55 కోట్ల నిధులు కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనకు సభ్యులు ఆమోదం తెలిపారు.

15లోగా వైద్య కళాశాల తుది దశ పనులు పూర్తి

అధికారులకు కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): వైద్యకళాశాల తుది దశ నిర్మాణ పనులను ఆగస్టు 15లోగా పూర్తి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులకు ఆదేశించారు. ఆయన చాంబర్‌లో ప్రభుత్వ వైద్యకళాశాల పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మిస్తున్న మచిలీపట్నం వైద్యకళాశాలలో మౌలిక సదుపాయాలను వేగవంతంగా సమకూర్చాలన్నారు. డిపార్ట్‌మెంట్ రూమ్, ఫస్ట్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎగ్జామినేషన్ హాలు, వసతిగృహాలు తదితర భవనాల్లో పెయింటింగ్ పనులు విద్యుద్దీకరణ పూర్తి చేయాలన్నారు. ఆడియో, వీడియో పరికరాల ఏర్పాటు వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, హాస్టల్ బ్లాక్‌ల నిర్మాణం గడువులోగా పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సామగ్రిని సమకూర్చుకోవాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. ఇంటీరియర్ పరికరాలు అమర్చేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లో రాజీపడకుండా నాణ్యత కలిగిన మెటీరియల్‌ను ఉపయోగించాలన్నారు.

పారదర్శకంగా..

వైద్యకళాశాల నిర్మాణ పనులకు సంబంధించి సమాచారాన్ని పారదర్శకంగా తెలియజేసేందుకు వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రోజువారీ పనుల పురోగతిని ఆ గ్రూప్‌లో పొందుపరచాలన్నారు. అధికారులు సమన్వయంతో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో వచ్చే చిన్న, చిన్న సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో ఐ. కిశోర్, మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య, మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధి జగదీష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణరాజు, కళాశాల డీఈఈ ఎం. నళిని, డెప్యూటీ మేనేజర్ ఎ. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండంత పచ్చందం



కింద కృష్ణమ్మ సవ్వడులు.. పైన దుర్గమ్మకు ప్రకృతి కట్టిన పచ్చల హారాలు.. వెరసి ఇంద్రకీలాద్రి దివ్యక్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతోంది. కనుచూపు మేర చూసిన కనులదే భాగ్యమన్నట్లుగా పచ్చందాలు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొండ చుట్టూ చెట్లు పెద్ద ఎత్తున పెరగడంతో ఇంద్రగిరి హరితమయం అయ్యింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్షీరామృతం

జనని స్తన్యం.. జన్మధన్యం

- బిడ్డకు పాలివ్వడం తల్లికీ, బిడ్డకీ ప్రయోజనకరం
- శిశువు పుట్టిన అరగంటలోపు తల్లిపాలు పట్టించాలి
- ముర్రుపాలతో వ్యాధి నిరోధకశక్తి పెంపు
- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- విస్తృత అవగాహన కార్యక్రమాలకు ప్రణాళిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): పాశ్చాత్య సంస్కృతి అంటూ కొందరు, సౌందర్యం తగ్గుతుందని మరికొందరు, ఉద్యోగరీత్యా ఇంకొందరు తల్లులు బిడ్డలకు పాలివ్వడం లేదు. పుట్టిన నెలరోజులకే పోతపాలు పట్టిస్తున్నారు. ఇది మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, పుట్టిన అరగంటలోపు తల్లిపాలు తాగించడం వల్ల శిశువుకు అనేక ప్రయోజనాలు ఉన్నట్లు వైద్యులు వివరిస్తున్నారు. నేటికీ కొందరు మూఢ నమ్మకాలతో పుట్టిన రెండు, మూడు రోజుల వరకూ తల్లిపాలను ఇవ్వడం లేదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఇలాంటి చర్యల వల్ల బిడ్డలతో పాటు, తాము నష్టపోతున్నామనే విషయాన్ని తల్లులు గ్రహించలేక పోతున్నారని వైద్యులు వివరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తల్లిపాలలో ఉండే పోషకాలు, బిడ్డ ఎదుగుదలపై చూపే ప్రభావంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగించేందుకు ప్రపంచ ఆరోగ్యసంస్థ ఏటా ఆగస్టు 1 నుంచి 7 వరకూ వారోత్సవాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమశాఖతో కలిసి వైద్య ఆరోగ్యశాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది.

శిశు మరణాలు నివారించవచ్చు..


ఎక్కువ మంది శిశువులకు ఇన్‌ఫెక్షన్స్‌లు సోకడం, పుట్టగానే కామెర్లు, శ్వాసకోశ వ్యాధులతో మరణాలు సంభవించడం జరుగుతున్నట్లు యూనిసెఫ్ గుర్తించింది. అలాంటి మరణాలను నివారించేందుకు పుట్టిన అరగంటలోపు తల్లిపాలు తాగించడం ద్వారా నెలలోపు శిశువుల్లో సంభవించే మరణాలను తగ్గించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. దీంతో తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణులుగా ఉన్నప్పటి నుంచే విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నారు.

తల్లికీ మేలు..

బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికీ ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువ. రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బులు రావని వైద్యులు చెబుతున్నారు. అంతేకాదు బిడ్డకు పాలివ్వడం ద్వారా ప్రసవం అనంతరం అయ్యే రక్తస్రావాన్ని అదుపు చేస్తాయని వైద్యులు వివరిస్తున్నారు

శిశువులకు ప్రయోజనాలెన్నో..

- తల్లిపాలలో అన్ని పోషకాలు సమపాళ్లలో ఉంటాయి. వ్యాధి నిరోధకశక్తిని కూడా పెంపొందిస్తాయి.
- తల్లిపాలు తాగిన శిశువుల్లో యాంటీబాడీస్ వృద్ధి చెంది ఇన్‌ఫెక్షన్లు, నిమోనియా, డయేరియా వంటి వ్యాధులు సోకకుండా నివారించవచ్చు.
- మెదడు ఎదుగుదలకు దోహదం చేయడంతో పాటు, జ్ఞాపకశక్తి పెంపొందుతుంది. తల్లిపాలు తాగిన పిల్లల్లో తెలివితేటలు ఎక్కువగా ఉంటాయి.
- పసిబిడ్డకు ప్రధాన శత్రువు చలి. బిడ్డను ఒడిలో ఉంచుకుని పాలివ్వడం ద్వారా తల్లిశరీరం నుంచి శిశువుకు అవసరమైన వేడి అందుతుంది. అంతేకాదు తల్లీబిడ్డ మధ్య ఆప్యాయత పెరుగుతుంది.
- ముర్రుపాలు వ్యాధి నిరోధకశక్తిని పెంచడంతో పాటు, శిశువు జీర్ణాశయ అభివృద్ధికి దోహదపడే విటమిన్–ఎ అధిక మోతాదులో ఉంటుంది.
- శిశువు మొట్టమొదట విసర్జించే నల్లటి మెకోనియం అనే మలంతో పాటు, పచ్చకామెర్లు కలిగించే బెలురూబిన్ అనే పదార్థాన్ని కూడా త్వరగా విసర్జించేలా ముర్రుపాలు దోహదం చేస్తాయి. బిడ్డకు మొదటి వారంలో కలిగే పచ్చకామెర్లను నివారిస్తాయి.



తల్లిపాలు శ్రేష్ఠమైనవి



బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరం. శిశువుకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. సాధారణ ప్రసవం అయితే పుట్టిన అరగంటలోపు, సిజేరియన్ అయితే నాలుగు గంటల్లోపు తల్లిపాలు పట్టించాలి. ముర్రుపాలలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, ఇన్‌ఫెక్షన్స్ రాకుండా నివారిస్తాయి.

– డాక్టర్ బి. సునీత, నోడల్ ఆఫీసర్, నవజాత శిశు వైద్య విభాగం, జీజీహెచ్

అవగాహన కల్పిస్తున్నాం



తల్లిపాల విశిష్టతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లికీ ప్రయోజనాలు ఉన్నాయని అవగాహన కల్పిస్తాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, వైద్య ఆరోగ్యశాఖాధికారి, ఎన్టీఆర్ జిల్లా

నిర్ణీత సమయానికి సమస్యల పరిష్కారం

- కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు
- స్పందనలో 117 అర్జీలు స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నిర్ణీత సమయానికి పరిష్కారం చూపాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి, బందరు ఆర్డీవో ఐ. కిషోర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు జిల్లా నలుమూలల నుంచి వస్తున్నారని ఆయాశాఖల అధికారుల దృష్టికి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. అర్జీల సమస్యల పరిష్కారంపై తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్పందనలో 117 అర్జీలను స్వీకరించారు.

సైనిక్ సంక్షేమ నిధి అందజేత

జిల్లాలోని జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించిన సిబ్బంది రూ. 2.25 లక్షల నగదును సేకరించి సైనిక్ సంక్షేమ నిధికి అందించారు. స్పందన సమావేశపుహాలులో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్ పి. రాజాబాబు చేతుల మీదుగా ఈ నిధిని అందజేశారు.

వచ్చిన అర్జీల్లో కొన్ని..

- ఆర్ఎస్ నంబర్ 111/4లో 42 సెంట్ల భూమి ఆక్రమణకు గురైంది. దీనిపై కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ కూడా తెచ్చినప్పటికీ ఆక్రమణదారులు సంబంధిత భూమిని ఇవ్వడం లేదు. వెంటనే మ్యుటేషన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకం ఇప్పించాలని కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామానికి చెందిన నడకుదుటి మారెమ్మ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.
- గుడ్లవల్లేరు మండలంలోని లంకదొడ్డి గ్రామానికి చెందిన ఆర్ఎస్ నంబర్ 177లో ఉన్న 17 ఎకరాల వక్ఫ్‌భూమిని ఆక్రమించుకున్నారని, ఈ భూమిని తమకు అప్పగించి న్యాయం చేయాలని జిల్లా ముస్లిం ఐక్య కమిటీ సభ్యులు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.
- కృత్తివెన్ను మండలం చినపాండ్రాకలోని పొలాల్లోని మురుగునీరు బయటకు పోయేందుకు ఇంతేరు రోడ్డు నుంచి రంగారావుపేట వరకు ఉన్న 10 అడుగుల వెడల్పు ఉంది. అయితే దీనిని కొంత మంది పూడ్చివేశారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక రైతులు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు.

మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో వారంలోగా అంతర్గత ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహార చట్టం–2013 అమలుపై కలెక్టర్ ఢిల్లీరావు సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతోపాటు పని ప్రదేశాలలో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. చట్టంలో నిర్దేశించిన విధంగా సెక్షన్–29 ప్రకారం నియమాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 10 మంది కన్నా ఎక్కువ మంది ఉద్యోగస్తులు పని చేస్తున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో వారం రోజుల లోగా కమిటీలు ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

నలుగురు సభ్యులతో కమిటీ..

మహిళలు పని చేసే ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు, కర్మాగారాలు, అన్ని రకాల క్రయ, విక్రయాలు జరిపే షాపులు, సర్వీస్ సెంటర్లు, రైతు బజార్లు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్, చిన్నతరహా పరిశ్రమలు, తదితర సంస్థలను నడిపే యజమానులు చట్టం నిర్దేశించిన విధంగా ఫిర్యాదుల కమిటీలో సీనియర్ మహిళా ఉద్యోగిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించాలన్నారు. సామాజిక సేవ, న్యాయ విజ్ఞానం కలిగిన ఇద్దరు సభ్యులను, చట్టంపై పూర్తి అవగాహన కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థలో పని చేసిన ఒకరితో కలిపి మొత్తం నలుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ సభ్యుల కాల పరిమితి మూడేళ్ల కాలం ఉంటుందన్నారు. 10 మంది కన్నా తక్కువ ఉద్యోగులు ఉంటే సంబంధిత యజమానిపై ఫిర్యాదు చేయాల్సి వస్తే జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని స్థానిక ఫిర్యాదు కమిటీకి పంపాలన్నారు.

మూడు నెలలలోగా ఫిర్యాదు చేయాలి

వేధింపులకు సంబంధించి సంఘటన జరిగిన మూడు నెలలలోపు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందన్నారు. విచారణ సమయంలో ఏ వ్యక్తినైనా పిలిచి విచారించడం, పత్రాలు సమర్పించడం వంటి అధికారాలు సివిల్ కోర్టు మాదిరిగానే అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఉంటాయన్నారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్ కుమార్, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాలు రూపొందించండి

టెలి కాన్ఫరెన్స్‌లో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆయా ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట నష్టం అంచనాలను వ్యవసాయాధికారులు యుద్ధప్రాతిపదికన తయారుచేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. సోమవారం ఆయన టెలి కాన్ఫరెన్స్‌లో పంట నష్టం అంచనాలు, ఓటీఎస్, కల్యాణమస్తు, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు చాలా నష్టపోయారని వారికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దెబ్బతిన్న పంటల నష్టం అంచనాలు వెంటనే రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. పంటకాలువలు, మురుగుకాలువల్లో పూడిక తీత పనులు ఏ మేరకు జరుగుతున్నాయో ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. ఓటీఎస్ పత్రాల రిజిస్ట్రేషన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటన్నింటిని పూర్తి చేయాలన్నారు. కల్యాణమస్తు, షాదీతోఫా పథకాల కింద 730 దరఖాస్తులు వచ్చాయని అవి ఎంపీడీవో లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు చూపుతోందని వెంటనే వీటిని పరిశీలించి మంజూరు కోసం పంపాలన్నారు. ఆగస్టు 8వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించనున్నారు. డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చదువులకు మెరుగులు

- నేటి నుంచి ఎఫ్ఏ సీబీఏ-1 పద్ధతిలో పరీక్షలు
- 1 నుంచి 8 తరగతుల వరకూ ఓఎంఆర్ బేస్డ్ విధానంలో పరీక్షలు
- 9, 10 తరగతులకు నూతనంగా టోఫెల్ పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో పరీక్ష రాయనున్న 5,14,085 మంది విద్యార్థులు

సామర్థ్యాల వెలికితీతే లక్ష్యంగా నూతన పరీక్ష విధానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణా జిల్లాలో విద్యార్థులకు ఆగస్టు ఒకటి నుంచి ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలను నిర్వహించనుంది. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు, అభ్యసన పద్ధతుల మదింపు లక్ష్యంగా ఏటా విద్యాశాఖ పరీక్షలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది ప్రయోగాత్మకంగా నూతన పరీక్ష పద్ధతులకు శ్రీకారం చుట్టింది. క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) పేరుతో పరీక్షలను నిర్వహిస్తోంది. అదే క్రమంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గత సంవత్సరం నిర్వహించిన విధంగానే ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు సీబీఏ, తొమ్మిది, పది తరగతుల వారికి ఫార్మేటివ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సామర్థ్యాలను వెలికితీసే లక్ష్యంతో..

ఈ ఏడాది విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీన ప్రారంభమైన విషయం తెలిసిందే. పాఠశాల అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలను నిర్వహిస్తారు. జూన్, జూలై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపునకు, సీబీఏ, ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ద్వారా అభ్యసన లోపాలను గుర్తించి, ప్రత్యేక బోధన ద్వారా వారు సాధారణ స్థాయికి చేరుకునేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటారు.

బైలింగ్వల్ ప్రశ్నపత్రాలు

విద్యార్థులకు ఆంగ్లంలో ప్రశ్న పత్రం అర్థం కాకుంటే తెలుగులో చదువుకునేందుకు బైలింగ్వల్ ప్రశ్న పత్రాలను ప్రవేశ పెట్టారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకూ బైలింగ్వల్ పద్ధతిలో ప్రశ్న పత్రం ఉంటుంది. అలాగే పదో తగరతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియాల వారికి వేరువేరుగా ప్రశ్నపత్రాలను అందించనున్నారు. ప్రశ్నపత్రంలోని వివిధ ప్రశ్నలు మెకానికల్ అండర్ స్టాండింగ్ అప్లికేషన్ (ఎంయూఏ) ప్రశ్న పత్రం ఉంటుంది. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది. సీబీఏ విధానంలో పరీక్షలు రాసే విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలను ఓఎంఆర్ షీట్లలో నింపాల్సి ఉంటుంది.

ఐదో తేదీ వరకూ పరీక్షలు

సీబీఏ విధానంలో పరీక్షలను ఆగస్టు ఒకటి నుంచి ఐదో తేదీ వరకూ నిర్వహిస్తున్నారు. కృష్ణాజిల్లాలోని ఎయిడెడ్, ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లోని 1,01,097 మంది ప్రైవేట్ యాజమాన్యాల్లోని 1,10,622 మంది మొత్తం 2,11,719 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అలాగే ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ యాజమాన్యాల్లోని 1,10,281 మంది విద్యార్థులు, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 1,92,085 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 5,14,085 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. రెండు జిల్లాల్లో సుమారు 3247 ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయి.

ఈ ఏడాది నుంచి టోఫెల్

అంతర్జాతీయ ప్రమాణాలను అందించే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన మరో నూతన సంస్కరణ టోఫెల్ విధానం. టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యూజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్ (టోఫెల్)ను ఈ ఏడాది ప్రభుత్వం విద్యార్థులకు పరిచయం చేసింది. ఆడియో అండ్ ప్రాక్టీస్ పేపర్లను మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకూ అమలు చేస్తారు. గ్లోబల్ స్థాయి పోటీని తట్టుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దటం టోఫెల్ లక్ష్యం. ఇటీవల ప్రభుత్వం ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలను ఆయా ప్రభుత్వ విద్యాసంస్థలకు పంపిణీ చేసింది. అవి ఆయా పాఠశాలల్లో పూర్తిగా అందుబాటులోకి వచ్చిన ప్రాంగణాల్లో మాత్రమే ఈ పరీక్షను నిర్వహించనున్నారు.

అవగాహన ఉంది..



గత ఏడాది నుంచి నూతన పరీక్ష విధానం అమలులోకి వచ్చింది. క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానంపై ఉపాధ్యాయులకు ఇప్పటికే అవగాహన ఉంది. ఈ ఏడాది నూతనంగా టోఫెల్ పరీక్షను అమలు చేస్తున్నాం. దీనిపై సైతం ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– సీవీ రేణుక, డీఈవో, ఎన్టీఆర్ జిల్లా

మాధవ వర్మ పద్య నాటకానికి అవార్డుల పంట



ఉత్తమ నటునిగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ పీవీఎన్ కృష్ణ

విజయవాడకల్చరల్: మాధవ వర్మ పద్యనాటకానికి మూడు విభాగాలలో అవార్డులు లభించాయని నగరానికి చెందిన రంగస్థల దర్శకుడు పీవీఎన్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి మహతి స్టేడియంలో 8 రోజుల పాటు నిర్వహించిన 32 వ జాతీయ స్థాయి పద్యనాటికల పోటీలలో మాధవ వర్మ పద్యనాటకానికి ఉతమ ప్రదర్శన, ఉత్తమ రచన, ఉత్తమ నట విభాగంలో అవార్డులు లభించాయని తెలిపారు. మాధవ వర్మ పద్యనాటకం గతంలోనూ జాతీయ స్థాయిలో అనేక అవార్డులను గెలుచుకుంది. ఈ సందర్భంగా నగరానికి చెందిన సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ, సుమధుర కళానికేతన్ తదితర సంస్థలు అభినందనలు తెలియజేశాయి.

గర్భిణులకు ఆసరాపై అవగాహన



లబ్బీపేట(విజయవాడతూర్పు): గర్భిణులకు కాన్పు అనంతరం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వర్తించే ఆసరా పథకంపై అర్హులందరికీ అవగాహన కలిగించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్య ఆసరా పథకాన్ని అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హైరిస్క్ గర్భిణులు, రక్తం అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆస్పత్రులకు తరలించే విధంగా రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుమన్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల నిరసన



ధర్నాలో మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ పెన్షనర్ల సంఘ నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు)/మధురానగర్(విజయవాడసెంట్రల్): పెన్షన్ రివిజన్‌ను తిరస్కరించడానికి వ్యతిరేకంగా బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ పెన్షనర్లు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. విజయవాడ మహాత్మాగాంధీరోడ్డులోని కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో వందలాది మంది పెన్షనర్లు పాల్గొన్నారు. తమకు న్యాయబద్ధమైన పెన్షన్ విషయంలో అనేకసార్లు టెలికమ్యూనికేషన్ విభాగం వారు ఇచ్చిన హామీలను ఉల్లంఘిస్తూ ఉద్దేశపూర్వకంగా ఆ ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారని పలువురు మండిపడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో జూలై 6న బ్లాక్ డే పాటించి మూడు దశల కార్యాచరణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తమ డిమాండ్ నెరవేరకపోతే ఆగస్టు 21–25 తేదీల్లో ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ఐదు రోజుల ధర్నా నిర్వహిస్తామని పెన్షనర్లు పేర్కొన్నారు.

ప్రాణాంతకం...వీరి విన్యాసం



ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడమే నేరం... అయితే వీరు నలుగురు ప్రయాణించడమే కాదు...వారి భుజాలపై దాదాపు 15 అడుగుల వెదురు బొంగును మోస్తూ అత్యంత ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. ఏ మాత్రం తేడా అయినా వీరి విన్యాసం ప్రాణాంతకంగా పరిణమించే ప్రమాదముంది. కంకిపాడు మండలం మద్దూరు కరకట్టపై ఈ దృశ్యం కనిపించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



అశోక్‌కుమార్ మృతదేహాన్ని ఒడ్డుకు తరలించిన ఫైర్ సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పోలవరం కాల్వలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. టీనర్‌పేట టీఎంహెచ్ స్కూల్ ప్రాంతానికి చెందిన కంతేటి అశోక్‌కుమార్ ఆదివారం సాయంత్రం పి.నైనవరం వద్ద పోలవరం కాల్వలో గల్లంతైన విషయం విదితమే. ఘటనపై కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సోమవారం ఉదయం పోలవరం కాల్వ వద్దకు చేరుకున్న కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం, కొత్తపేట అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ తలశిల శ్రీనివాసరావు, సిబ్బంది అశోక్‌కుమార్ కోసం కాల్వలో తీవ్రంగా గాలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అశోక్‌కుమార్ కుటుంబీకులు, స్నేహితుల రోదనలతో కాల్వ గట్టు వద్ద విషాదచాయలు అలుముకున్నాయి. ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు కాల్వలో గాలించిన అనంతరం అశోక్‌కుమార్ ఎక్కడయితే స్నానానికి దిగాడో అక్కడే మృతదేహాన్ని గుర్తించారు.

వెంటనే అగ్నిమాపక సిబ్బంది తాడు సాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పరిపూర్ణ ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో ఓటర్ల డోర్ టు డోర్ వెరిఫికేషన్ సమర్థంగా నిర్వహించి బూత్ లెవల్ ఏజెంట్ల సమన్వయంతో పరిపూర్ణమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పురస్కరించుకుని సోమవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు నగరంలోని తన విడిది కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024ను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి సూచించారన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమై ఆగస్టు 21వ తేదీ వరకు నిర్వహించే డోర్ వెరిఫికేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పరిపూర్ణమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారికి జిల్లా ఓటర్ల జాబితాపై సమగ్ర సమాచారం అందించేందుకు నియోజకవర్గ స్థాయి నివేదికలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని కలెక్టర్ సహాయ ఎన్నికల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా టర్న్అవుట్ ఇంప్లిమెంటేషన్ ప్లాన్ (టీఐపీ) తో నూరు శాతం పోలింగ్‌కు చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాలతో పోలిస్తే అర్బన్ ప్రాంతాల్లో ఇంటింటి సర్వేలో ఎక్కువ సమస్యలు ఉంటాయని బీఎల్‌వోలు దీనిపై క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఒకే డోర్ నంబర్‌తో ఉండే అపార్ట్‌మెంట్లలోని ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫ్లోర్, ఫ్లాట్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. బూత్ స్థాయి అధికారులు నిర్వహించిన డోర్ టు డోర్ జాబితాను ఐదు శాతం సూపర్‌వైజర్‌లు, ఒక శాతం ఏఈఆర్‌ఓలు, 10 శాతం ఈఆర్‌ఓలు క్రాస్ చెక్ చేసుకుని పరిశీలనలో తప్పులను గుర్తిస్తే సంబంధిత బీఎల్‌వోలపై ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.మోహన్ కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జె.ఉదయభాస్కర్ రావు, ఆర్డీవోలు వై.వి ప్రసన్నలక్ష్మి, ఎ.రవీంద్రరావు, జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి వచ్చిన నష్టం ఏమీలేదు




కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన యార్లగడ్డ రామ్‌చందు వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరటం వలన పార్టీకి వచ్చిన నష్టం ఏమీ లేదని కాజ సర్పంచ్ కొడాలి భవాని, ఉపసర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మొవ్వ మండలం కాజ గ్రామంలో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాజ గ్రామానికి చెందిన చందు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో టీడీపీలో చేరారనడం బూటకమని, పొరుగూరు వారిని ఎక్కువగా తీసుకువచ్చి ర్యాలీ చేశాడన్నారు. చందుకు పార్టీలు మారటం కొత్త కాదన్నారు. జూద వ్యసనపరుడైన చందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జూద నిర్వహణకు తావు లేకపోవటంతో ఇటువంటి చర్యలకు దిగాడని తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీలు పేకేటి వెంకటలక్ష్మి, యల్లమల్లి కుటుంబరావు, పీఏసీఎస్ చైర్మన్ జోగి రామచంద్రరావు, నాయకులు తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మద్రివాడ బాబ్జిరెడ్డి, కొక్కిలిగడ్డ సునీల్ బాబు, కొడాలి నాగ రాజు, మద్రివాడ సుధాకర రెడ్డి, మంద శ్రీనివాసరెడ్డి, పేకేటి సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

పెడన: మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఆర్ఎంపీగా విధులు నిర్వహించే భూపతి ఏడుకొండలు(53) ఆదివారం మధ్యాహ్నం మరణించారు. వాంతులు, విరోచనాలతో చికిత్స పొందుతూ ఇంటివద్దే చనిపోవడంతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. అయితే ఏడుకొండలు సోదరుడు భూపతి జోజిబాబు పెడన పోలీసులకు తన సోదరుడి మరణంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోమవారం ఉదయం ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్ఐ టి.సురేష్‌కుమార్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఏడుకొండలు మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

జేవీవీ జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణకిశోర్ మృతి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణకిషోర్(65) సోమవారం మృతిచెందారు. వేదిక వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయన కొద్ది కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య రెండేళ్ల క్రితం మరణించారు. జన విజ్ఞాన వేదికలో 1988 నుంచి ఆయన క్రియాశీలకంగా ఉన్నారు. రెండేళ్ల క్రితం విజయవాడలో జేవీవీ జాతీయ మహాసభలు నిర్వహించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. విజయవాడ ఫిల్మ్ సొసైటీ ప్రధాన కార్యదర్శిగా అంతర్జాతీయ అవార్డు చిత్రాలను ఉచిత ప్రదర్శనలు ఏర్పాటుచేసి పలువురి ప్రశంసలు అందుకున్నారు. తన తండ్రి కోరిక మేరకు ఆయన భౌతిక కాయాన్ని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ఇచ్చినట్లు కుమార్తె అరుణ తెలిపారు.

క్లుప్తంగా

జిమ్నాస్టిక్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన దీపిక



భవానీపురం (విజయవాడ పశ్చిమ): మహారాష్ట్ర పూనేలో సెకండ్ లెవెల్ – వైజ్ జిమ్నాస్టిక్ ఇంటర్‌నేషనల్ కాంపిటీషన్‌లో కంతు దీపిక సిల్వర్ మెడల్ సాధించింది. ఆదివారం పూనేలో జరిగిన ఈ పోటీల్లో ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ విభాగంలో దీపిక ఈ పతకాన్ని అందుకుంది. అలుగోలు స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది పతకాన్ని సాధించిన మొట్టమొదటి విజేతగా దీపిక నిలవడం అకాడమీకి గర్వకారణమని సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని మెడల్స్ సాధించాలని వారు ఆకాంక్షించారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని షేక్ రాజాసాహెబ్ హెల్త్ సెంటర్‌లో పేషెంట్లకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సోమవారం అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మరుపిళ్ల రాజేష్ మాట్లాడుతూ.. సమాజంలో వివిధ వర్గాలకు రోటరీ సంస్థలు విశేషమైన సేవలందిస్తున్నాయన్నారు. విద్యా, వైద్య రంగాలకు అందించే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. క్లబ్ అధ్యక్షుడు బాయన బాబూజీ(బాబ్జీ) మాట్లాడుతూ.. హెల్త్ సెంటర్‌లోని పేషెంట్లకు హార్లిక్స్ 500 గ్రాముల ప్యాకెట్స్, బ్రెడ్ ప్యాకెట్స్, పసి పిల్లలకు మల్టీ విటమిన్, మల్టీ మినరల్ చుక్కల మందు సీసాలు కలిసి ఉన్న కిట్లను 300 మంది గర్భిణులకు, బాలింతలకు పండ్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమానికి సహకరించిన సహచర రోటరీయన్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గుండారపు శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ కార్యదర్శి మాలపాక భాస్కర్, క్లబ్ కోశాధికారి గణేష్ సుబ్బారావు, క్లబ్ ప్రముఖులు ముదిలి మోహనరావు, ఆర్వీ సుబ్బరాజు, షేక్ అమానుల్లా, యాంపాటి శ్రీనివాసరావు, రాజగిరి సోమేశ్వరరావు, వి.దామోదరరావు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీసమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అధిక శ్రావణ మాసం స్వామివారికి ప్రీతికరమైన సోమవారం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామివారికి పాలు, తేనే, విభూది, పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు దాట్ల వెంకట నరసింహరాజు పర్యవేక్షించారు.

ముమ్మరంగా ఓటర్ల సర్వే



పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం 64వ డివిజన్‌లో కండ్రిక, ప్రజాశక్తి నగర్ ప్రాంతాల్లో సోమవారం ఓటర్ల సర్వేను బూత్ స్థాయి అధికారులు నిర్వహించారు. ఓటర్ల జాబితాలో పేర్కొనబడిన ఇంటి నంబర్ల ప్రకారం ఆయా ఇళ్లల్లో ఉన్న ఓటర్లు పేర్లు అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం 6, 7, 8 ఫామ్స్ లోని వివరాలను ఓటర్లకు తెలియజేసి, మృతి చెందిన వారి పేర్లు తొలగించడం, అడ్రస్‌లో మార్పులు జరిగితే వారి ఆధార్‌కార్డు ప్రకారం ఓట్లను ఆ ప్రాంతంలో ఉండే విధంగా మార్పు చేశారు. బూత్‌స్థాయి అధికారులతో పాటు స్థానిక నాయకులు, బూత్ కన్వీనర్లు షేక్ ఇస్మాయిల్, జడి కృష్ణారావు, మందా ఉషారాణి, చెక్కా నరసింహరావు, బొమ్మాళి రాజారావు, చేబ్రోలు శేఖర్, కృపాకుమార్ తదితరులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను తిలకిస్తున్న వైద్య విద్యార్థులు



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కంచర్ల సుధాకర్, సూపరింటెండెంట్ వెంకటేష్

ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): శరీర దారుఢ్యానికి, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ఆ కళాశాల స్పోర్ట్స్ అండ్ కాలేజ్ డే వేడుకలను సోమవారం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్‌తో కలిసి ప్రిన్సిపాల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. చదవులో రాణిస్తూనే క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారని, అప్పుడే జీవితంలో ఏదైనా సాధించగలుగుతారన్నారు. క్రీడలతో మానసిక దృఢత్వం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 4 గంటల వరకూ క్లాసెస్ ఉంటాయని, అనంతరం సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకూ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

20న కాలేజ్ డే వేడుకలు

ఇండోర్ గేమ్స్‌ను రాత్రి కూడా నిర్వహిస్తామని, అవుట్‌డోర్ గేమ్స్ పగలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ప్రతి ఈవెంట్‌ను ఒక ఫ్యాకల్టీ నిర్వహిస్తారని, 20 రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహించి ఆగస్టు 20న కాలేజ్ డే వేడుకలు జరుగుతాయన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. గెలుపు, ఓటములు సహజమని, రెండింటినీ సమానంగా స్వీకరించాలని సూచించారు. క్రీడలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, చెస్, టేబుల్ టెన్నీస్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్, త్రోబాల్ వంటి పోటీలు నిర్వహించనున్నారు. అకడమిక్ యాక్టివిటీస్‌లో సైతం పలు అంశాల్లో పోటీలు జరుగనున్నాయి. అంతేకాకుండా మిస్ కాలేజ్, మిస్టర్ కాలేజ్, డ్యాన్స్, వక్తృత్వం, క్విజ్ వంటి పోటీలు నిర్వహించనున్నారు. ఈ వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జె.రాము తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన మార్చ్‌ఫెస్ట్ ఆకట్టుకుంది.

సాంకేతిక విద్యతో లక్ష్యాన్ని సాధించవచ్చు



మాట్లాడుతున్న వీఆర్‌ఓ అధ్యక్షుడు గోపాలరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్‌ఈపీ) విద్యా ప్రమాణాలకు అనుగుణంగా సాంకేతిక విద్యను నైపుణ్యంతో నేర్చుకోవాలని, తద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్(వీఆర్‌ఓ) ప్రెసిడెంట్, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.గోపాలరావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌కు గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ విలేజ్ రీకన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ రూ.1,50,000ల విలువ చేసే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ)ను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు ఐఎఫ్‌పీను బహూకరించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు వివిధ రూపాల్లో తమ వంతు సాయం అందజేస్తున్నామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధికి చేయూత ఇవ్వడమే తమ సంస్థ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ జాయింట్ డైరెక్టర్ ఫాదర్ వేలంగణి, సీటీఓ ఎం.సుబ్రహ్మణ్యం, విశ్రాంత అధ్యాపకుడు కె.భాస్కరరావు, అడ్వకేట్ కెజేఎస్ ప్రకాశరావు, టి.సుబ్బారావు, టి.రమాదేవి, డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ ప్రెసిడెంట్ ఆర్.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఆర్.గోపాలం, సెక్రటరీ ఎం.నరసింహరావు, ట్రెజరర్ డి.నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం బి.డేవిడ్ రాజు పాల్గొన్నారు.

19 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్‌ఎఫ్‌ఐ) ఎన్టీఆర్ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈ నెల 19, 20 తేదీల్లో విజయవాడ నగరంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం సమావేశాలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. విద్యా రంగంలో సమస్యలపై జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ విజయవాడ నగర నాయకులు మన్మథ, కుమారస్వామి, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

6న జిల్లా యోగాసన పోటీలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణా జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన జిల్లా యోగాసన పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రటరీ ఎల్.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిది సంవత్సరాల నుంచి 45 ఏళ్ల మధ్య వారికి వివిధ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ఆధార్ కార్డ్ జిరాక్స్, జనన ధ్రువీకరణ పత్రం సమర్పించి రూ.150లు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని చెప్పారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ హైస్కూల్‌లో పోటీలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 94411 19909 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అవుట్‌ఫాల్ డ్రెయిన్లపై ప్రమాదాలకు చెక్

- రూ.36 లక్షలతో ఐరన్ గ్రిల్స్ పనులు
- రామలింగేశ్వరనగర్‌లోని పలు వీధుల్లో ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు



వీఎంఆర్ రోడ్డులో అవుట్‌పాల్ డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్

ఆటోనగర్(విజయవాడతూర్పు): అవుట్‌ఫాల్ డ్రెయిన్లపై ప్రమాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టింది. అవుట్‌ఫాల్ మురుగు కాలువలో పడి గాయాలపాలవడం వంటి ఘటనలు రామలింగేశ్వరనగర్ పరిధిలో నిత్యకృత్యంగా జరిగేవి. ఈ సమస్యను పరిష్కరించేందుకుగాను గత ప్రభుత్వ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు ప్రజలు కాళ్లు అరిగేలా తిరిగారు. అయినప్పటికీ సమస్యను పట్టించుకున్న పాపానపోలేదు. వృద్ధురాలు, చిన్నారులు డ్రెయినేజీ కాలువలో పడి తీవ్ర గాయాలపాలయ్యేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డ్రెయినేజీలపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపింది.

గత కొన్నేళ్లుగా సమస్య..

15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లోని వీఎంఆర్, రఘురోడ్డు, గాంధీనగర్, నీలవేణిరోడ్డు, సాయికట్ పిసెస్ రోడ్డు, ఎర్రపోతుల వారివీధి, చెల్లారావువీధి, గాంధీకాలనీ వరకు 400 కుటుంబాల వారు డ్రెయినేజీలపై రాకపోకలు సాగిస్తారు. నివాసాల మధ్య డ్రెయిన్ ఉంది. గత కొంత కాలంగా ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ప్రజలకు భద్రత కరువైంది. కనీసం కాలువలపై సిమెంట్ దిమ్మెలు వేయలేదు. దీంతో రాత్రి సమయాల్లో వృద్ధులు, చిన్నారులు కాలువల్లో పడి గాయాలు పాలయ్యారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు..

అవుట్‌ఫాల్ డ్రెయిన్ కాలువపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తానని గత కార్పొరేషన్ ఎన్నికల్లో బెల్లం దుర్గ హామీ ఇచ్చారు. కార్పొరేటర్‌గా ఆమె గెలుపొంది, ప్రస్తుతం డెప్యూటీ మేయర్‌గా ఉన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా సమస్యను పరిష్కరించారు. కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.36 లక్షలతో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై ఐరన్ గ్రిల్స్‌ను గత కొద్ది నెలల క్రితం ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

మా సమస్యను పరిష్కరించారు..



ఇళ్ల మధ్య ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌తో గత కొంతకాలంగా నానా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. డ్రెయిన్‌లో పడి గాయాల పాలైన ఘటనలో రోజూ జరుగుతుండేవి. వృద్ధులు, చిన్నారుల ఇబ్బందులు వర్ణనాతీతం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డెప్యూటీ మేయర్ దుర్గ స్పందించి నిధులు మంజూరు చేయించారు. దీంతో ప్రమాదాలకు చెక్ పడింది.

– ఎం.రమేష్, స్థానికుడు, రామలింగేశ్వరనగర్

దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వంట విషయంలో చోటుచేసుకున్న వివాదంలో దాడికి పాల్పడిన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశాకు చెందిన నివాస్ నెహర్ పొట్టకూటి కోసం విజయవాడకు వలస వచ్చాడు. నివాస్ నెహర్‌తో పాటు శ్రీను నెహర్, రుషియా నెహర్, దాసు, కృష్ణ నెహర్‌లు ఉడా కాలనీలో ఒకే గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలో వంట చేసే విషయంలో గొడవ జరిగింది. ఆదివారం సాయంత్రం కృష్ణ నెహర్ రేకుల షెడ్డులో ఉన్న కర్ర తీసుకుని నివాస్ నెహర్ తలపై కొట్టాడు. దీంతో నివాస్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆక్రమణలు తొలగించండి

సబ్‌కలెక్టర్ అదితిసింగ్ ఆదేశం

విజయవాడరూరల్: నున్న గ్రామం కోటకట్ట(స్టేట్ బ్యాంక్) సెంటర్లో ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని విజయవాడ సబ్‌కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో సోమవారం సబ్‌కలెక్టర్ అదితి సింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నున్న బ్యాంక్ సెంటర్లో ఆర్అండ్‌బీ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు ఇటీవల సర్వే చేసి తాత్కాలిక ఆక్రమణలను గుర్తించారు. వీటిని ఆగస్టు 20వ తేదీలోపు పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రూరల్ తహసీల్దార్ పి.జాహ్నవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు, ఆర్అండ్‌బీ డీఈ ఆర్.సత్యనారాయణ, పోలీసు, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

అనువాద సాహిత్యం విస్తృతం కావాలి



నవల ఆవిష్కరణ సభలో పాల్గొన్న ప్రసేన్ బెల్లంకొండ, బండ్ల మాధవరావు, వల్లభరావు తదితరులు

విజయవాడ కల్చరల్:అనువాదసాహిత్యం విస్తృతం కావాలని కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడు ప్రసేన్ బెల్లంకొండ అన్నారు. అక్షర సాహితీ సాంస్కృతిక పీఠం, సాహితీ మిత్రులు, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిన రేహన్ పర్‌రగ్గా తెలుగు అనువాదం తాకట్టులో రఘునాథ్ నవల పరిచయం, ఆవిష్కరణ సభ జరిగింది. అనువాద నవలను ఆవిష్కరించిన ప్రసేన్ మాట్లాడుతూ గతంలో బెంగాలీ నుంచి అనేక నవలలు తెలుగులో అనువాదం అయ్యాయని మూలం చెడకుండా అవి తెలుగు నవలే అన్న భ్రమను కలిగించాయన్నారు. ప్రస్తుతం అనువాదాల సంఖ్య బాగా తగ్గిపోయిందని, ఇతర భాషల నుంచి అనువాదాలు రావాల్సిన అవసరముందన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు తొలి ప్రతిని అందుకొని మాట్లాడుతూ అనువాదాల వల్లనే సాహిత్యం సుసంపన్నమవుతుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు మాట్లాడుతూ అనువాద సాహిత్యం వల్లనే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందన్నారు. నవల అనువాదకుడు పేరిశెట్టి శ్రీనివాసరావు అనువాద విశేషాలను తెలియజేశారు. విద్యావేత్త బండ్ల మాధవరావు సభ నిర్వహించారు. చినుకు మాసపత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ నవల విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ ప్రభాకర్, అనిల్ డ్యానీ, శైలజా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశు వైద్యశాలకు రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న దాతలు శారద, కరుణశ్రీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు పశు వైద్యశాలకు దాతలు శ్రీకాకొలపు శారదాదేవి, దారా కరుణశ్రీ సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలు మాట్లాడుతూ శ్రీకాకొలపు వెంకట శ్రీనివాసరావు, విజయ్ శేఖర్ జ్ఞాపకార్థం తాము పశు వైద్యశాలకు విరాళం అందించామన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాలను దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కొత్త శ్లాబ్ వేయించటంతో పాటు మరమ్మతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విష్ణు సహస్రనామ పారాయణమండలి కన్వీనర్ మండలపర్తి సత్యశ్రీహరి మాట్లాడుతూ ఇక్కడ పశువులకు వైద్యసేవలు అందిస్తున్నారని, ఇప్పుడు దాతల సహకారంతో మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పశు వైద్యశాల లైవ్ స్టాక్ ఆఫీసర్ రామకృష్ణ మాట్లాడుతూ.. పశు వైద్యశాల అభివృద్ధికి స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష ఒక కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, తిరుపతి వెంకయ్య, అంగిరేకుల విజయ్ పాల్గొన్నారు.

నగదు చెల్లింపుపై ఘర్షణ

ఉంగుటూరు: వైన్‌షాపు వద్ద ఫోన్‌పే చెల్లించే విషయంలో జరిగిన దాడిలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన నందమూరులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉయ్యూరు మండలం కలవపాముల దూబామాలపల్లికి చెందిన పాగోలు శ్రీకాంత్ తన స్నేహితుడు కాళ్ల నవీన్‌తో కలసి నందమూరు క్రాస్‌రోడ్డులో వైన్‌షాపునకు వెళ్లారు. డబ్బులు చెల్లించేందుకు శ్రీకాంత్ ఫోన్‌పే చేస్తుంటే ఫోన్‌పే కాలేదు. ఇంతలో ఫోన్‌పే పని చేయడం లేదని వైన్‌షాపులోని వ్యక్తి చెప్పాడు. నా ముందు నలుగురికి ఫోన్‌పే పని చేసినపుడు నాకు ఎందుకు పని చేయదని అడుగుతున్నాడు. అంతలో బయట ఉన్న పెనుమత్స రాజేష్, కూడేటి నాగమురళి, కోటయ్య.. శ్రీకాంత్‌తో ఘర్షణ పడ్డారు. ఘటనలో శ్రీకాంత్ నుదిటిపై గాయం కావడంతో ఉంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ జి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, అధికారులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగర శివారు ప్రాంతాల్లో కూడా ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి కొళాయిల్లో నుంచి మురికి నీరు వస్తుందని స్థానిక ప్రజలు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాకు వివరించగా ఆయన ఆయా ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. తాగునీటి సరఫరా అధికారులు, సిబ్బందిని పిలిపించి కొళాయిల్లో వస్తున్న తాగునీటిని పరీక్షించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కొన్నిచోట్ల నీరు రంగు మారి ఉంటుంది తప్ప ఎక్కడా కలుషిత నీరు రావడం లేదని నిర్ధారించడంతో స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. రుహుల్లా మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రధానంగా వేసవిలో కూడా నగర శివారు ప్రాంతాలన్నింటికీ తాగునీటిని పుష్కలంగా అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న యువకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి రోజూ క్రమం తప్పకుండా జిమ్‌కు వెళ్లడం, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటారని సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. సింగ్‌నగర్–న్యూరాజరాజేశ్వరీపేట రోడ్డులోని హార్డ్‌కోర్ గర్ల్స్ జిమ్ ఆధ్వర్యంలో బాడీ బిల్డింగ్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పి న మాట అక్షర సత్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిమ్‌కు వెళ్లడం, శరీర ధారుఢ్యంపై ఆసక్తి చూపడం వల్ల మద్యం, సిగరెట్లతో పాటు ఇతర చెడు వ్యసనాలకు దూరంగా జీవించవచ్చన్నారు. సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట పరిసర ప్రాంతాల్లోని యు వత చెడు మార్గంలోకి ప్రయాణించకుండా ఇటువంటి జిమ్‌లు ఎంతో దోహదపడుతున్నాయని చెప్పా రు. మిస్టర్ ఆంధ్రా ట్రోఫీ గ్రహీత బోళ్ల తిరువెంకట రాకేష్ మాట్లాడుతూ.. యువతకు బాడీ బిల్డింగ్‌పై మరింత ఆసక్తిని పెంచాలనే ఉద్దేశంతో తమ జిమ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వయస్సు, బరువుల ఆధారంగా యువతకు బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన మొదటి ముగ్గురికి బహుమతులు, ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో సుధీర్, మురళీ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కిసాన్ శ్రామిక్ సత్సంగ్



చెక్కు అందజేస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రైతులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని, రైతులకు అండగా కిసాన్ శ్రామిక్ సత్సంగ్ పనిచేయటం అభినందనీయమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడు అన్నారు. స్థానిక దుర్గాపురం వాకర్స్ క్లబ్‌లో సోమవారం కిసాన్ శ్రామిక్ సత్సంగ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన సన్నకారు రైతులకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతుల వల్లే నేడు మనం కడుపునిండా భోజనం చేయగలుగుతున్నామని రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. అటువంటి రైతులను ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అనంతరం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు భార్యతో పాటు మరో 10 మంది నిరుపేద సన్నకారు రైతులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్నాథం, ఫణి, సీహెచ్ కోటేశ్వరరావు, మండా రాము, వై.రామకృష్ణప్రసాద్ మహమ్మద్ జానీ పాల్గొన్నారు.

ముత్యాల రమేష్‌కు ఆత్మీయ సత్కారం



రమేష్‌ను సత్కరిస్తున్న పరచూరి విజయలక్ష్మి, బాయన శ్రీనివాసరావు

విజయవాడకల్చరల్: ఏపీ ఫిలిం చాంబర్ డిస్ట్రిబ్యూషన్ విభాగంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఈసీ సభ్యునిగా నియమించబడ్డ ముత్యాల రమేష్‌ను గాంధీనగర్‌లోని ఏపీ ఫిలిం చాంబర్ హాల్‌లో సోమవారం పలువురు అభిమానులు ఆత్మీయంగా సత్కరించారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. శక్తి పిక్చర్స్ ద్వారా రమేష్ అనేక విజయవంతమైన చిత్రాలను పంపిణీ చేశారన్నారు. గతంలో నాలుగేళ్ల పాటు తెలుగు ఫిలిం చాంబర్‌కు కార్యదర్శిగా సేవలు అందించారని తెలిపారు. విజయవాడ ఫిలిం చాంబర్ సభ్యుడు బాయన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన ఫిలిం చాంబర్ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించడానికి ఆయన కృషి చేశారన్నారు. పలువురు ఫిలిం చాంబర్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ దాటే సమయంలో జాగ్రత్తలు పాటించండి



పాదచారులకు అవగాహన కల్పిస్తున్న నాగరాజు, రైల్వే పోలీసులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రైల్వే ట్రాక్‌ను దాటే సమయంలో పాదచారులు చాలా జాగ్రత్తలు పాటించాలని జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పొదిగింటి నాగరాజు అన్నారు. స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీ– మధురానగర్ రూటులో రైల్వే ట్రాక్‌పై రాకపోకలు సాగిస్తూ స్థానిక ప్రజలు తరచూ ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో రైల్వే పోలీసులు, జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసరమైతే తప్ప రైల్వే పట్టాలపై రాకపోకలు సాగించాలన్నారు. ప్రవేశం లేని ప్రదేశాల్లో రైల్వే ట్రాక్‌పై రాకపోకలు సాగించరాదని, వీటివల్ల ప్రాణాలకే ప్రమాదమని సూచించారు. వాల్‌పోస్టర్ల సాయంతో రైలు ప్రమాదాలు ఏ విధంగా చోటుచేసుకుంటాయి, వాటి వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లామని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో విస్తృత ఉపాధి అవకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మండల రవికుమార్ అన్నారు. కేబీఎన్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ – ఆర్టిఫిషియల్ క్రియేటివిటీ – విత్ చాట్ జీపీటీ' అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించి వినియోగించే భాష, వివిధ ఫార్ములాలు తదితర అంశాలపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. దీని వల్ల మానవ వనరుల వినియోగం తగ్గుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో చోటు చేసుకున్న మార్పులను విద్యార్థులకు తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, విభాగాధిపతి పి.రవీంద్ర, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కొనుగోలు చేసిన కరెంటుకే బిల్లు



సాక్షి, అమరావతి: విద్యుత్ సర్దుబాటు చార్జీలనేవి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆదేశాల మేరకు మాత్రమే ప్రజల నుంచి సేకరిస్తున్నామని ఏపీ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి తెలిపారు. విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల నష్టాలను భర్తీ చేసుకోడానికి ప్రజల నుంచి సర్దుబాటు చార్జీలు సేకరిస్తున్నారంటూ ఈనాడు ప్రచురించిన 'బిల్లు చూస్తేనే షాక్' కథనాన్ని సోమవారం ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. వినియోగదారులకు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయడం కోసం కరెంట్ కొరత ఉన్న రోజుల్లో అధిక ధరలకు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తుందని, దానికి అయిన ఖర్చునే ఇంధన సర్దుబాటు చార్జీల రూపంలో తీసుకుంటున్నామని వివరించారు. విద్యుత్ బిల్లులో సమస్యలు ఉంటే వినియోగదారులు సంబంధిత విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

అద్భుతం.. అంబేడ్కర్ స్మృతివనం

మంత్రులు మేరుగు, జోగి



బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు మేరుగు, జోగి

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): ప్రపంచ పర్యాటకుల దృష్టిని ఆకర్షించేలా అత్యద్భుతంగా నిర్మితమవుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రులు మేరుగు నాగార్జున, జోగి రమేష్ తెలిపారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనం పనులను వారు సోమవారం పరిశీలించారు. మంత్రులు మాట్లాడుతూ విగ్రహం, స్మృతివనం నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేసి సీఎం జగన్ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉద్యోగ విరమణ వయసు పెంపుపై ఆచార్యుల హర్షం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైవీయూ వీసీ, ఆచార్యులు

వైవీయూ (వైఎస్సార్ జిల్లా): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సును 62 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై అధ్యాపకలోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే వేటు తప్పదు

- ప్రధాన ఎన్నికల కమిషనర్ మీనా

సాక్షి, విశాఖపట్నం: ప్రతి ఒక్కరి ఓటు విలువైందే కాబట్టి.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అలసత్వం వహిస్తే విధుల్లో వేటు తప్పదని బూత్ లెవల్ అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా హెచ్చరించారు. విశాఖలో సోమవారం పర్యటించిన ఆయన ఏయూ ఎదురుగా 221 నం. పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఇంటింటికి ఓటరు సర్వే కార్యక్రమంలో కలెక్టర్ మల్లిఖార్జునతో కలిసి పాల్గొన్నారు.

చైతన్య గోదావరి బ్యాంక్ యాప్ ప్రారంభం

సాక్షి, అమరావతి: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ నూతన యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ప్రారంభించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అధ్యక్షుడు టి.కామేశ్వరరావు, అధికారులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్‌ను కలిశారు. యాప్‌ను ప్రారంభించంతోపాటు బ్యాంక్ 2022–23 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదికను సీఎస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 జిల్లాల్లో 249 శాఖలతో 27 లక్షల మంది ఖాతాదారులకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అందిస్తున్న సేవలను అభినందించారు. ఖాతాదారుల సౌకర్యార్థం మొబైల్ బ్యాంకింగ్ సేవలను మరింత సులభంగా అందించేందుకు CGGB MONEY 2.0 APPను ఆవిష్కరించడం శుభపరిణామమని అన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్లు డాక్టర్ బీవీ రమణారావు, పి.మారుతిరావు, ఆర్ఎంపీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరూ పుంజు.. వచ్చెనండి.. కాసులు తెచ్చెనండీ!

- రూ.2.85 లక్షలతో అమెరికా నుంచి పుంజు కొనుగోలు
- రెండేళ్లలో రూ.41.60 లక్షల ఆదాయాన్ని ఆర్జించిన గోదావరి యువకుడు

కోనసీమలో ఒక కొబ్బరి చెట్టునో, ఒక గేదెనో.. ఒక ఎకరం భూమినో నమ్ముకుని ఆదాయం పొందుతూ ఏదోలా బతికేద్దామని అనుకునే వాళ్లు చాలా మంది ఉంటారు. కానీ తాను అలా అనుకోలేదంటున్నారు పెన్మెత్స రామ సత్యనారాయణరాజు అలియాస్ ఈస్ట్ గోదావరి రామరాజు. నేడు భూములు, పశువులు, కొబ్బరి చెట్ల వల్ల ఆదాయం అంతగా లభించక కొంత మంది ఉన్నత చదువులతో ఉన్నత రంగాలకు వెళ్లిపోతున్నారు. కానీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం బట్టేలంక గ్రామానికి చెందిన ఈ యువకుడు కేవలం ఒక కోడిపుంజును నమ్ముకున్నాడు, తద్వారా దండిగా ఆదాయం సంపాదిస్తున్నాడు. - మలికిపురం



ఈస్ట్ గోదావరి రామరాజు (32) బీటెక్ పూర్తి చేశారు. తండ్రి వేంకటేశ్వరరాజు రెండేళ్ల క్రితం కరోనాతో మృతి చెందడంతో అప్పటి నుంచి కుటుంబం కోసం ఉద్యోగం ఆలోచన విరమించుకుని రామరాజు బట్టేలంకలోనే ఉంటున్నారు. ఈయనకు ఇదే మండలం ఇరుసుమండ గ్రామంలో 15 ఎకరాల కొబ్బరి తోట ఉంది. అదీ ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి పంచుకోగా వచ్చింది. దీని ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రమే. దీంతో కోనసీమలో పలువురు చేస్తోన్న మాదిరిగానే రామరాజు దేశవాళీ కోడిపుంజులు పెంచుతూ సంక్రాంతి సమయంలో అమ్ముతు ఉంటారు. ఇందులోనూ అంతంత మాత్రంగానే ఆదాయం వస్తుండటంతో ఆయన సరికొత్త ఆలోచన చేశారు.

పుంజుకూ వీసా..!

అమెరికాలో పరిచయమున్న వారి ద్వారా రామరాజు 'పెరూ' జాతి కోడిపుంజును అక్కడి ధర రూ.1.40 లక్షలకు 2020 జూన్‌లో కొనుగోలు చేశారు. పెరూ నుంచి దిగుమతి చేసుకున్న కోడి పుంజులకు ప్రత్యేకంగా వీసా ఖర్చులతో పాటు విమానంలో ప్రయాణానికి అదనంగా టికెట్‌ను కొనుగోలు చేసి ఆ కోడిపుంజును అమెరికా నుంచి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా తయారైన కారులో ఇరుసుమండలోని రామరాజు కొబ్బరి తోటలోకి పుంజు చేరింది. ఈ పుంజును అన్నీ కలుపుకొని ఇక్కడకు తీసుకురావడానికి రామరాజుకు రూ.2.85 లక్షలు ఖర్చయ్యింది. అప్పటి నుంచీ ఈ పెరూ జాతి కోడిపుంజును రాజభోగాలతో రామరాజు మేపుతున్నారు. మేలు రకాలయిన దేశవాళీ పెట్టల క్రాసింగ్ ద్వారా దీని సంతానం విపరీతంగా పెరిగింది. ఈ జాతి పుంజులు పందాల్లో విశేష ప్రతిభ చూపడంతో దీని బ్రీడ్‌కు డిమాండ్ పెరిగింది. రామరాజు కోడిపుంజులను పెంచడం లేదు. వీటి పిల్లలను 3 నెలల వయసు వచ్చే వరకు మాత్రమే పెంచి అనంతరం ఒక్కో పిల్లను రూ.10,000కు పైగా విక్రయిస్తున్నారు. ఇలా ఈ రెండేళ్లలో ఇప్పటివరకు రూ.41.60 లక్షల ఆదాయం వచ్చినట్లు రామరాజు చెప్పారు. దీనిలో నెలకు రూ.25 వేల చొప్పున ఖర్చవుతుందని, రూ.35.60 లక్షలు మిగిలిందని వెల్లడించారు.

దండిగా ఆదాయం

ప్రస్తుతం కొబ్బరి ఆదాయం తోటల నిర్వహణకే సరిపోతోంది. దీంతో ఇలా ప్రయోగం చేసి ఈ కోడిపుంజును దింపాను. రెండేళ్లలో రూ.41.60 లక్షల షేర్ వచ్చింది. నిర్వహణ ఖర్చు నెలకు రూ.25 వేలకు పైగా ఉంటుంది. ఏడాదికి రూ.10 లక్షలు పైగా మిగులుతుంది.

– పెన్మెత్స రామ సత్యనారాయణ రాజు, బట్టేలంక

హైకోర్టు కొత్త సీజేకు న్యాయవాదుల సన్మానం



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకీరామిరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌ను హైకోర్టు న్యాయవాదులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా సీజే జస్టిస్ ఠాకూర్ మాట్లాడుతూ.. కక్షిదారులకు న్యాయం అందించే విషయంలో న్యాయమూర్తులకు ఎంత పాత్ర ఉంటుందో న్యాయవాదులకూ అంతే పాత్ర ఉంటుందన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు వేర్వేరు కాదని.. ఇద్దరూ కలిసి పనిచేస్తేనే సకాలంలో కక్షిదారులకు న్యాయం అందుతుందన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి సీజే ఠాకూర్‌కు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్, అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ యర్రంరెడ్డి నాగిరెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) ఎన్.హరినాథ్ పాల్గొన్నారు.

విశాఖ పోర్టుకు అవార్డుల పంట

సాక్షి, విశాఖపట్నం: రాజభాష అమలులో జిల్లా స్థాయిలో అవార్డు అందుకున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) జాతీయ స్థాయిలోనూ సత్తా చాటింది. ఏకంగా నాలుగు అవార్డులను తన ఖాతాలో వేసుకుంది. ఢిల్లీలో జరిగిన రాజభాష షీల్డ్ స్కీమ్ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర పోర్టులు, జలరవాణా, ఆయుష్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ హాజరయ్యారు. కేంద్ర మంత్రి చేతుల మీదుగా పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, అధికారులు ఈ అవార్డులను అందుకున్నారు. 2018–19 వార్షిక సంవత్సరానికి రెండో బహుమతి, 2013–14, 2014–15, 2015–16 సంవత్సరాలకు గాను మూడో బహుమతిని పోర్టు అందుకుంది.

సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి



తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల షెడ్యూల్‌ను టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి ప్రకటించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మంతో కలిసి టీటీడీలోని అన్ని విభాగాల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన రోజుల్లో సెప్టెంబర్ 18న ధ్వజారోహణం ఉంటుందని, అదే రోజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం, ధ్వజవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. అదేవిధంగా నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 15న ప్రారంభమై 19న గరుడవాహనం, 22న స్వర్ణరథం, 23న చక్రస్నానంతో ముగుస్తాయని చెప్పారు. పెరటాసి మాసం, రెండు బ్రహ్మోత్సవాలు కలిసినందున, భారీ యాత్రికుల రద్దీని అంచనా వేస్తున్నామని చెప్పారు. పెరటాసి పవిత్ర మాసం సెప్టెంబర్ 18న ప్రారంభమై అక్టోబర్ 17న ముగుస్తుందన్నారు. సెప్టెంబర్ 23, 30, అక్టోబర్ 7, 14 తేదీల్లో పెరటాసి శనివారాలు జరుగుతాయని, ఈ రెండు బ్రహ్మోత్సవాలు, పెరటాసి శనివారాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని వివరించారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

పోలవరం ప్రాజెక్టులో తాగునీటి విభాగం ఖర్చూ భరిస్తాం

- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి
- వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ : పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విజ్ఞప్తులకు కేంద్రం అంగీకరించింది. ప్రాజెక్టులో కేవలం సాగు నీటి విభాగం పనులకే నిధులిస్తామని, తాగు నీటి విభాగం ఖర్చును భరించే ప్రసక్తే లేదంటూ ఇన్నాళ్లూ చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. సీఎం జగన్ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంది. తాగునీటి విభాగానికి ప్రతిపాదించిన వ్యయాన్ని కూడా తిరిగి చెల్లించడానికి సుముఖత వ్యక్తం చేసింది. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయి రెడ్డి పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం రూ.55,548 కోట్లు నిధులపై అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు ఈ విషయం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఇరిగేషన్ విభాగానికి సంబంధించి మిగిలిపోయిన పనులు పూర్తి చేయడానికి రూ.10,911.15 కోట్లు, వరదల కారణంగా ప్రాజెక్టులో దెబ్బతిన్న చోట్ల మరమ్మతులకు అదనంగా మరో రూ.2 వేల కోట్లు విడుదల చేయడానికి ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన వ్యయ విభాగం నిరభ్యంతరం తెలిపిందని పేర్కొన్నారు. అదేవిధంగా తాగు నీరు కాంపొనెంట్ ఖర్చును కూడా ఇవ్వడానికి అభ్యంతరం లేదని సమాచారం ఇచ్చినట్టు తెలిపారు.

వేధింపుల నిరోధక చట్టంలో బాధితులకూ శిక్షలా?

వేధింపుల నిరోధక చట్టంలో ఫిర్యాదుదారులను శిక్షించే పరిస్థితి కూడా ఉండడంతో బాధితులు ముందుకు రావడంలేదని, దీని పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టారని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో ప్రశ్నించారు. దీనికి కేంద్ర ఎంఎస్ఎంఈ సహాయ మంత్రి భాను ప్రతాప్ వర్మ స్పందిస్తూ.. లైంగిక వేధింపులపై బాధిత మహిళలు చేసే ఫిర్యాదులను అంతర్గత కమిటీ అన్ని కోణాల్లో క్షుణ్నంగా దర్యాప్తు చేసిన మీదటే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఏపీలో 47.17 టన్నుల బంగారు నిల్వలు



ఇండియన్ మినరల్స్ ఇయర్ బుక్ – 2021 ప్రకారం ఏపీలో 47.17 టన్నుల బంగారు నిల్వల సామర్థ్యం ఉన్నట్లు కేంద్ర గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. దీంట్లో 5.3 టన్నుల నిరూపిత, సంభావ్య నిల్వలు, 41.87 టన్నుల మిగిలిన వనరులు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఏపీలో వివిధ ప్రాంతాల్లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహించిన పరిశోధనల ప్రకారం రామగిరి, పెనకచర్ల బంగారు క్షేత్రాలు, జోనగిరి షిస్ట్ బెల్ట్, సౌత్ చిగర్‌గుంట – బిసనట్టం గోల్డ్‌బెల్ట్‌లో బంగారు నిల్వలు గుర్తించారు.

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం ప్రతిపాదన లేదు

సెయిల్‌లో విశాఖ ఉక్కు పరిశ్రమను విలీనం చేసే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే స్పష్టం చేశారు. కాగా ఆత్మనిర్భర భారత్‌లో భాగంగా పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్(పీఎస్‌యూ) విధానానికి అనుగుణంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్.(ఆర్ఐఎన్ఎల్) షేర్ హోల్డింగ్‌లో 100% పెట్టుబడుల ఉపసంహరణకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం పొందిందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు.

లోక్‌సభ

2021-22కి రూ.91,319 కోట్ల లాభాల్లో విశాఖ ఉక్కు

- విశాఖ ఉక్కులో పెట్టుబడుల ఉపసంహరణకు 2016లోనే సూత్రప్రాయ అనుమతి
- లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ : విశాఖ ఉక్కు పరిశ్రమ 2021–22 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.91,319 కోట్ల లాభాల్లో ఉందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కిషన్‌రావ్ కరాడ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2016లోనే విశాఖ ఉక్కులో పెట్టుబడుల ఉపసంహరణకు సూత్రప్రాయ అనుమతిచ్చినట్లు చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ 2012–13కి రూ.35,283 కోట్లు, 2013–14కి రూ.36,645 కోట్లు, 2014–15కి రూ.6,238 కోట్లు లాభాల్లో ఉందని తెలిపారు. 2015–16కి రూ1,42,064 కోట్లు నష్టాలు వచ్చాయన్నారు. 2016–17కి రూ.1,26,316 కోట్లు, 2017–18కి రూ.1,36,901 కోట్లు నష్టాలొచ్చాయని చెప్పారు. 2018–19కి రూ. 9,671 కోట్లు లాభాలు రాగా, 2019–20కి రూ.3,91,017 కోట్లు, 2020–21కి రూ. 78,910 కోట్లు నష్టాలొచ్చాయని తెలిపారు. 2021–22లో తిరిగి లాభాల్లోకి వచ్చిందని మంత్రి వివరించారు.

పైరసీకి అడ్డుకట్ట వేయాలి



చలన చిత్ర పరిశ్రమను వేధిస్తున్న పైరసీకి అడ్డుకట్ట వేయాలని కేంద్ర ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిళ్ల గురుమూర్తి విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో సినిమాటోగ్రఫీ సవరణ బిల్లుకు మద్దతిస్తూ ఆయన మాట్లాడారు. పైరసీ వెబ్‌సైట్ల నియంత్రణకు తగిన యంత్రాంగాన్ని రూపొందించి కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. బాలల చిత్రాలను ప్రోత్సహించాలన్నారు. తక్కువ బడ్జెట్‌తో రూపొందిన సందేశాత్మక చిత్రాలకు ఏపీ ప్రభుత్వం రూ.10 లక్షలు పన్ను రాయితీ రూపంలో ప్రోత్సహిస్తోందన్నారు.

మూలధన వ్యయం, పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం

మూలధన వ్యయం, పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం కోసం ఏర్పాటు చేసిన పథకంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,295.35 కోట్లు విడుదల చేశామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి బీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. 2023–24లో ఏపీకి ఎలాంటి నిధులు మంజూరు చేయలేదని చెప్పారు.

రొయ్య రైతులకు బాసట

రైతు సాధికారత సమావేశంలో కీలక నిర్ణయాలు

- ప్రతి 10 రోజులకు రొయ్యల ధరలపై నిర్ణయం

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో రొయ్య రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రొయ్యల ఎగుమతిదారుల సంఘం సంసిద్ధత వ్యక్తం చేసింది. వచ్చే వారం రోజుల్లో రొయ్యల సేకరణ ధరలను ప్రకటించింది. తొలిసారి ప్రతి ఐదు కౌంట్‌కు ఓ ధర చొప్పున చెల్లించేందుకు ఎగుమతిదారులు అంగీకరించారు. దీంతోపాటు ఆగస్టు 4వ తేదీ తర్వాత మరోసారి భేటీ అయి ప్రతి కౌంట్‌కు కనీసం రూ.10 తక్కువ కాకుండా పెంచుతామని భరోసా ఇచ్చారు. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ అధ్యక్షతన సోమవారం రొయ్యల రైతులు, రొయ్యల ఎగుమతిదారులతో కాకినాడలో నిర్వహించిన రైతు సాధికారత సమావేశంలో రైతులకు మేలు జరిగేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రఘురామ్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రొయ్య రైతులకు అండగా నిలిచేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులతో ప్రతి 10 రోజులకు ఒకసారి సమావేశమై అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల హెచ్చు తగ్గులను సమీక్షించి రైతులకు మెరుగైన ధర కల్పించేలా నిర్ణయం తీసుకుంటున్నట్టు చెప్పారు. సమావేశంలో జాతీయ రొయ్య రైతుల సంఘం అధ్యక్షుడు ఐపీఆర్ మోహన్‌రాజు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నిర్ణయాలివీ..

ప్రస్తుతం ప్రతి పది కౌంట్‌లకు నిర్ణయిస్తున్న ధరను.. ఇక నుంచి ప్రతి ఐదు కౌంట్‌లకు నిర్ణయించేలా కొత్త పీసీ విధానం అమలుకు నిర్ణయం. ప్రాసెసింగ్ చేసే వ్యక్తులు వ్యాపారులను ప్రోత్సహించే బదులు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసేలా చర్యలు. ఎగుమతిదారులు కూడా నేరుగా విక్రయించే రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం. కొనుగోలు ధరలపు కనీసం 10 రోజులకు ఒకసారి సమీక్షించి ఆ ధరలు అమలయ్యేలా చర్యలు. తూకం విషయంలో ప్రతి నెట్‌కు 200 గ్రాముల చొప్పున చెల్లించేందుకు నిర్ణయం.



మాట్లాడుతున్న అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం

ఆగస్టు 4వ తేదీ వరకు రైతుల నుంచి కొనుగోలు చేయనున్న ధరలు ఇలా

కిలోకు కౌంట్	కిలో ధర (రూపాయల్లో)	కిలోకు కౌంట్	కిలో ధర (రూపాయల్లో)
92-100	200	41	290
91	205	38-40	300
82-90	210	36-37	305
81	215	33-35	310
76-80	220	32	350
71-75	225	31	360
66-70	230	30	370
61-65	235	27-28	380
56-60	240	26	390
51-55	250	25	450
48-50	260	24	470
46-47	265	23	490
43-45	270	22	540
42	280	21	570
		20	600

అధిక వడ్డీ పేరుతో ఘరానా మోసం

- రూ.10 కోట్లకు పైగా సొమ్ముతో పరారీ
- రాజమహేంద్రవరం కేంద్రంగా సాట్కో క్యాపిటల్ కంపెనీ పేరుతో భారీగా డిపాజిట్లు వసూలు
- కొంతకాలం పాటు వడ్డీ ఇచ్చి.. ఆపై బోర్డు తిప్పేసిన వైనం
- పరారీలో కంపెనీ నిర్వాహకుడు మద్దుకూరి ప్రదీప్
- ఏపీ, తెలంగాణవ్యాప్తంగా 100 మందికి పైగా బాధితులు

సాక్షి, రాజమహేంద్రవరం: షేర్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నానని మాయమాటలు చెప్పాడు.. తన కంపెనీలో డబ్బులు డిపాజిట్ చేస్తే అధిక వడ్డీలు చెల్లిస్తానని నమ్మబలికాడు. రూ.10 లక్షలు డిపాజిట్ చేస్తే 10 గ్రాముల బంగారం, రూ.60 లక్షలు కడితే కారు ఇస్తానంటూ ఆఫర్లు పెట్టి మరీ వసూలు చేశాడు. చివరకు రూ.10 కోట్లకు పైగా సొమ్ము కొల్లగొట్టి బోర్డు తిప్పేసి పరారయ్యాడు. రాజమహేంద్రవరం కేంద్రంగా జరిగిన ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. తూర్పు గోదావరి జిల్లా జేగురుపాడుకు చెందిన మద్దుకూరి ప్రదీప్‌కుమార్ అలియాస్ బాలు ముంబై కేంద్రంగా నడుస్తున్న «సాట్కో క్యాపిటల్ మార్కెట్స్ ఎల్‌టీడీ» కంపెనీలో కొన్నాళ్లు ఉద్యోగం చేసినట్లు ఫేక్ పేస్లిప్‌లు సృష్టించాడు. ఆ కంపెనీ నుంచి వచ్చినట్లు స్థానికంగా అందరినీ నమ్మించాడు. 2018లో రాజమహేంద్రవరంలోని తిలక్‌రోడ్డులో అదే పేరుతో కంపెనీ ప్రారంభించాడు. షేర్స్‌లో పెట్టుబడి పెడుతున్నానని.. లాభాలు బాగా వస్తున్నాయని ప్రచారం చేశాడు. తన కంపెనీలో డిపాజిట్ చేస్తే ప్రతి నెలా రూ.100కు రూ.3 వడ్డీ చెల్లిస్తానని నమ్మబలికాడు. ఏపీ, తెలంగాణకు చెందిన ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యుల వద్ద రూ.5 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు డిపాజిట్లు సేకరించాడు. ప్రతి నెలా డిపాజిటర్ల బ్యాంకు ఖాతాల్లో వడ్డీ జమ చేసేవాడు. దీంతో డిపాజిటర్లు తమకు పరిచయమున్న వారిని కూడా ఇందులో చేర్పించారు. వారిని నమ్మించేందుకు ప్రదీప్ కొన్ని బాండ్లు, ప్రామిసరీ నోట్లు, చెక్కులిచ్చాడు. ఇలా 100 మందికి పైగా బాధితుల నుంచి నేరుగా రూ.7.50 కోట్లు, ఆన్‌లైన్‌లో మరో రూ.4 కోట్లకు పైగా డబ్బులు సేకరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ఈ ఏడాది మే నెల వరకు సజావుగా సాగింది. జూన్ నెలలో వడ్డీలివ్వకుండా చేతులెత్తేశాడు. దీనిపై డిపాజిటర్లు ప్రశ్నించగా.. ఆడిటింగ్ జరుగుతోందని నమ్మబలికాడు. చివరకు జూలై 15 తర్వాత కంపెనీ బోర్డు తీసేసి పరారయ్యాడు. దీంతో బాధితులంతా కలిసి ప్రకాశంనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నిందితుడు ప్రదీప్ కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి గాలిస్తున్నామన్నారు.

అప్పు తెచ్చి మరీ ఇచ్చా..

తెలిసిన వ్యక్తే కదా అని అప్పు తెచ్చి మరీ రూ.5 లక్షలు డిపాజిట్ చేశా. కొన్ని నెలల పాటు వడ్డీ ఇచ్చారు. మే నెల నుంచి మాత్రం ఇవ్వలేదు. దీనిపై ప్రశ్నిస్తే ఆడిటింగ్ జరుగుతోందని కాలయాపన చేశాడు. తీరా చూస్తే ఇప్పుడు బోర్డు తిప్పేశాడు. చేసిన అప్పు ఎలా తీర్చాలో అర్థం కావట్లేదు. నమ్మి నట్టేట మునిగిపోయా.

– బాధితుడు బొంతు మావుళ్ల స్వామి

డిస్కం సీఎండీ, ట్రాన్స్‌కో పూర్వ సీఎండీలకు ఊరట

జైలుశిక్ష, జరిమానా ఉత్తర్వుల అమలు నిలుపుదల

సాక్షి, అమరావతి:కోర్టు ధిక్కార కేసులో ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు, ట్రాన్స్‌కో పూర్వ సీఎండీ బి.శ్రీధర్‌లకు ఊరట లభించింది. వారికి నెల రోజుల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి వెలువరించిన ఉత్తర్వుల అమలును హైకోర్టు ధర్మాసనం నిలుపుదల చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తమకు కనీస వేతనాలు చెల్లించేలా అధికారులను ఆదేశించాలంటూ చిత్తూరు జిల్లా విద్యుత్ శాఖలో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మెన్లు, షిఫ్ట్ ఆపరేటర్లు, జూనియర్ ఇంజనీర్లు 2022లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి, పిటిషనర్లు సమర్పించిన వినతిపై తగిన ఉత్తర్వులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే, అధికారులు ఈ ఉత్తర్వులు అమలు చేయలేదంటూ పిటిషనర్లు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో సంతోష్‌రావు, శ్రీధర్ తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ ధిక్కార పిటిషన్‌పై సింగిల్ జడ్జి విచారణ జరిపారు. కోర్టు ఆదేశాలను అమలు చేయలేదంటూ సంతోష్‌రావు, శ్రీధర్‌లకు నెల రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ జూలై 21న తీర్పు వెలువరించారు. జైలుశిక్ష అనుభవించేందుకు రిజిస్ట్రార్ జ్యుడిషియల్ ముందు లొంగిపోవాలని వారిని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సంతోష్‌రావు, శ్రీధర్ అప్పీల్ దాఖలు చేశారు. సోమవారం ఈ అప్పీళ్లు తిరిగి విచారణకు రాగా.. సంతోష్‌రావు, శ్రీధర్ స్వయంగా ధర్మాసనం ముందు హాజరయ్యారు.

రాష్ట్రంలో ఐటీ కంపెనీల భారీ విస్తరణ

- గడిచిన నాలుగేళ్లల్లో ఐటీ రంగంలో కొత్తగా 29,500 ఉద్యోగాల కల్పన
- 2014–19 ఐదేళ్ల కాలంలో ఐటీ ఉద్యోగులు 24,350 ఉంటే ఇప్పుడు 53,850కు పెరుగుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త ఐటీ కంపెనీల రాకతోపాటు ఇప్పటికే కార్యకలాపాలు కొనసాగిస్తున్న సంస్థలు పెద్దఎత్తున ఇక్కడ విస్తరణ ప్రణాళికలను చేపడుతున్నాయి. గత రెండేళ్లలో ఇన్ఫోసిస్, అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్, బీఈఎల్, రాండ్‌స్టాండ్ వంటి దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలోకి అడుగుపెట్టగా రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇక్కడున్న సంస్థలు ఇతర నగరాలకు విస్తరణ కార్యక్రమాలు చేపట్టాయి. ఉదా....

- విశాఖపట్నంలో 1,650 మందితో ఉన్న టెక్ మహీంద్రా తన కార్యకలాపాలను విజయవాడకు విస్తరించింది. నాలుగు నెలల క్రితం విజయవాడలోని మేధా టవర్స్‌లో 84 మందితో ప్రారంభించిన టెక్ మహీంద్రా తన సీటింగ్ సామర్థ్యాన్ని ఇప్పుడు 350కు పెంచింది. రానున్న కాలంలో విశాఖపట్నం, విజయవాడ క్యాంపస్‌లను మరింతగా విస్తరించనున్నట్లు ఆ సంస్థ అధికారులు వెల్లడిస్తున్నారు.
- విప్రో కూడా తన విశాఖ క్యాంపస్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇక్కడ ప్రస్తుతమున్న సీటింగ్‌కు అదనంగా మరో 1,000 సీట్లను పెంచే ఆలోచనలో ఉన్నట్లు విప్రో అధికారులు తెలిపారు.
- ఇక విజయవాడలో కొనసాగుతున్న హెచ్‌సీఎల్ కూడా తన కార్యకలాపాలను తిరుపతికి విస్తరిస్తోంది.
- ఇప్పటికే హైదరాబాద్‌లో ఉన్న స్టేర్‌ఫ్రంట్ ఐటీ కంపెనీ విశాఖలో 100 సీట్లతో తన కార్యకలాపాలను ప్రారంభించే యోచనలో ఉన్నట్లు ఐటీ ప్రమోషన్స్ జనరల్ మేనేజర్ అరవింద్‌కుమార్‌తెలిపారు.



పెద్ద కంపెనీలు ఆసక్తి..

రాష్ట్రంలో తమ కార్యకలాపాలను ప్రారంభించడానికి దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయని ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ 'సాక్షి'కి వెల్లడించారు. విశాఖలో ఇన్ఫోసిస్ తన కార్యకలాపాలను ఆగస్టు రెండోవారం నుంచి మొదలుపెట్టనుందని.. దీనికి సంబంధించి కార్యాలయంలో ఏర్పాట్లు, ఉద్యోగుల నియామక ప్రక్రియ పూర్తయిందన్నారు. అంతర్జాతీయంగా పనిచేస్తున్న ఐటీ నిపుణుల్లో ఎక్కువమంది తెలుగువారు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు అధికంగా ఉండటంతో వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానం తర్వాత చిన్న పట్టణాల్లో శాటిలైట్ కార్యాలయాలను ఏర్పాటుచేస్తున్నాయని, దీనిని అందిపుచ్చుకుంటూ ప్రముఖ కంపెనీలను ఆకర్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. దిగ్గజ కంపెనీలకు వెళ్లి ఆయా కంపెనీల్లో రాష్ట్రానికి చెందిన ఎంతమంది ఆ కంపెనీలో పనిచేస్తున్నారో వివరిస్తూ ఇక్కడ శాటిలైట్ కార్యాలయాలను ఏర్పాటుచేయాల్సిందిగా కోరుతున్నామన్నారు. యాక్సెంచర్, సీడాక్, మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థలు రాష్ట్రంలో కార్యాలయాలను ఏర్పాటుచేయడానికి ఆసక్తి చూపిస్తున్నట్లు శశిధర్ వెల్లడించారు. తక్కువ వ్యయంతో నైపుణ్యం కలిగిన మానవ వనరులు లభిస్తున్నందున ఆయా కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నట్లు ఆయన తెలిపారు.

నాలుగేళ్లలో కొత్తగా 29వేల ఉద్యోగాలు..

నిజానికి.. గడిచిన నాలుగేళ్లుగా రాష్ట్రంలోని ఐటీ రంగంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు పెరిగాయి. 2014–19 కాలంలో 24,350 ఐటీ ఉద్యోగాల కల్పన జరిగితే రెండేళ్లు కోవిడ్ వంటి కష్టకాలం ఉన్నప్పటికీ ఈ నాలుగేళ్లల్లో కొత్తగా 29,500 ఉద్యోగాలు వచ్చినట్లు అరవింద్‌కుమార్ తెలిపారు. దీంతో రాష్ట్రంలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగుల సంఖ్య నాలుగేళ్లల్లో 24,350 నుంచి 53,850కు పెరిగిందన్నారు.

93.36 లక్షల వినతుల పరిష్కారం

- 'జగనన్న సురక్ష'లో రికార్డు స్థాయిలో అభ్యర్థనల క్లియర్
- జూలై 18న ఒక్కరోజే 7.54 లక్షల సమస్యలకు చెక్

సాక్షి, అమరావతి: 'జగనన్న సురక్ష' కార్యక్రమం రాష్ట్రంలో రికార్డు సృష్టిస్తోంది. అర్హత ఉండి కూడా ఎవరూ ప్రభుత్వ పథకాలు అందకుండా ఉండకూడదన్న మహోన్నత లక్ష్యంతో ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని జూలై 1న ప్రారంభించింది. పాఠశాలలు, కాలేజీల ప్రారంభం, అడ్మిషన్ల నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని సురక్ష శిబిరాల్లోనే పలు ధ్రువీకరణ పత్రాలను కూడా మంజూరు చేయిస్తోంది. పలు శాఖలు జారీ చేసే 11 రకాల ధ్రువీకరణ పత్రాలను యూజర్ చార్జీలు లేకుండా అక్కడికక్కడే ప్రజలకు అందజేస్తోంది.


- ఈ కార్యక్రమ ప్రారంభం నుంచే ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తొలిరోజు 1,305 సచివాలయాల పరిధిలో 4,73,930 వినతులు వస్తే వాటిల్లో ప్రభుత్వం అక్కడిక్కడే పరిష్కరించినవి 4,57,642 ఉన్నాయి. 31 నాటికి 15,004 సచివాలయాల పరిధిలో ఉన్న 1.42 కోట్ల కుటుంబాల నుంచి 95.96 లక్షల వినతులు వస్తే 93.36 లక్షల వినతులు అక్కడికక్కడే పరిష్కారమయ్యాయి. 18న ఒక్కరోజే 7.54 లక్షలకు పైగా వినతులను ప్రభుత్వం పరిష్కరించింది.
- మొత్తం 2.68 లక్షల మంది వలంటీర్లు జగనన్న సురక్ష శిబిరాల కోసం తమ క్లస్టర్లలోని 1.42 కోట్ల ఇళ్లలో సర్వే నిర్వహించారు. అత్యధికంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి 7,65,722 అభ్యర్థనలు రాగా అధికారులు 7,62,655 పరిష్కరించారు. అత్యల్పంగా పార్వతీపురం జిల్లా నుంచి 1,27,474 అభ్యర్థనలు రాగా 1,22,300 పరిష్కారమయ్యాయి.
- అధికారులు ఇప్పటిదాక 45,33,654 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 41,50,275 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 7,326 ఓబీసీ సర్టిఫికెట్లు, 2,366 మ్యారేజ్ సర్టిఫికెట్లు, 16,373 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, 1,40,114 అడంగల్ సర్టిఫికెట్లు, 2,70,194 వన్ బీ సర్టిఫికెట్లు జారీ చేశారు.
- ఆరోగ్యశ్రీ కార్డులు 6,511, కొత్త బియ్యం కార్డులు 15,081, బియ్యం కార్డులో మార్పులు చేర్పులకు సంబంధించిన సేవలు 89,102, ఆధార్ తో మొబైల్ అనుసంధానం చేసిన సేవలు 2,72,305 ఉన్నాయి. పట్టాదారు పాసు పుస్తకాల సేవలు 4,631 ఉన్నాయి.

62.77 లక్షల మందికి రూ.1,729.23 కోట్లు

నేటి తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీ

సాక్షి, అమరావతి: అవ్వాతాతలతో పాటు వితంతు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పలు రకాల చేతివృత్తిదారులకు ఒకటవ తేదీనే ఠంచన్‌గా పింఛన్ల పంపిణీకి వీలుగా ప్రభుత్వం ఒక్క రోజు ముందు సచివాలయాల వారీగా నిధులు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 62,77,105 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు గాను రూ.1,729.23 కోట్ల మొత్తాన్ని సోమవారమే ఆయా సచివాలయాల వారీగా బ్యాంకుల్లో జమ చేసింది. సోమవారం సాయంత్రానికే సచివాలయాల సిబ్బంది పింఛన్ల సొమ్ము బ్యాంకుల నుంచి డ్రా చేసి, వలంటీర్ల వారీగా పంపిణీ కూడ చేశారని సెర్ప్ అధికా రులు చెప్పారు. ఆగస్టు 1 తెల్లవారుజాము నుంచే వలంటీర్ల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. సాంకేతిక కారణాలతో ఏ ఒక్కరికీ పింఛను అందలేదనే ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు.

గుదిబండ.. 'అప్పు'డే!



▶ మొదటి పేజీ తరువాయి

వివేకంతో కూడిన రుణ నిర్వహణ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల్లో సుస్థిరత, పారదర్శకతను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఎఫ్ఆర్‌బీఎంను అసెంబ్లీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులకు లోబడే ఏపీ అప్పులు ఉన్నాయని వెల్లడించారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులను, ఆర్థిక పరిమితులను అమలు చేస్తున్నారా.. లేదా? అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన వ్యయ విభాగం పరిశీలన చేస్తూ ఉంటుందని వివరించారు.

కాకి లెక్కలతో పరిపాటిగా..

టీడీపీ దుష్ప్రచారానికి నిత్యం వంత పాడుతున్న ఎల్లో మీడియా అప్పులపై తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో మరోసారి తేటతెల్లమైంది. ఒకసారి రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశారని, మరోసారి రూ.పది లక్షల కోట్ల అప్పులంటూ కాకి లెక్కలతో కథలు అల్లటం ఎల్లో మీడియాకు రివాజుగా మారింది. ఈ విష ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నా రహస్యంగా అప్పులను దాచారనే విధంగా ఎల్లో మీడియా అవాస్తవాలను వండి వారుస్తోంది. పరిమితులకు లోబడే అప్పులు తీసుకుంటున్నామని, టీడీపీ హయాంతో పోలిస్తే పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందని రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలు స్పష్టం చేసింది. తీసుకున్న అప్పులను సామాజిక హితం కోణంలోనే ఖర్చు చేస్తోంది. భారీగా సంక్షేమ పథకాలు, నగదు బదిలీతో పేదలకు లబ్ధి చేకూరుస్తోంది. కోవిడ్ సమయంలోనూ డీబీటీతో పేదలను ఆదుకోవడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించకుండా చర్యలు తీసుకుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఇవన్నీ ముమ్మాటికీ నిజమని రుజువైంది. ఈ గణాంకాలను ఆర్బీఐ నివేదిక ప్రకారం వెల్లడిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా పాఠకులకు తప్పుడు సమాచారాన్ని చేరవేయకుండా విశ్వసనీయతతో జర్నలిజం విలువలను పాటించాలని ఆర్థిక రంగ నిపుణులు సూచిస్తున్నారు.

వైఎస్సార్ ఉచిత పంటల బీమా కోసం టెండర్లు

- 2023–24 సీజన్‌లో బీమా కవరేజ్ కోసం కసరత్తు
- ఖరీఫ్‌లో 21, రబీలో 16 పంటలను నోటిఫై చేసిన ప్రభుత్వం
- రబీ 2023–24 సీజన్‌లో అరటికీ బీమా సౌకర్యం



సాక్షి, అమరావతి: గడిచిన నాలుగేళ్ల మాదిరిగానే 2023–24 వ్యవసాయ సీజన్‌లోనూ నోటిఫైడ్ పంటలు సాగు చేసిన రైతులపై పైసా భారం పడకుండా యూనివర్సల్ కవరేజ్ కింద బీమా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిమూడేళ్లు రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా బీమా కవరేజ్ కల్పించగా, గతేడాది నుంచి పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానిస్తూ డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఖరీఫ్–2022లో దిగుబడి ఆధారిత పంటల కోసం రూ.1,213.37 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించగా, వాతావరణ ఆధారిత పంటలకు ఇన్సూరెన్స్ కంపెనీలతో సంబంధం లేకుండా రైతులకు పరిహారం చెల్లించింది. ఈ విధంగా దిగుబడి, వాతావరణ ఆధారిత పంటలకు రూ.1,117.21 కోట్ల పరిహారాన్ని ఇటీవలే జమ చేశారు. రబీ–2023 సీజన్‌లో నోటిఫైడ్ పంటలకు సాగైన విస్తీర్ణాన్ని బట్టి రైతుల వాటాతో పాటు ప్రభుత్వ వాటాను కలిపి నిర్దేశించిన ప్రీమియం చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాగా, 2023–24 సీజన్‌లో పీఎంఎఫ్‌బీవైతో కలిపి డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు కోసం పూర్తిస్థాయిలో కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం అర్హులైన ఇన్సూరెన్స్ కంపెనీలను గుర్తించేందుకు ఆన్‌లైన్ టెండర్లను పిలిచారు. పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానించి అమలు చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకున్న ఇన్సూరెన్స్ కంపెనీలకే ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుంది. 2023–24లో ఖరీఫ్‌లో 21 పంటలను, రబీలో 16 పంటలను నోటిఫై చేశారు. కాగా నోటిఫై చేసిన జిల్లాల్లో దిగుబడి ఆధారిత పంటల కింద వరితో పాటు సజ్జలు, మినుము, ఆముదం, పెసలు, వేరుశనగ, జొన్నలు, కొర్రలు, రాగులు, రాజ్మా, మొక్కజొన్న, నువ్వులు, మిరప, ఉల్లి, పసుపు, పొద్దుతిరుగుడు, శనగ పంటలకు, వాతావరణ ఆధారిత పంటల కింద పత్తి, వేరుశనగ, దానిమ్మ, బత్తాయి, టమాటా, నిమ్మ, జీడిమామిడితో పాటు అరటి పంటకూ బీమా కవరేజ్ కల్పిస్తున్నారు. వాతావరణ ఆధారిత పంటలకు సంబంధించి 23 జిల్లాల్లో కవరేజ్ కల్పిస్తుండగా, ఆరు క్లస్టర్స్‌గా, దిగుబడి ఆధారిత పంటలకు సంబంధించి 26 జిల్లాలను తొమ్మిది క్లస్టర్స్‌గా విభజించి బీమా కవరేజ్ కల్పిస్తున్నారు. దిగుబడి ఆధారిత పంటల కోసం పిలిచిన టెండర్లను 9వ తేదీన, వాతావరణ ఆధారిత పంటల కోసం పిలిచిన టెండర్లను 10వ తేదీన తెరవనున్నారు. టెండర్లలో అర్హత పొందిన వారితో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుని పంటల బీమా అమలుకు చర్యలు తీసుకుంటుంది. ఆయా సీజన్లలో సాగయ్యే నోటిఫైడ్ పంటలకు గానూ నిర్దేశించిన ప్రీమియం మొత్తాన్ని రైతుల వాటాతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఆయా కంపెనీలకు చెల్లించనుంది.

అతిపెద్ద ఇనార్బిట్ మాల్

విశాఖలో రూ.600 కోట్లతో నిర్మిస్తున్న రహేజా గ్రూప్

- 17 ఎకరాల్లో మూడు దశల్లో అభివృద్ధి
- 250కిపైగా అంతర్జాతీయ బ్రాండ్లకు వేదిక

- 8,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి
- రెండో దశలో 3,000 మంది పనిచేసేలా ఐటీ క్యాంపస్
- మూడోదశలో 200 గదులతో స్టార్ హోటల్ నిర్మాణం
- నేడు సీఎం జగన్ చేతుల మీదుగా మాల్‌కు శంకుస్థాపన
- జీవీఎంసీ చేపట్టిన అభివృద్ధి పనులకు భూమి పూజ
- ఏయూలో స్టార్టప్ టెక్నాలజీ ఇంక్యుబేషన్‌తో సహా పలు నూతన భవనాలకు సీఎం ప్రారంభోత్సవం

సాక్షి, అమరావతి: దేశంలోనే అతిపెద్ద ఇనార్బిట్ మాల్‌కు విశాఖ వేదిక కానుంది. 17 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో మూడు దశల్లో కె.రహేజా గ్రూపు అభివృద్ధి చేయనున్న ఇనార్బిట్ మాల్ తొలి దశ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం భూమి పూజ నిర్వహించనున్నారు. సుమారు రూ.600 కోట్ల వ్యయంతో 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇనార్బిట్ మాల్ నిర్మాణం కానుంది. దీనికి అదనంగా పార్కింగ్ కోసం ఏకంగా నాలుగు లక్షల చదరపు అడుగులను అభివృద్ధి చేయనున్నారు. 2026 నాటికి దీన్ని అందుబాటులోకి తేవాలని రహేజా గ్రూపు నిర్దేశించుకుంది. 250కిపైగా అంతర్జాతీయ బ్రాండ్లకు వేదికగా మారనున్న ఈ మాల్ ద్వారా 8,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. మాల్ నిర్మాణం కోసం పోర్టు అథారిటీకి చెందిన 17 ఎకరాలను 30 ఏళ్ల పాటు లీజుకు తీసుకున్నారు. రెండో దశలో ఐటీ క్యాంపస్‌ను అభివృద్ధి చేస్తారు. 3,000 మంది పనిచేసే విధంగా సుమారు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ క్యాంపస్‌ను 2027 నాటికి అందుబాటులోకి తెస్తారు. మూడో దశలో ఫోర్ స్టార్ లేదా ఫైవ్ స్టార్ హోటల్‌ను 200 గదులు, బాంకెట్ హాళ్లతో నిర్మిస్తారు. పూర్తి పర్యావరణహితంగా భవనాన్ని నిర్మించనున్నట్లు రహేజా గ్రూపు వెల్లడించింది.

నేడు ఏయూలో పలు ప్రారంభోత్సవాలు

విశాఖ పర్యటన సందర్భంగా మొత్తం రూ.864.88 కోట్ల విలువైన ప్రాజెక్టులకు సీఎం జగన్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. రూ.135.88 కోట్లతో జీవీఎంసీ చేపడుతున్న ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్‌లో పలు నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టులను సీఎం జగన్ ప్రారంభించనున్నారు. ఏయూ క్యాంపస్‌లో సుమారు రూ.21 కోట్లతో స్టార్టప్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ హబ్ (ఏ హబ్)ను అభివృద్ధి చేశారు. 2025 నాటికి 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో దేశంలోనే అతిపెద్ద ఇన్నొవేషన్ హబ్‌గా దీన్ని తీర్చిదిద్దనున్నారు. విభిన్న రంగాలకు చెందిన ఇంక్యుబేషన్ సెంటర్‌తోపాటు ఎనెక్స్ సెంటర్స్, ప్రోటోటైపింగ్/మేకర్స్ ల్యాబ్, స్టూడెంట్ ఐడియేషన్ సెంటర్లను అభివృద్ధి చేయనున్నారు. రూ.44 కోట్లతో ఫార్మా కంపెనీల కోసం 55,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పిన ఫార్మా ఇంక్యుబేషన్, బయోలాజికల్ మానిటరింగ్ హబ్‌ను సీఎం ప్రారంభిస్తారు. డిజిటల్ క్లాసులు, డిజిటల్ పరీక్షల కోసం రూ.35 కోట్లతో అల్గోరిథమ్ పేరుతో ఏయూ డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్స్ కాంప్లెక్స్‌ను నూతనంగా నిర్మించారు. అంతర్జాతీయ అనలిటిక్స్‌లో మాస్టర్ పోగ్రాములు నిర్వహించేలా ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ సెంటర్‌ను రూ.18 కోట్లతో 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. మెరైన్ ఫార్మింగ్, ప్రాసెసింగ్ ప్యాకేజింగ్‌లో నైపుణ్య శిక్షణ కోసం అవంతి ఫుడ్స్‌తో కలిపి రూ.11 కోట్లతో ఏయూ అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ హబ్‌ను నెలకొల్పారు. వీటిని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించి విద్యార్థులతో సంభాషిస్తారు. నూతన భవనాల ద్వారా 2025 నాటికి ఆంధ్రా యూనివర్సిటీ దేశంలో విభిన్న రంగాలకు అతిపెద్ద ఇంక్యుబేటర్ హబ్‌గా తయారు అవుతుందని అంచనా వేస్తున్నారు. కనీసం 350కుపైగా స్టార్టప్స్ తోపాటు 150కు పైగా పేటెంట్లు, ట్రేడ్ మార్క్స్‌ను నమోదు చేస్తుందని అంచనా. ఈ హబ్స్ ద్వారా కనీసం 2,000 మందికి ప్రత్యక్షంగా, 5,000 మందికి పరోక్షంగా ఉపాధి లభించడమే కాకుండా ఎగుమతులు దిగుమతుల ద్వారా ఆర్థిక వ్యవస్థకు రూ.480 కోట్ల వరకు సమకూరనుంది.

భారీ మానవహారంతో స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం 10.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని రోడ్డుమార్గంలో సాలిగ్రామపురం వెళతారు. అక్కడ రూ.600 కోట్ల వ్యయంతో రహేజా గ్రూప్స్ ఇనార్బిట్ మాల్‌కు భూమి పూజ చేస్తారు. అనంతరం నగరంలో జీవీఎంసీ చేపడుతున్న మౌలిక సదుపాయాలు, రహదారులు, ముఖ్య కూడళ్ల అభివృద్ధి, స్మార్ట్ రోడ్డు, యూరోపియన్ తరహా ఈట్ స్ట్రీట్స్, అమృత్ 2.0లో భాగంగా చెరువుల అభివృద్ధి లాంటి రూ.135.88 కోట్ల విలువైన 50 పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ చేరుకొని విద్యార్థులకు కొత్త కోర్సులు, ఉపాధి అవకాశాలు, స్టార్టప్‌లకు చేయూతనందించేలా రూ.129 కోట్లతో నిర్మించిన ఐదు భవనాలను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు బీచ్ రోడ్డు నుంచి బయలుదేరి 1.40కి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖ నుంచి తిరుగు పయనమవుతారు. విశాఖ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఇనార్బిట్‌మాల్‌ను నిర్మించే సాలిగ్రామపురం వరకు దాదాపు 9 కిలోమీటర్ల పొడవునా రహదారికి ఇరువైపులా మానవహారంగా ఏర్పడి సీఎం జగన్‌కు స్వాగతం పలకనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజు పర్యవేక్షిస్తున్నారు.

నారీ శక్తికి 'చేయూత'


సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

పూర్తిస్థాయిలో మేలు జరుగుతుందన్నారు. అవసరమైన వారికి అదనంగా బ్యాంకు రుణాలు ఇప్పించి స్వయం ఉపాధిని పెంపొందించే మార్గాలపై అధికారులు దృష్టిపెట్టాలన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న మహిళలకు జగనన్న తోడు పథకం ప్రయోజనాలను కూడా వర్తింప చేయాలని సూచించారు. పొదుపు సంఘాల మహిళలు ఉమ్మడిగా నెలకొల్పిన మహిళా మార్టులు సమర్థంగా పని చేస్తున్నాయని, ఇప్పటివరకు 36 మహిళా మార్టుల ద్వారా రూ.32.44 కోట్ల మేర వ్యాపారం జరిగినట్లు అధికారులు సీఎం జగన్ దృష్టికి తెచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో మహిళా మార్టులో సగటున రోజుకు రూ. 20.62 లక్షల వ్యాపారం జరిగిందని వివరించారు.

పట్టణాల్లోనూ డిజిటల్ లైబ్రరీలు

గ్రామీణ ప్రాంతాల తరహాలోనే పట్టణాల్లోనూ వైఎస్సార్ డిజిటల్ లైబరీల నిర్మాణానికి స్థలాలను తొలుత గుర్తించాలని సీఎం జగన్ ఆదేశించారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, డిజిటల్ లైబ్రరీ భవన నిర్మాణాల తీరును పరిశీలించిన అనంతరం సీఎం జగన్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సచివాలయాల భవనాల నిర్మాణం దాదాపుగా కొలిక్కి వచ్చిందని, సెప్టెంబరు నాటికే అన్నింటినీ పూర్తి చేసేలా కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిర్దేశిత గడువులోగా అన్ని భవనాల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఈ ఏడాది ఏప్రిల్ - జూలై మధ్య ఉపాధి హామీ ద్వారా 18.90 కోట్ల పనిదినాలు కల్పించిన నేపథ్యంలో ఈ ఆర్థిక ఏడాదిలో కనీసం 24 కోట్ల పనిదినాల తగ్గకుండా ఉపాధి కల్పన లక్ష్యంగా కృషి చేయాలని ఆదేశించారు. జాతీయ స్థాయిలో మన రాష్ట్రం ఉత్తమ పనితీరు కనపరిచిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులు ప్రస్తావించారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు

జగనన్న కాలనీలలో కనీస మౌలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఆహ్లాదంగా, పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నందున మౌలిక సదుపాయాల విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని అధికారులకు స్పష్టం చేశారు. కాలనీల్లో అపరిశుభ్రతకు తావు లేకుండా పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

గ్రామ కంఠం ఇళ్లకు హక్కు పత్రాలు

వ్యవసాయ భూములకు సంబంధించి యజమానులకు పాస్ పుస్తకాల మాదిరిగా గ్రామ కంఠాల పరిధిలోని ఇళ్ల యజమానులకు కూడా భూ హక్కు పత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. గ్రామ కంఠం పరిధిలో రూ.లక్షల విలువ చేసే ఇళ్లు, ఇంటి స్థలాలున్నా అధికారిక పత్రాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా వారికి భూహక్కు పత్రాల జారీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. 10,943 గ్రామాల్లో ఇప్పటికే డ్రోన్లతో సర్వే పూర్తైనట్లు అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో భూహక్కు పత్రాలను ఇస్తున్నట్లు చెప్పారు. వందేళ్ల తరువాత తొలిసారిగా మనం చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం అత్యంత విశిష్టమైనదని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో ప్రత్యేకంగా ఒక సర్వేయర్‌ను నియమించడం వల్ల ఈ ప్రాజెక్టు సజావుగా ముందుకు సాగుతోందన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయాల్లోనే భూ రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించిన ఘనత కేవలం మన రాష్ట్రానికే దక్కుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఇతర శాఖాధికారులు సీఎం సమీక్షలో పాల్గొన్నారు.

10న 'వైఎస్సార్ సున్నా వడ్డీ'..

పొదుపు సంఘాల మహిళలకు వారి బ్యాంకు రుణాలకు సంబంధించి వైఎస్సార్ సున్నా వడ్డీని ఆగస్టు 10న మరో విడత అందజేస్తామని సీఎం జగన్ ప్రకటించారు. జూలై 26వ తేదీన జరగాల్సిన ఈ కార్యక్రమం ఎడతెరిపి లేని వర్షాల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తంలో రూ.19,178.17 కోట్లను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నేరుగా వారి ఖాతాలకు గత మూడేళ్లలో ప్రభుత్వం జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం జగన్ ప్రస్తావించారు. సకాలంలో రుణాలు చెల్లించే మహిళలకు ఇప్పటి వరకు వైఎస్సార్ సున్నావడ్డీ కింద రూ.4,969.05 కోట్లు చెల్లించామన్నారు. బ్యాంకర్ల సమావేశంలో పలుమార్లు ఒత్తిడి తెచ్చి పొదుపు సంఘాల మహిళలకు రుణాలపై 9 శాతం వడ్డీ వర్తింపజేసేలా చర్యలు చేపట్టామన్నారు. స్త్రీ నిధి ద్వారా ఇచ్చే రుణాలపై వడ్డీని 9 శాతానికి పరిమితం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. మహిళల తరపున అధికారులే గట్టిగా మాట్లాడి వారికి తగిన ప్రయోజనం చేకూర్చాలని సూచించారు.

వీఆర్‌ఏలకు వెన్నుపోటు పొడిచింది బాబే

వారికి డీఏ వర్తించదని 2018లో టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది

సాక్షి, అమరావతి : నిజాలకు పాతరేసి అబద్ధాలను అచ్చేయడంలో అందెవేసిన చెయ్యి అయిన రామోజీ తాజాగా వీఆర్‌ఏల డీఏపై పడ్డారు. టీడీపీ పాలనలో చేసిన నిర్వాకాలను మరిచిపోయినట్లుగా నటిస్తున్నారు. వీఆర్‌ఏల డీఏను తొలగించి వారిని నిండా ముంచింది చంద్రబాబు అనే విషయం అందరికీ తెలిసిన విషయమైనా రామోజీ అదేమీ తెలీనట్లు ఉంటూ సొల్లు పురాణం అందుకున్నారు. నిజానికి.. చంద్రబాబు అధికారంలో ఉండగానే 2018లో వీఆర్‌ఏలకు డీఏ వర్తించదని జీఓ ఇచ్చారు. ఆ అన్యాయాన్ని సరిదిద్దేందుకు ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోంది. త్వరలోనే దీనిపై ఒక సానుకూల నిర్ణయం వెలువడే అవకాశం కూడా ఉంది. కానీ, ఈ నిజాలకు ముసుగేసి వీఆర్‌ఏలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు చెప్పినట్టల్లా ఆడుతున్న ఈనాడు.. బరితెగించి మరీ అడ్డగోలు కథనం రాయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

ఇదీ నిజం..

వీఆర్‌ఏలకు నెలకు రూ.300 చొప్పున ఇచ్చే కరువు భత్యాన్ని (డీఏ)ను కేవలం 5 నెలలకు మాత్రమే పరిమితం చేస్తూ 2019 జనవరి 29న టీడీపీ ప్రభుత్వం జీఓ–14 జారీచేసింది. 2018 జూన్ 1 నుంచి వీఆర్‌ఏలకు డీఏ వర్తించదని ప్రకటించింది. ఈ అన్యాయాన్ని సరిదిద్దాలని రెవెన్యూ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని పలు సందర్భాల్లో కోరాయి. టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన జీఓను మార్చి కరువు భత్యాన్ని పునరుద్ధరించాలని కోరుతుండగా ఉద్యోగ సంఘాల సమస్యలను పరిశీలించి, పరిష్కరించడం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరచూ నిర్వహించే సమావేశాల్లోనూ దీనిపై చర్చ జరిగింది. ఈ విషయాలను మరచిపోయి ఉద్యోగుల్లో భయాందోళనలు కలిగించే ఉద్దేశంతో అబద్ధాలను అచ్చోసింది. రాష్ట్రంలో ప్రస్తుతం 19,359 మంది వీఆర్‌ఏలు సేవలు అందిస్తున్నారు. సాధారణ ప్రక్రియలో భాగంగా వారిలో ఎంతమంది ఏవిధంగా డీఏ డ్రా చేశారని తెలుసుకునేందుకే ఖజానా, అకౌంట్స్ శాఖ మెమో ఇచ్చింది. రాష్ట్రంలో ఒక్క వీఆర్‌ఏ నుంచి కూడా అదనంగా డ్రా చేసిన డీఏను రికవరీ చేయలేదు. ఈ విషయం తెలిసి కూడా ఈనాడు నిస్సిగ్గుగా వీఆర్‌ఏల నుంచి డీఏలను రికవరీ చేస్తున్నట్లు అబద్ధాలు రాసిపారేసింది. కానీ, డీఏలు రికవరీ లేకుండా చేయడంతోపాటు ప్రతినెలా డీఏను కొనసాగించేలా రెవెన్యూ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. వీటిపై అతి త్వరలో నిర్ణయం వెలువడే అవకాశముంది.

వీఆర్‌ఏలకు మేలు జరిగింది ఈ ప్రభుత్వంలోనే..

ఇక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీఆర్‌ఏలకు మేలు చేసే అనేక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సుమారు 3,795 మంది వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా పదోన్నతి కల్పించింది. ఈ సంవత్సరమే 66 మంది వీఆర్‌ఏలకు గ్రేడ్–2 వీఆర్‌ఓలుగా పదోన్నతులిచ్చింది. ఇవన్నీ మర్చిపోయి.. అవాస్తవాలు ప్రచారం చేయడం ద్వారా ఉద్యోగులు, ప్రజల్లో అపోహలు సృష్టించేందుకే ఈనాడు కంకణం కట్టుకుని వార్తలు ప్రచురిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

'సేవ అనేది మన ఇంటి నుంచే మొదలు కావాలి' అని బలంగా నమ్మే సీమా సింగ్ విద్య నుంచి వైద్యం వరకు ఎన్నో రంగాలలో ఎన్నోరకాల సేవాకార్యక్రమాలు చేస్తోంది. సీమ స్ఫూర్తితో ఆమె ఇద్దరు పిల్లలు కూడా సేవా పథంలో పయనిస్తున్నారు. 'సర్వైకల్ క్యాన్సర్ ఫ్రీ ఇండియా' ప్రచారాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లిన 'మేఘా శ్రేయ్' స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు సీమాసింగ్ తాజాగా 'చాంపియన్ ఆఫ్ చేంజ్' పురస్కారాన్ని స్వీకరించింది...



ఓ పండు కన్నతల్లిని కాపాడింది... కన్న బిడ్డను రక్షించింది.
ఒక బిడ్డగా ఒక తల్లిగా ఎదురైన అనుభవాలు...
ఆమె జీవితాన్ని కొత్త మలుపు తిప్పాయి.
కంప్యూటర్స్ నుంచి పంటపొలానికి దారి మళ్లించాయి.
పంట పొలం నుంచి పరిశ్రమ దిశగా నడిపించాయి.

● చికోటి కీర్తి

ఒక కష్టం

దశ... దిశను మార్చింది!!

'ఎన్ఆర్ఐలు ఇండియాలో వెయ్యి రూపాయలు చాలా సులువుగా ఖర్చు చేయగలుగుతారు. తిరిగి తాము పనిచేసే దేశాల్లో అంత డబ్బును సులువుగా సంపాదించుకోవచ్చనే ధీమా అది. అదే ఎన్ఆర్ఐలు ఇండియాలో వెయ్యి రూపాయలు సంపాదించడం చాలా కష్టం' అన్నారు చికోటి కీర్తి. జీవితం నేర్పించిన పాఠాలనుంచి ఆమె తెలుసుకున్న జ్ఞానం అది. 'నా జీవితమే నన్ను నడిపించింది. హైదరాబాద్‌లో కంప్యూటర్ సెంటర్ నిర్వహించి, పెళ్లితో నైజీరియా వెళ్లాను. ముగ్గురు పిల్లల తల్లిగా ఇండియాకి వచ్చి నా సవాళ్లకు జవాబుల కోసం అన్వేషణ మొదలు పెట్టాను. సంజీవనిలాంటి పరిష్కారం దొరికింది. తొగరు పండు నన్ను పారిశ్రామికవేత్తగా మార్చింది' అని క్లుప్తంగా వివరించారు కీర్తి. విజయవంతమైన కీర్తి ప్రయోగాల జీవితం ఇలా సాగింది.

బాబు తక్కువ బరువుతో పుట్టాడు

''నేను పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లోనే. బీఎస్సీ కంప్యూటర్స్ చేసి లిబర్టీ సెంటర్‌లో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించాను. నాన్న నైజీరియాలో మెకానికల్ ఇంజనీర్, అమ్మ మా కోసం గాంధీ హాస్పిటల్‌లో గవర్నమెంట్ ఉద్యోగం మానేసింది. మూడు నెలలకోసారి ఎవరో ఒకరు ఇండియా– నైజీరియాల మధ్య ప్రయాణించే వాళ్లం. పెళ్లి కూడా అక్కడ ఉద్యోగం చేస్తున్న ఇక్కడి అబ్బాయితో కుదరడం యాదృచ్ఛికమే. నా పిల్లలు ఇండియాలోనే పుట్టాలనే ఆకాంక్ష కొద్దీ మూడు డెలివరీలకూ ఇండియాలోనే ప్లాన్ చేసుకున్నాను. రెండవసారి గర్భిణిగా ఉన్న సమయంలో సరిగ్గా ఏడవ నెలలో అమ్మ ఆరోగ్యం మా కుటుంబాన్ని కుదిపేసింది. అక్కడ (నైజీరియా) మలేరియా సర్వసాధారణం. అమ్మకు మలేరియా మెదడుకు సోకడంతో ఆమె కోమాలోకి వెళ్లిపోయింది. అక్కడ అన్నిరకాల వైద్యం అందించిన తర్వాత ఇండియాకి తీసుకువచ్చి డాక్టర్ సూచనతో నోని ఫ్రూట్ (తొగరు పండు) జ్యూస్ పట్టించాం. ఆమె రికవరీ స్పీడ్ మాకే ఆశ్చర్యం కలిగింది. నా డెలివరీ టైముకు పూర్తిగా కోలుకుని అంతా తనే చూసుకుంది. నాకది మిరకిల్. అయితే ఆ మిరకిల్ నా తదుపరి జీవితానికి ఒక సంకేతమని ఆ తర్వాత తెలిసింది. నాకు బాబు డౌన్ సిండ్రోమ్‌తో పుట్టాడు. బరువు ఒకటిన్నర కిలోలు. మేము ఏ మాత్రం ఊహించని పరిణామం అది. నాలుగు నెలలు నిండినా బరువు గ్రాము కూడా పెరగలేదు. డాక్టర్‌లు ఏ భరోసా ఇవ్వలేకపోయారు.

అప్పుడు అమ్మ తనను కాపాడిన నోని జ్యూస్ బాబు ఆరోగ్యాన్ని కూడా బాగు చేస్తుందేమో చూద్దామన్నది. దేవుడి మీద భారం వేసి పట్టించాం. నెల రోజుల్లో ఏడు వందల గ్రాములు పెరిగాడు. అప్పటి నుంచి నోని మీద రీసెర్చ్ మొదలు పెట్టాను.

కంపెనీ మాట మార్చింది

మార్కెట్‌లో ఉన్న నోని ఫ్రూట్ జ్యూస్ కంపెనీలను సంప్రదించాను. ఇదీ అదీ అనే తేడా లేకుండా అందుబాటులో ఉన్న సమాచారాన్నంతటినీ సేకరించి అధ్యయనం చేయడం మొదలుపెట్టాను. అదే సమయంలో అమ్మ ఆరోగ్య దృష్ట్యా నాన్న బయటి దేశాల్లో ఉండడానికి ఇష్టపడక ఉద్యోగం మానేసి ఇండియాకి వచ్చేశారు. ఆయన తనకంటూ వ్యాపకం కోసం వ్యవసాయం చేయాలనుకున్నారు. అలా పదెకరాల పొలం కొని తొగరు చెట్లను పెంచాం. ఓ కంపెనీ ఇచ్చిన భరోసాతో పంటను యాభై ఎకరాలకు విస్తరించాం. అయితే పంట పెద్ద మొత్తంలో వచ్చే సమయానికి కంపెనీ మాకిచ్చే ధర తగ్గించింది. ఖర్చులు కూడా రానంత తక్కువ ధరకు అమ్మడంకంటే ఈ పండ్లతో మనమే పరిశ్రమ స్థాపిద్దామనే ఆలోచన వచ్చింది. అప్పటి వరకు మా కుటుంబ అవసరాలకు తగినట్లు తయారు చేస్తున్న జ్యూస్, లోషన్, షాంపూ, హెయిర్ ఆయిల్ వంటి మొత్తం పాతిక రకాల ఉత్పత్తులను పెద్ద మొత్తంలో తయారు చేసి 'చెక్ బయో ఆర్గానిక్స్' పేరుతో మార్కెట్‌లోకి వచ్చాం. మా పొలంలో పండించి తయారు చేయడం వల్ల క్వాలిటీ విషయంలో మోసపోవడం, రాజీ పడడం రెండూ ఉండవు.

మా అమ్మను, నా బిడ్డను కాపాడిన ఈ పండులోని ఔషధగుణాలను ప్రపంచానికి తెలియ చేయాలనే సంకల్పంతో సంజీవని వంటి ఈ పండును ఎన్ని రకాలుగా అందించవచ్చనే పరిశోధనలు చేస్తున్నాను. ప్రభుత్వ అనుమతుల ప్రకారం సర్టిఫికేట్‌లతోపాటు నాచురల్ హెల్త్ సైన్స్ అసోసియేషన్ అవార్డు, ఉమెన్ ఆఫ్ ఇండియా ఆర్గానిక్ ఫెస్టివల్ పురస్కారం అందుకున్నాను'' అని తాను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారిన వైనాన్ని వివరించారామె. 'పరిశ్రమ స్థాపించిన ప్రతి మహిళ వెనుక ఒక కథ ఉంటుంది. అందుకు నేనే ప్రత్యక్ష ఉదాహరణ' అన్నారు కీర్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : నోముల రాజేశ్ రెడ్డి

సంజీవని పండుతో పరిశోధన

తొగరు చెట్లు చలిని తట్టుకోలేవు. పాశ్చాత్య దేశాల్లో ఈ పండు మీద పరిశోధనలు జరుగుతున్నాయి. కానీ ఈ పంట అక్కడ పండదు. కాబట్టి ఎన్నో ఔషధ గుణాలున్న సంజీవని వంటి ఈ పండుకు ప్రచారం కూడా పెద్దగా లభించలేదు. ఈ పండు నేరుగా మన దేహంలోని కణాల మీద పనిచేస్తుంది. అనేక రోగాలను నయం చేస్తుంది. కణాల శక్తిని పెంచి, దేహాన్ని వ్యర్థరహితం, విషరహితం చేస్తుంది. క్యాన్సర్ పేషెంట్‌లకు కూడా మంచి గుణాన్నిస్తుంది.



అనారోగ్యాలు వచ్చిన తర్వాత స్వస్థత కోసం వాడడమే కాదు. మామూలు వాళ్లు కూడా రోజుకు 30 మిల్లీలీటర్ల రసం తాగితే సమగ్రమైన ఆరోగ్యం చేకూరుతుంది. రసాయన రహితంగా తయారు చేస్తున్నాం. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికేట్ వచ్చింది. ఆయుష్ అనుమతి కోసం అప్లయ్ చేశాను.

\- చికోటి కీర్తి
ఫౌండర్, చెక్ బయో ఆర్గానిక్స్

సేవాపథం



సీమాసింగ్ చాంపియన్ ఆఫ్ చేంజ్

'సేవలో ఉండే గొప్పతనం ఏమిటంటే అది మన శక్తిని మనకు పరిచయం చేస్తుంది. నువ్వు ఇంకా చేయగలవు అని ముందుకు నడిపిస్తుంది' అంటుంది ముంబైకి చెందిన సీమా సింగ్.

కష్టాల్లో ఉన్న డ్రైవర్ కుమారుడి చదువుకు సహాయం చేయడం ద్వారా ఆమె సేవాప్రస్థానం మొదలైంది. అది తనకు ఎంతో తృప్తిని, సంతోషాన్ని ఇచ్చిన సందర్భం. సీమ ఆర్థిక సహాయం చేసిన పిల్లాడు సీఏ విజయవంతంగా పూర్తి చేశాడు.

గృహిణిగా ఉన్న సీమ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ కావడానికి ఈ సందర్భమే పునాది. తన కలలను సాకారం చేసుకోవడానికి 'మేఘా శ్రేయ్' అనే స్వచ్ఛంద సంస్థకు శ్రీకారం చుట్టింది. ఈ సంస్థ ద్వారా పిల్లల చదువు, స్త్రీ సాధికారత నుంచి అన్నదానం వరకు ఎన్నో సేవాకార్యక్రమాలు చేయడం మొదలు పెట్టింది.

కోవిడ్ సమయంలో ముంబైవాసుల కోసం వాక్సినేషన్ డ్రైవ్‌ను నిర్వహించింది. పేదల అవసరాలను తీర్చింది.

''లాక్‌డౌన్ సమయంలో ఒక స్వీపర్‌కు భోజనం, మాస్క్, శానిటైజర్ అందించాను. అవి తీసుకున్న అతడు... 'థ్యాంక్స్ అమ్మా' అన్నాడు. ఈ రెండు మాటలు నాకు ఎంతో శక్తిని ఇచ్చాయి. వెంటనే శానిటైజేషన్ కిట్స్‌కు ఆర్డరు ఇచ్చాను. ఒక కిచెన్ సర్వీస్ ద్వారా వాటిని పేదలకు పంపిణీ చేశాను. బయటికి వెళ్లడం వల్ల నాకు ఏమైనా అవుతుందేమో అని మావారు భయపడే వారు. అయితే జాగ్రత్తల విషయంలో నేను ఎప్పుడూ రాజీపడలేదు. రెండు రోజుల తరువాత నా పిల్లలు అమ్మా నీతో పాటు మేమూ వస్తాం అన్నారు. ఇంతకంటే సంతోషకరమైన విషయం ఏముంటుంది'' అని గతాన్ని గుర్తు చేసుకుంది సీమ.

కోవిడ్ సమయంలో సీమ మామయ్యకు ఒంట్లో బాగలేకపోతే హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. ఆ సమయంలోనే సీనియర్ సిటిజెన్‌ల ప్రస్తావన తీసుకువచ్చింది ఆమె కూతురు మేఘన. తల్లీ కూతుళ్లు వృద్ధాశ్రమాలకు వెళ్లి అవసరమైన మందులు ఇవ్వడమే కాదు... వారికి ధైర్యం కూడా చెప్పేవారు.

పట్టణం– పల్లె తేడా లేకుండా 'సర్వైకల్ క్యాన్సర్ ఫ్రీ ఇండియా' క్యాంపెయిన్‌ను ఎన్నోచోట్లకు తీసుకువెళ్లి అవగాహన సదస్సులు, ఉచిత స్క్రీనింగ్‌లు నిర్వహించింది సీమ.

తన ఇద్దరు పిల్లలు డా.మేఘన, శ్రేయ్ శ్రీ పేర్లను కలుపుతూ స్వచ్ఛందసంస్థకు 'మేఘాశ్రేయ్' అని నామకరణం చేసింది సీమ. ఇప్పుడు వారు కూడా సంస్థ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆమె కుమారుడు శ్రేయ్ తన 14వ పుట్టిన రోజు సందర్భంగా ఆడంబరాల జోలికి పోకుండా పుట్టినరోజు వేడుకకు అయ్యే ఖర్చుతో 150 మంది పేదవాళ్లకు అవసరమయ్యే వస్తువులను కొనిచ్చాడు. ఇక మేఘనకు తన పుట్టిన రోజును అనాథాశ్రమాలలో జరుపుకోవడం అలవాటు. 'సమాజంపై సానుకూల మార్పు' అనే అంశానికి సంబంధించి సీమాసింగ్ లోతైన ఆలోచనలు చేస్తుంటుంది. అయితే అవి మనసుకు మాత్రమే పరిమితమయ్యే ఆలోచనలు కావు. ఆచరణకు ప్రేరేపించే అద్భుత ఆలోచనలు. ఒక మహిళా కానిస్టేబుల్... 'అమ్మా మీతో ఫొటో దిగుతాను' అని సీమాసింగ్‌ను అభ్యర్థించింది. 'నేను సినిమా స్టార్‌ని కాదు కదా!' అని చిన్నగా నవ్వింది సీమ.

'మంచి పనులు చేసే ప్రతి ఒక్కరూ స్టారే. మీ గురించి మా అమ్మాయికి చెప్పాలనుకుంటున్నాను' అన్నది ఆ కానిస్టేబుల్. మంచి పనులు చేసే వాళ్లను ప్రజలు ఎంతగా అభిమానిస్తారో చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

మహిళా సహకార వెలుగులు

సాగుబడి
పుష్యమి కార్తె: ఆగస్టు 3 వరకు
అశ్లేష కార్తె: ఆగస్టు 4 నుంచి


- ఆహారోత్పత్తుల శుద్ధి, విక్రయం ద్వారా ఆదాయం
- సోలార్ డ్రయ్యర్లతో పంటలకు విలువ జోడింపు
- సేంద్రియ సేద్యంలో పురోగమిస్తున్న శ్రీగాయత్రి మహిళా రైతుల సొసైటీ కృషి స్ఫూర్తిదాయకం



● పత్తి చేనులో భర్త చంద్రశేఖరరెడ్డితో మల్లేశ్వరమ్మ

చిన్న, సన్నకారు మహిళా రైతులు సంఘటితమైతే ఆర్థికాభివృద్ధితో పాటు మంచి ఆహారం కూడా మారుమూల గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి వస్తుందనటానికి శ్రీగాయత్రి మహిళా రైతుల పరస్పర సహకార పరపతి సంఘం ఓ తాజా ఉదాహరణ. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లె మండలం ముసలిరెడ్డిగారిపల్లి కేంద్రంగా 2014లో ఈ సొసైటీ ఏర్పాటైంది. సుస్థిర వ్యవసాయ కేంద్రం ఈ సొసైటీకి ఆది నుంచి అండగా నిలుస్తోంది. ముసలిరెడ్డిగారిపల్లి, మల్లేపల్లి తదితర పరిసర గ్రామాలకు చెందిన 301 మంది సన్న, చిన్నకారు మహిళా రైతు కుటుంబాలలో ఆర్థిక, ఆహార భద్రతా వెలుగులు నింపుతున్న ఈ సొసైటీకి సేంద్రియ రైతు వడ్డెమాని మల్లేశ్వరమ్మ అధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. బడికి వెళ్లి చదువుకోలేకపోయినా.. కఠోర శ్రమ, పట్టుదలతో సొసైటీ వార్షిక వ్యాపారాన్ని రూ.65 లక్షలకు పెంచగలిగారామె. ఆమె కృషిని మెచ్చిన నాబార్డు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆమెను ఉత్తమ రైతు పురస్కారంతో సత్కరించింది. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ బాబు.ఎ., రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి చేతుల మీదుగా ఇటీవల విజయవాడలో ఆమె నాబార్డు పురస్కారాన్ని అందుకోవటం విశేషం.

మల్లేశ్వరమ్మ, చంద్రశేఖరరెడ్డి దంపతులు ముసలిరెడ్డిగారిపల్లి పరిసరాల్లోని 9 ఎకరాల సొంత భూమిలో చాలా ఏళ్లుగా సేంద్రియ సేద్యం చేస్తున్నారు. 2 ఎకరాల్లో మూడేళ్ల క్రితం బత్తాయి మొక్కలు నాటారు. అందులో అంతరపంటగా సాగు చేస్తున్న పత్తి ప్రస్తుతం కోతకు వచ్చింది. గతంలో వేరుశనగ తదితర ఆహార పంటలనే వేసే వారమని, అడవి పందుల బాధ పడలేక పత్తి వేశామని ఆమె తెలిపారు. ఆగస్టు ఆఖరుకు పత్తి తీత పూర్తవుతుంది. సగటున చెట్టుకు 35 కాయలు వచ్చాయి. ఎకరానికి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. మరో రెండెకరాల్లో కూడా పత్తి సాగు చేస్తున్నారు. 4 ఎకరాలను బొప్పాయి నాటడానికి సిద్ధం చేశారు. ఊరికి ఆనుకొని ఉన్న ఎకరంలో 32 రకాల కూరగాయలను ఇటీవలే విత్తామని మల్లేశ్వరమ్మ తెలిపారు. సిఎస్ఎ క్షేత్ర సిబ్బంది తోడ్పాటుతో ఏ పంటైనా సేంద్రియంగానే సాగు చేస్తుండటం విశేషం. పొలాలు కేసీ కెనాల్‌కు దగ్గర్లో ఉండటంతో భూగర్భ జలానికి కొదువ లేదు. ఒకే బోరుతో భూగర్భ పైపు లైను ద్వారా పొలాల్లోని పంటలకు డ్రిప్ ద్వారా నీటిని అందిస్తున్నారు.



● సోలార్ డ్రయ్యర్లతో నిమ్మ ఒరుగులు



● నాబార్డు వ్యవస్థాపక దినోత్సవంలో ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకుంటున్న మల్లేశ్వరమ్మ

48 మందికి సేంద్రియ సర్టిఫికేషన్

శ్రీగాయత్రి మహిళా రైతుల పరస్పర సహకార పరపతి సంఘంలో దాదాపు 11 గ్రామాలకు చెందిన 301 మంది మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇందులో 48 మంది సేంద్రియ సేద్యం చేస్తున్నారు. మల్లేశ్వరమ్మ సహా పది మంది ఎన్‌పిఓపి థర్డ్‌పార్టీ సేంద్రియ సర్టిఫికేషన్ పొందారు. ఈ సర్టిఫికేషన్ ఉన్న ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయొచ్చు. మరో 40 మంది దేశీయ పీజీఎస్ సర్టిఫికేషన్ పొందారు. సొసైటీ తమ రైతులకు విత్తనాలు తదితర ఉత్పాదకాలను తక్కువ ధరకు అందిస్తుంది. దీనితో పాటు కొర్రలు, అండుకొర్రలు, వేరుశనగలు, తెల్లజొన్న, గోధుమలు, ధనియాలు, కందులు, పెసలను సుమారు 15 క్వింటాళ్ల వరకు సభ్య రైతుల నుంచి కొనుగోలు చేసి నిల్వ చేసి, శుద్ధిచేసి ఏడాది పొడవునా విక్రయిస్తున్నారు. మల్లేశ్వరమ్మ తన ఇంట్లో కొన్ని గదులను సొసైటీకి చెందిన ధాన్యాల నిల్వకు ఉపయోగిస్తున్నారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలను మరపట్టే యంత్రాలను నెలకొల్పారు. డిమాండ్ మేరకు ధాన్యాలను శుద్ధి చేయించి సరసమైన ధరకు విక్రయిస్తున్నారు. కందులను సంప్రదాయ పద్ధతుల్లో పప్పుగా తయారు చేస్తున్నారు. ఇవి రుచికరంగా ఉండటమే కాకుండా పురుగు సమస్య ఉండదని తెలిపారు. కొందరు వచ్చి కొనుక్కెళ్తున్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఉన్న వారికి కూడా పంపుతున్నారు.

సోలార్ డ్రయ్యర్లతో ఒరుగులు

టొమాటోలు, నిమ్మకాయల వంటి పంటలకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నప్పుడు కొనుగోలు చేసి, సోలార్ డ్రయ్యర్ల ద్వారా ఒరుగులు తయారు చేసి విక్రయించడం ఈ సొసైటీ చేస్తున్న మరో మంచి పని. రోహిజా సోలార్ స్టార్టప్ 3 టన్నుల సామర్థ్యం గల 6 సోలార్ డ్రయ్యర్లను ఈ సొసైటీకి సిఎస్ఎ ద్వారా 80% సబ్సిడీపై 5 నెలల క్రితం అందించింది. గతంలో టొమాటో ఒరుగులు తయారు చేశారు. 20 కిలోల టొమాటోలను ఎండబెడితే కిలో ఒరుగులు వస్తాయి. 11 కిలోల నిమ్మకాయలతో కిలో ఒరుగులు చేసి, రూ.340కి అమ్ముతున్నారు. కరివేపాకు, మునగాకులను సైతం ఈ డ్రయ్యర్లలో ఎండబెట్టి పొడులను ఆర్డర్లపై సరఫరా చేస్తున్నామని మల్లేశ్వరమ్మ వివరించారు. సొసైటీ పనులు చేసే మహిళలకు వేతనానికి అదనంగా రోజుకు రూ.5లను భవిష్యనిధిగా జమ చేస్తున్నామని ఆమె సంతోషంగా తెలిపారు.

మంచి ఫుడ్డు అందిస్తున్నానన్న సంతృప్తి ఉంది

ప్రజలకు ఆదాయం ఉంది. చేతిలో డబ్బుంది. కానీ, మంచి ఫుడ్డు లేదు. ఈ గ్రహింపుతోనే సేంద్రియ ఆహారాన్ని పండించి అందించాలన్న ఆలోచన వచ్చింది. రసాయనాల్లేకుండా పండించిన రాగి సంగటి, కొర్రన్నం, సింగిల్ పాలిష్ బియ్యం, కూరగాయలు, ఆకుకూరలు ఇంటిల్లపాదీ తింటున్నాం. దీని వల్ల మా ఆరోగ్యం ఎంతో బాగుంది. మా ఊళ్లో వాళ్లు 60% మా దగ్గర కొంటారు. బెంగళూరు, హైదరాబాద్‌లలో 18 కుటుంబాలకు కూడా పార్సిల్ ద్వారా పంపుతున్నాం. మా కుటుంబానికి, ప్రజలకు కూడా మంచి ఫుడ్డు అందిస్తున్నానన్న సంతృప్తి చాలా ఉంది. ఈ కీర్తి చాలు.

\- వడ్డెమాని మల్లేశ్వరమ్మ (97044 02914),
అధ్యక్షులు, శ్రీగాయత్రి మహిళా రైతుల పరస్పర సహకార పరపతి సంఘం, ముసలిరెడ్డిగారిపల్లి, వేంపల్లె మం., వైఎస్సార్ కడప జిల్లా.



- మొక్కజొన్న పీచులో పుష్కలంగా ఔషధగుణాలు
- కండెకు ఒక గ్రాము చొప్పున.. ఎకరానికి 32 కిలోలకు పైగా ఎండు పీచు లభ్యం
- పీచుతో టీ కాచుకొని సేవించవచ్చు.. పొడి చేసి చపాతీ పిండిలో కలుపుకోవచ్చు

పీచే కదా అని పారేయకండి!

మొక్కజొన్న కంకులను తీసుకొని దానికి ఉండే దారాల్లాంటి పీచు (కార్న్ సిల్క్)ను మాత్రం తీసి పారేస్తుంటాం. అయితే, ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఈ పీచును ప్రపంచవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉపయోగిస్తున్నారు. దీన్ని సేకరించి, ఎండబెట్టి అమ్ముకోవడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. మొక్కజొన్న సాగులో ప్రపంచంలో భారత్ 6వ స్థానంలో ఉంది. 2021–22 రబీ గణాంకాల ప్రకారం ఏపీలో 4.82 లక్షల ఎకరాల్లో, తెలంగాణలో 4.74 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది. మొక్కజొన్న కండెలు కోసేటప్పుడే పీచును కండె నుంచి తీసి జాగ్రత్త చేసుకోవాలి. సేకరించిన పీచును 0.1% ఉప్పు ద్రావణంతో కడిగి శుభ్రం చేసి ఎండబెట్టాలి. తేమ శాతం 7–10% మధ్యలో ఉండేలా చూసుకొని నిల్వ చేసుకోవాలి. ఈ పీచును అనేక ఆహారోత్పత్తుల్లో ఉపయోగించవచ్చు. ఒక మొక్కజొన్న పొత్తు నుంచి జాగ్రత్తగా సేకరించి ఎండబెడితే సగటున ఒక గ్రాము పీచు వస్తుందని అంచనా. ఏక పంటగా సాగు చేస్తే ఎకరానికి 32 వేల మొక్కలు వేస్తారు. అంటే, ఎకరానికి 32 కిలోల ఎండు పీచును సేకరించవచ్చన్న మాట.





మొక్కజొన్న పీచుతో టీ ఇలా..

ఎండబెట్టిన మొక్కజొన్న పీచుతో టీ(కషాయం) కాచుకొని తాగటం ఒక మేలైన పద్ధతి. 2 కప్పుల నీటిలో 2 చెంచాల ఎండిన పీచును కలిపి, తక్కువ మంటపై 10 నిమిషాలు మరిగించి వడకడితే.. చక్కటి టీ రెడీ అవుతుంది. బెల్లం, పంచదార, తేనె తగుమాత్రంగా కలిపి రోజుకు 3 కప్పుల వరకు తాగొచ్చు. వట్టి మొక్కజొన్న పీచు టీకి కొంచెం మట్టి వాసన ఉంటుంది. అందుకని ఇతర పదార్థాలతో కలిపి టీపొడిని తయారు చేసుకొని వాడొచ్చు. ఎండిన మొక్కజొన్న పీచు, ఎండు నిమ్మ బద్దలను వేర్వేరుగా పిండి చేసి కలిపి టీ కాచుకోవచ్చు.



షుగర్, కిడ్నీ, ప్రొస్టేట్ సమస్యలకు ఉపశమనం

మొక్కజొన్న పీచులో అధిక పోషక విలువలతో పాటు యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ప్రొటీన్లు, విటమిన్లు, కార్బొహైడ్రేట్లు,కాల్షియం, పొటాషియం, మాంగనీసు, సిటోస్టెరాల్, స్టిగ్మాస్టెరాల్, అల్కలాయిడ్లు, సపోనిన్లు, టానిన్లు, ఫ్లావనాయిడ్లు పుష్కలంగా ఉన్నాయి. దేహంలో నుంచి అధిక నీటిని బయటకు పంపుతుంది. మూత్రవిసర్జనను సులభతరం చేయటం ద్వారా కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా చూస్తుంది. మూత్రవిసర్జనలో నొప్పి, మూత్రనాళంలో/ మూత్రాశయంలో ఇన్ఫెక్షన్ల నివారణకు ఉపకరిస్తుంది. ప్రొస్టేట్ సమస్యలకు ఉపశమనం కలిగిస్తుంది. ఇన్సులిన్ సహజ ఉత్పత్తిని పెంపొందించి మధుమేహాన్ని నియంత్రిస్తుంది. గుండె జబ్బులు, అధిక కొలెస్ట్రాల్ సమస్యలను నివారిస్తుంది. గౌట్ నొప్పిని తగ్గిస్తుంది. కొవ్వును నియంత్రించి అధిక బరువును నివారించడానికి కూడా మొక్కజొన్న పీచు ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు.

ఆహారోత్పత్తులెన్నో..

బ్రెడ్, బిస్కట్ల తయారీలో మొక్కజొన్న పీచు పొడిని కొద్ది మేరకు కలుపుతున్నారు. దీన్ని కలిపినందు వల్ల వాటి రంగు, వాసన ఏమీ మారవు. పోషక విలువలు పెరుగుతాయి. బియ్యపు పిండి, పచ్చి బొప్పాయి, నువ్వుల పిండితో మొక్కజొన్న పీచు పొడిని గరిష్ఠంగా 10% కలుపుతూ ఆరోగ్యదాయకమైన లడ్డూలు తయారు చేయొచ్చు. చపాతీ, పరోటా, రైతా, పప్పు వంటి వంటకాల్లో మొక్కజొన్న పీచు పొడిని కలుపుకుంటే మంచి పోషక విలువలు లభిస్తాయి. టాబ్లెట్లను కూడా మొక్కజొన్న పీచుతో తయారు చేయవచ్చు. బరువు తగ్గడానికి, చర్మ సౌందర్యం కోసం ఈ టాబ్లెట్లను వాడుతున్నారు. ఒక్కో మాత్రను రూ.20 వరకూ ధర పలుకుతోందట.

మొక్కజొన్న పీచు ప్రాసెసింగ్, నిల్వకు అధిక ఖర్చుతో కూడిన నిర్మాణాలు అవసరం లేదు. మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు, గ్రామీణ నిరుద్యోగులకు మొక్కజొన్న పీచు సేకరణ ద్వారా ఉపాధి కల్పించే అవకాశం ఉంది. మొక్కజొన్న రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ప్రకృతి/సేంద్రియ రైతులకు మరింత ఉపయోగకరమని చెప్పొచ్చు.

12 నుంచి బహుళ అంతస్తుల సేద్యంపై శిక్షణ

ఇస్కాన్ సదాశివపేట ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15 వరకు గోఆధారిత బహుళ అంతస్తుల ఉద్యాన పంటల సాగుపై నాలుగు రోజుల శిక్షణా శిబిరం జరగనుంది. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కంబాలపల్లిలో జరిగే ఈ శిబిరంలో పాల్గొనే వారికి బహుళ అంతస్తుల ఉద్యాన పంటల సేద్య నిపుణుడు ఆకాశ్ చౌరాసియా శిక్షణ ఇస్తారు. వసతి, సాత్వికాహారం సహా శిక్షణకు ఫీజు రూ. 4 వేలు. రిజిస్ట్రేషన్ వివరాలకు.. 94495 96039.

4 నుంచి తిరుపతిలో సేంద్రియ మేళా

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6 వరకు తిరుపతిలోని టీటీడీ గ్రౌండ్స్(ఇస్కాన్ టెంపుల్ పక్కన)లో సేంద్రియ ఉత్పత్తుల సంత జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన అనేక రకాల ఆహారోత్పత్తులు, కూరగాయలు, పండ్లను అనేక రాష్ట్రాల రైతులు స్వయంగా విక్రయించనున్నారు. 4న ఉ. 10 గం.కు రైతు సదస్సు, 5న ఆహార శుద్ధిపై సదస్సు, 6న సా. 3 గం.కు సేంద్రియ ఇంటిపంటల సాగుపై సదస్సు నిర్వహించనున్నారు. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. 81436 32488, 83741 39439.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



ప్రతాప్ పసిడి గురి...

చైనాలో జరుగుతున్న ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ రెండు స్వర్ణాలు సాధించాడు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ప్రతాప్, దివ్యాన్ష్, అర్జున్‌ల త్రయం 1894.7తో ప్రపంచ రికార్డు స్కోరు సాధించి పసిడి పతకం గెలిచింది. ఇదే ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో ప్రతాప్ (252.6 స్కోరుతో) మరో బంగారు పతకం గెలిచాడు. ఆర్చరీ క్రీడ మహిళల కాంపౌండ్ ఈవెంట్‌లో అవనీత్ కౌర్, పురుషుల ఈవెంట్‌లో సంగమ్‌ప్రీత్ బిస్లా భారత్‌కు పసిడి పతకాలు అందించారు.

భారత్ ఖాతాలో రెండో స్వర్ణం



ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత్ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఈ పోటీల్లో సోమవారం యూత్ పురుషుల 67 కేజీల విభాగంలో బేదబ్రత్ భరాలి పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. బేదబ్రత్ స్నాచ్‌లో 124 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 149 కేజీలు బరువెత్తి ఓవరాల్‌గా 273 కేజీలతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.

విజయమా... ప్రయోగమా!

వెస్టిండీస్‌తో రెండో వన్డేలో ఓటమి తర్వాత 'మేం భవిష్యత్తుపై దృష్టి పెట్టాం. ప్రస్తుత ఫలితాలు ముఖ్యం కాదు. అందుకే భిన్నమైన కూర్పుతో తుది జట్టు కోసం ప్రయోగాలు చేస్తున్నాం' అని భారత కోచ్ రాహుల్ ద్రవిడ్ వ్యాఖ్యానించారు. నిజంగానే ద్రవిడ్ మాటలను చేతలకు అన్వయిస్తే మరోసారి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి మ్యాచ్ ఆడకుండా విశ్రాంతి తీసుకోవడం ఖాయం. ఇలాంటి స్థితిలో భారత్ చివరి వన్డేలో నెగ్గి సిరీస్ గెలుచుకుంటుందా లేక గత మ్యాచ్‌లాగే తలవంచుతుందా చూడాలి.

- నేడు మూడో వన్డే బరిలో భారత్
- వెస్టిండీస్‌తో సిరీస్ తేల్చే చివరి పోరు
- రాత్రి 7 గంటల నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



తరూబా (ట్రినిడాడ్): వన్డే వరల్డ్‌కప్ ఆతిథ్య జట్టు హోదాలో సిద్ధమవుతున్న భారత్ జట్టు వరల్డ్ కప్‌కు అర్హత సాధించని టీమ్‌తో సిరీస్ విజయం కోసం బరిలోకి దిగుతోంది. ఇరు జట్ల మధ్య సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరిదైన మూడో వన్డేకు రంగం సిద్ధమైంది. తొలి వన్డేలోనే కష్టంగా నెగ్గిన టీమిండియా... రెండో వన్డేలో ఓటమిపాలు కావడంతో సిరీస్ 1–1గా సమంగా నిలిచింది. ఈ నేపథ్యంలో మూడో వన్డే ఏకపక్షంగా మారకుండా హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.

ఆ ఇద్దరికీ...

రోహిత్, కోహ్లి గత మ్యాచ్‌లాగే ఆడకపోతే భారత జట్టుకు సంబంధించి ఇద్దరు బ్యాటర్లపై ప్రధానంగా చర్చ సాగనుంది. తమను తాము నిరూపించుకోవాల్సిన స్థితిలో సూర్యకుమార్ యాదవ్, సంజూ సామ్సన్‌లు బరిలోకి దిగుతున్నారు. కోచ్ చెప్పిన దాన్ని బట్టి వీరిద్దరికి మరో అవకాశం ఖాయం. సూర్య వన్డేల్లో ఇంకా తడబడుతుండగా... చాలా కాలం తర్వాత దక్కిన అవకాశాన్ని సామ్సన్ ఉపయోగించుకోలేకపోయాడు. మూడు, నాలుగు స్థానాల్లో వీరు రాణిస్తే జట్టుకు మేలు కలుగుతుంది. ఇషాన్ కిషన్ ఆకట్టుకోగా, గిల్ ఇంకా ప్రభావం చూపలేదు. హార్దిక్ కూడా అంచనాలకు తగిన విధంగా రెండు విభాగాల్లోనూ రాణించలేకపోతున్నాడు. బౌలింగ్‌లో ఉమ్రాన్, ముకేశ్, కుల్దీప్‌లు తమ సత్తా మేరకు ఆడితే విండీస్‌ను కట్టడి చేయగలరు. జడేజా, అక్షర్ కూడా రాణిస్తే భారత్ విజయావకాశాలు మెరుగవుతాయి.

ఆత్మవిశ్వాసంతో...

తొలి వన్డేలో కుప్పకూలినా... రెండో మ్యాచ్‌లో గెలుపు విండీస్ ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ముఖ్యంగా కెప్టెన్ షై హోప్ చక్కటి ఫామ్‌తో ముందుండి జట్టును నడిపిస్తున్నాడు. మేయర్స్ గత మ్యాచ్‌లో తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించాడు. కింగ్, అతనజ్ కూడా రాణించడంతో పాటు కార్టీ కూడా నిలబడితే జట్టు మంచి స్కోరు సాధించేందుకు అవకాశం ఉంటుంది. విండీస్ బౌలింగ్ గత మ్యాచ్‌లో ఆకట్టుకుంది. పేసర్లలో అల్జారి జోసెఫ్ పదునైన పేస్‌తో భారత్‌ను ఇబ్బంది పెట్టగా రొమారియో షెఫర్డ్ కూడా చాలా తెలివిగా బౌలింగ్ చేశాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్ గుడకేశ్ మోతీ కూడా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోసారి సమష్టిగా రాణించి సొంతగడ్డపై సిరీస్ సాధించాలని ఆ జట్టు పట్టుదలగా ఉంది.

పిచ్, వాతావరణం

బ్రియాన్ లారా స్టేడియం ఇప్పటి వరకు ఒకే ఒక అంతర్జాతీయ టి20 మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఈ మైదానంలో ఇదే తొలి అంతర్జాతీయ వన్డే. అయితే ఈ వేదికపై జరిగిన దేశవాళీ వన్డేల్లో స్వల్ప స్కోర్లే నమోదు కావడం పిచ్ పరిస్థితికి ఒక సూచిక. మ్యాచ్ రోజు వాన ముప్పు లేదు.

బుమ్రా వచ్చేశాడు

- కెప్టెన్ హోదాలో పునరాగమనం
- ఐర్లాండ్‌తో టి20 సిరీస్‌లో భారత జట్టు

ముంబై: సుదీర్ఘ విరామం తర్వాత భారత స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మళ్లీ మైదానంలోకి దిగబోతున్నాడు. వెన్నుకు గాయంతో జట్టుకు దూరం కావడం, ఆపై శస్త్రచికిత్స, అనంతరం రీహాబిలిటేషన్... ఇప్పుడు పూర్తిగా కోలుకొని బుమ్రా ఆట కోసం సిద్ధమయ్యాడు. ఐర్లాండ్‌తో జరిగే 3 మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం అతడిని సెలక్టర్లు ఎంపిక చేశారు. పైగా అతను ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గతంలో ఇంగ్లండ్‌తో జరిగిన ఒక టెస్టులో బుమ్రా భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. కీలకమైన ఆసియా కప్, ప్రపంచకప్‌కు ముందు బుమ్రా మ్యాచ్ ఫిట్‌నెస్ స్థాయిని పరీక్షించేందుకు పెద్దగా ఒత్తిడి లేని, బలహీన జట్టుతో జరిగే సిరీస్‌లో ఆడించబోతున్నారు. చివరిసారిగా గత ఏడాది సెప్టెంబర్ 22న హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన బుమ్రా... ఐపీఎల్ కూడా ఆడలేదు. బుమ్రాతో పాటు గాయం నుంచి కోలుకున్న మరో పేసర్ ప్రసిధ్ కృష్ణకు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. ప్రసిధ్ కూడా సంవత్సరం క్రితం భారత్‌కు ఆడాడు. వీరిద్దరు మినహా సీనియర్ ఆటగాళ్లెవరూ లేకుండా యువ ఆటగాళ్లతోనే మిగతా జట్టును ఎంపిక చేశారు. ఆసియా క్రీడలకు ఎంపిక చేసిన టీమ్‌లోని సభ్యులే దాదాపుగా ఇక్కడా ఉన్నారు. భారత్, ఐర్లాండ్ మధ్య ఆగస్టు 18, 20, 23 తేదీల్లో డబ్లిన్‌లో మూడు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి.



జట్టు వివరాలు: బుమ్రా (కెప్టెన్), రుతురాజ్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, ఠాకూర్ తిలక్ వర్మ, రింకూ సింగ్, సంజూ సామ్సన్, జితేశ్ శర్మ, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, షహబాజ్ అహ్మద్, రవి బిష్ణోయ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్.

రన్నరప్ సరయు



సాక్షి, హైదరాబాద్: పోంటెవెద్రా మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి వేల్పుల సరయు అద్భుత ప్రదర్శన కనబరిచింది. స్పెయిన్‌లో జరిగిన ఈ టోర్నీలో వరంగల్ జిల్లాకు చెందిన 16 ఏళ్ల సరయు రన్నరప్‌గా నిలిచింది. నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో చివరిదైన 79వ ర్యాంక్‌తో బరిలోకి దిగిన సరయు చివరకు 6.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి అందర్నీ ఆశ్చర్యపరిచింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సరయు నాలుగు గేముల్లో నెగ్గి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడిపోయింది. ఈ టోర్నీ ద్వారా మొత్తం 211 రేటింగ్ పాయింట్లు సమకూర్చుకున్న సరయు ఏకకాలంలో మహిళా అంతర్జాతీయ మాస్టర్ (డబ్ల్యూఐఎం), మహిళా గ్రాండ్‌మాస్టర్ (డబ్ల్యూజీఎం), అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) హోదాలకు సంబంధించి తొలి నార్మ్‌ను సొంతం చేసుకోవడం విశేషం.

ఆఖరి మజిలీలో ఇంగ్లండ్‌దే విక్టరీ

- యాషెస్ సిరీస్ 2–2తో సమం
- విజయంతో బ్రాడ్ వీడ్కోలు

లండన్: సంప్రదాయ క్రికెట్‌లో యాషెస్ సిరీస్‌కున్న ప్రత్యేకత, విశిష్టత ఇంకే సిరీస్‌కు ఎందుకు ఉండదో తాజా సిరీస్‌లో ఏ ఒక్క మ్యాచ్ చూసిన ఇట్టే అర్థమవుతుంది. టెస్టు సమరం ఐదు రోజులు ఆసక్తికరంగానే మొదలైంది. ఐదు టెస్టులూ రసవత్తరంగానే జరిగాయి. గెలిచినా... ఓడినా... ఫలితంతో సంబంధంలేకుండా ఇంగ్లండ్ ఈ సిరీస్ ఆసాంతం వన్డేను తలపించే దూకుడునే కొనసాగించింది. ఇక ఈ ఐదో టెస్టు చివరి మజిలీలో వర్షం కూడా 'యాషెస్' విశిష్టత ముందు తోకముడిచింది. ఆఖరి రోజు ఆటలో క్లైమాక్స్‌కు సరిపడా మలుపులిచ్చి... ఇరు జట్లను ఊరించి మరీ సిరీస్‌ను పంచింది.

ఆసీస్‌ను నడిపించి... ఇంగ్లండ్‌ను గెలిపించి...

ఆఖరి రోజు 384 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 135/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 94.4 ఓవర్లలో 334 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్లు వార్నర్ (60; 9 ఫోర్లు), ఖ్వాజా (72; 8 ఫోర్లు) స్వల్ప వ్యవధిలోనే అవుటయ్యారు. కానీ స్మిత్ (54; 9 ఫోర్లు), ట్రావిస్ హెడ్ (43; 6 ఫోర్లు) కలిసి నాలుగో వికెట్‌కు 95 పరుగుల జోడించడంతో ఆసీస్ ఆశలు పెంచుకుంది. టీ సెషన్‌లో 238/3 స్కోరుతో ఇంగ్లండ్‌ను కంగారు పెట్టిన ఆసీస్‌కు... హెడ్, స్మిత్, మార్ష్ (6), స్టార్క్ (0), కెప్టెన్ కమిన్స్ (9) వికెట్లను 300 పరుగుల్లోపే కోల్పోవడంతో ఓటమి ఖాయమైంది. బ్రాడ్ కెరీర్ ఆఖరి టెస్టులో ఆఖరి వికెట్‌గా క్యారీ (28; 1 ఫోర్, 1 సిక్స్)ని అవుట్ చేయడంతో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌కు 334 స్కోరువద్ద తెరపడింది. ఐదో టెస్టులో 49 పరుగులతో గెలిచిన ఇంగ్లండ్ సిరీస్‌ను 2–2తో సమం చేసుకుంది. అయితే గత సిరీస్‌ను గెలిచిన ఆసీస్ వద్దే 'యాషెస్' ఉండిపోనుంది. 2 వికెట్లతో బ్రాడ్ తన కెరీర్‌కు చిరస్మరణీయ ముగింపు ఇచ్చుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వోక్స్ 4, మొయిన్ అలీ 3 వికెట్లు తీశారు. వోక్స్, స్టార్క్‌లకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి. తదుపరి యాషెస్ సిరీస్ ఆస్ట్రేలియాలో 2025–2026లో జరుగుతుంది.



విజయానందంలో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్, బ్రాడ్

బ్రాడ్ కెరీర్ గణాంకాలు

ఫార్మాట్	ఆడినవి	వికెట్లు	బెస్ట్ బౌలింగ్	చేసిన పరుగులు	అత్యధిక స్కోరు
టెస్టులు	167	604	8/15	3662	169
వన్డేలు	121	178	5/23	529	45
టి20లు	56	65	4/24	118	18

రెండో రౌండ్‌కు కార్తీక్



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. గ్రిగరీ దనోవ్ (అమెరికా)తో జరిగిన తొలి రౌండ్‌లో కార్తీక్ 1.5–0.5తో గెలుపొందాడు. వీరిద్దరి మధ్య ఆదివారం తొలి గేమ్ 'డ్రా'కాగా...సోమవారం రెండో గేమ్‌లో కార్తీక్ 40 ఎత్తుల్లో గెలిచాడు. మరోవైపు లెవాన్ పాంట్‌సులయ (జార్జియా)తో రెండో గేమ్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి 31 ఎత్తుల్లో ఓడిపోయాడు. దాంతో వీరిద్దరు 1–1తో సమంగా ఉన్నారు. నేడు టైబ్రేక్ గేమ్‌ల ఆధారంగా విజేతను నిర్ణయిస్తారు. మహిళల విభాగంలో మరీనా బ్రునెల్లో (ఇటలీ)తో జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నూతక్కి ప్రియాంక 68 ఎత్తుల్లో 'డ్రా' చేసుకోవడంతో ఇద్దరూ 1–1తో సమంగా నిలిచారు.

సినిమా

ముందుంది మూడో భాగం

ఫస్ట్ పార్ట్ హిట్... సెకండ్ పార్ట్ కూడా హిట్.. మరి ఆ హిట్ కంటిన్యూ అవ్వాలి కదా. అవ్వాలంటే కథ ఉండాలి. కొన్ని చిత్రాల కథలకు ఆ స్కోప్ ఉంది. ఎన్ని భాగాలైనా తీసేంత కథ ఉంటుంది. అలా తెలుగులో కొన్ని చిత్రాల కథలు ఉన్నాయి. ఆ కథల తొలి, మలి భాగాలు వచ్చాయి. ఇప్పుడు మూడో భాగానికి కథ రెడీ అవుతోంది. 'ముందుంది మూడో భాగం' అంటూ రానున్న సీక్వెల్ చిత్రాల గురించి తెలుసుకుందాం.





వరుణ్, వెంకటేశ్



నాని



ఆర్య, పుష్పల్లో అల్లు అర్జున్



యశ్

ఒకే కాంబినేషన్.. రెండు చిత్రాల సీక్వెల్

సీక్వెల్ చిత్రాలు రావడం ఇప్పుడు కామన్ అయింది. అయితే ఒకే కాంబినేషన్‌లో రెండు చిత్రాల సీక్వెల్స్ రావడం అరుదు. అల్లు అర్జున్–సుకుమార్‌ల కాంబినేషన్ ఈ కోవలోకే వస్తుంది. 'ఆర్య' (2004)తో ఈ ఇద్దరి కాంబినేషన్ మొదలైంది. ఆ చిత్రం హిట్‌తో హిట్ కాంబినేషన్ అనే పేరొచ్చింది. ఆ తర్వాత అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ 'ఆర్య 2' (2009) తెరకెక్కించారు. ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో 'ఆర్య 3' కూడా ఉంటుందని స్పష్టం చేశారు. ఇక అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప' (2021) పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్టయిన విషయం తెలిసిందే. ఇప్పుడు 'పుష్ప 2' నిర్మాణంలో ఉంది. 'పుష్ప 3' కూడా ఉంటుంది. 'ఆర్య', 'పుష్ప'... ఇలా సౌత్‌లో రెండు చిత్రాల సీక్వెల్స్ తెచ్చిన కాంబినేషన్ బన్నీ–సుకుమార్‌లదే అవుతుంది.

ఎఫ్ 4

వెంకటేశ్, వరుణ్ తేజ్ హీరోలుగా తెరకెక్కిన తొలి మల్టీస్టారర్ చిత్రం 'ఎఫ్ 2: ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తమన్నా, మెహరీన్ కథానాయికలుగా నటించారు. ఈ సినిమా 2019 జనవరి 12న విడుదలై నవ్వులు పూయించడంతో పాటు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబట్టింది. ఆ మూవీకి సీక్వెల్‌గా 'ఎఫ్ 3: ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్' తెరకెక్కించారు అనిల్. ఈ మూవీలోనూ వెంకటేశ్–తమన్నా, వరుణ్ తేజ్–మెహరీన్ హీరో హీరోయిన్లు. 2022 మే 27న విడుదలైన 'ఎఫ్ 3' కూడా మంచి వసూళ్లు రాబట్టింది. 'ఎఫ్ 4' కూడా ఉంటుందని హింట్ ఇచ్చింది చిత్ర యూనిట్.

హిట్ 3

'హిట్' సినిమా ఫ్రాంచైజీలో ఇప్పటికే రెండు భాగాలు విడుదల కాగా మూడో భాగం కోసం డైరెక్టర్ శైలేష్ కొలను సన్నాహాలు చేస్తున్నారు. విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'హిట్: ది ఫస్ట్ కేస్' సినిమా 2020 ఫిబ్రవరి 28న విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'హిట్ 2: ది సెకండ్ కేస్' తీశారు శైలేష్ కొలను. అయితే ఈ మూవీలో హీరో మారారు.. అడివి శేష్ హీరోగా నటించారు. 2022 డిసెంబరు 2న రిలీజైన ఈ మూవీ ఘన విజయం సాధించింది. హిట్ ఫ్రాంచైజీలో మొత్తం 7 భాగాలు ఉంటాయని శైలేష్ స్పష్టం చేశారు. 'హిట్ 2' లానే 'హిట్ 3'లోనూ హీరో మారారు. 'హిట్ 1', 'హిట్ 2' సినిమాలు నిర్మించిన హీరో నాని 'హిట్ 3'లో లీడ్ రోల్ చేయనున్నారు. ఇందులో అర్జున్ సర్కార్ అనే పోలీస్ ఆఫీసర్‌గా నాని కనిపించనున్నారు. 'హిట్ 2' క్లయిమాక్స్‌లోనే నాని కనిపించి, ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. అటు నాని, ఇటు శైలేష్ కొలను తమ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. మరి 'హిట్ 3'కి కొబ్బరికాయ కొట్టేదెప్పుడో తెలియాలంటే వెయిట్ అండ్ సీ.

కేజీఎఫ్ 3

కన్నడ చిత్ర పరిశ్రమను, యశ్‌ను పాన్ ఇండియా స్థాయిలో నిలబెట్టిన చిత్రం 'కేజీఎఫ్: చాప్టర్ 1'. యశ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించారు. 2018 డిసెంబరు 21న ఈ చిత్రం విడుదలైంది. ఆ తర్వాత యశ్‌తోనే 'కేజీఎఫ్: చాప్టర్ 2'ని తెరకెక్కించారు ప్రశాంత్ నీల్. 2022 ఏప్రిల్ 14న రిలీజైన ఈ సినిమా కూడా హిట్‌గా నిలిచింది. 'కేజీఎఫ్: చాప్టర్ 3' కూడా ఉంటుందని హింట్ ఇచ్చారు మేకర్స్.

వినాయక చవితికి...



లారెన్స్

రజనీకాంత్ హీరోగా పి. వాసు దర్శకత్వం వహించిన 'చంద్రముఖి' (2005)కి సీక్వెల్‌గా పి. వాసు తెరకెక్కించిన సినిమా 'చంద్రముఖి 2'. రాఘవ లారెన్స్ హీరోగా నటించిన ఈ చిత్రంలో కంగనా రనౌత్ ప్రధాన పాత్ర పోషించారు. సుభాస్కరన్ నిర్మించారు. ఈ సినిమాని వినాయక చవితికి (సెప్టెంబరు) విడుదల చేయనున్నట్లు ప్రకటించి, రాఘవ లారెన్స్ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. వడివేలు, లక్ష్మీ మీనన్, మహిమా నంబియార్, రాధికా శరత్‌కుమార్ నటించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి, కెమెరా: ఆర్‌డీ రాజశేఖర్.

నీ జతై...



వరుణ్, సాక్షి

'నీ జతై...' అంటూ వరుణ్ తేజ్, సాక్షీ వైద్య పాడుకున్నారు. ఈ ఇద్దరూ జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'గాండీవధారి అర్జున'లోని రొమాంటిక్ సాంగ్ ఇది. చిత్ర సంగీతదర్శకుడు మిక్కీ జె. మేయర్ స్వరపరచిన ఈ పాటను ఎల్విూ, నకుల్ అభయంకర్ పాడారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో ఈ చిత్రాన్ని బీవీఎస్‌ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించారు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదల కానుంది. ''సరికొత్త యాక్షన్ సీక్వెన్స్‌లతో, ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. ఇందులో వరుణ్ తేజ్, సాక్షీ వైద్య స్పెషల్ ఏజెంట్స్‌గా కనిపిస్తారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

నీ చుట్టు...




రామ్, శ్రీలీల

రామ్, శ్రీలీల జంటగా బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'స్కంద'. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతదర్శకుడు. ఈ చిత్రంలోని 'నీ చుట్టు చుట్టు...' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ లిరికల్ వీడియోను ఈ నెల 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్‌ని విడుదల చేశారు. ''ఈ చిత్రంలో రామ్ ఇంతకుముందు కనిపించనంత మాస్‌గా కనిపించనున్నారు. 'నీ చుట్టు..' సాంగ్ చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో సెప్టెంబర్ 15న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ డిటాకే, సమర్పణ: పవన్ కుమార్, జీ స్టూడియోస్.

డబుల్.. తొలి షెడ్యూల్ పూర్తి: రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. ''మా యాక్షన్ ప్యాక్ ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. మరో షెడ్యూల్ కోసం విదేశాలు వెళ్లనున్నాం. 2024 మార్చి 8న థియేటర్లలో 'డబుల్ ఇస్మార్ట్''' అని ఛార్మి పేర్కొన్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి సీఈవో: విషు రెడ్డి.

తేడాలొస్తే...



'మేము గోదారోళ్ళం.. మాట ఒకటే సాగదీస్తాం.. తేడాలొస్తే నవ్వుతూ నరాలు లాగేస్తాం' అంటున్నారు విశ్వక్ సేన్. కృష్ణ చైతన్య దర్శకత్వంలో విశ్వక్ హీరోగా సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న చిత్రంలోని డైలాగ్ ఇది. ఈ చిత్రానికి 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' టైటిల్‌ని ఖరారు చేసినట్లు ప్రకటించి, యూనిట్ రిలీజ్ చేసిన వీడియో గ్లింప్స్‌లో పైన పేర్కొన్న డైలాగ్స్ ఉన్నాయి. ''క్రూరమైన ప్రపంచంలో సామాన్యుడి నుంచి సంపన్నుడిగా ఎదిగిన వ్యక్తిగా విశ్వక్ సేన్ గ్రే క్యారెక్టర్ చేస్తున్నారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. నేహా శెట్టి కథానాయికగా, అంజలి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: అనిత్ మధాది.


ఒకే షెడ్యూల్‌లో పూర్తి చేశాం



రాజేష్

''కృష్ణగాడు అంటే ఒక రేంజ్' గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. హీరో పేరు కృష్ణ'' అని దర్శకుడు రాజేష్ దొండపాటి అన్నారు. రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా నటించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎస్‌కే శ్రీలత, పెట్లా రఘురామ్ మూర్తి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 4న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా రాజేష్ దొండపాటి మాట్లాడుతూ–''దర్శకుడిగా నాకిది తొలి సినిమా. అనుకున్న బడ్జెట్‌లో సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేశాం. సాబు వర్గీస్ సంగీతం, నేపథ్య సంగీతం హైలైట్'' అన్నారు.


తుప్పు వదిలించావ్ అన్నారు



రాజేష్

''నాన్నగారి (మణిశర్మ) బర్త్‌డేకి మెహర్ రమేష్‌గారు వచ్చారు. 'చిరంజీవిగారి 'భోళా శంకర్'కి నువ్వు సంగీతం అందిస్తున్నావ్' అంటే జోక్ చేస్తున్నారేమో అనుకున్నా. ఆ తర్వాతి రోజు కథ చెప్పడంతో షాకయ్యా'' అన్నారు సంగీత దర్శకుడు మహతి స్వరసాగర్. చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'భోళా శంకర్'. తమన్నా హీరోయిన్‌గా నటించారు. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మహతి స్వరసాగర్ మాట్లాడుతూ–''ఈ సినిమా కోసం తొలిసారి నాన్నగారి సలహాలు తీసుకున్నా. ట్యూన్ చేశాక నాన్నగారికి వినిపించాను. చిరంజీవిగారికి తొలిసారి ట్యూన్ వినిపించినప్పుడు 'చెవిలో తుప్పు వదిలించావ్' అని అభినందించడంతో మరింత ధైర్యంతో ముందుకు సాగాను. ఈ సినిమాలోని 'జామ్ జామ్.., మిల్కీ బ్యూటీ..' పాటలంటే చిరంజీవిగారికి ఇష్టం. నేపథ్య సంగీతంపైనా ప్రత్యేక దృష్టి సారించి, బాగా ఇచ్చాను. నాన్నగారి పాటల్లో 'ఇంద్ర'లోని 'రాధే గోవిందా..' పాటని రీమిక్స్ చేయాలని ఉంది. అది రామ్‌చరణ్‌గారికే సరిపోతుంది'' అన్నారు.


అత్త.. అమ్మాయి.. ఓ పెళ్లి



ఇవానా, హరీష్, నదియా

భారత క్రికెటర్ ఎంఎస్ ధోని 'ఎల్‌జీఎమ్'తో నిర్మాణంలోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. హరీష్ కల్యాణ్, ఇవానా, నదియా, యోగిబాబు కీలక పాత్రల్లో రమేష్ తమిళ్‌మణి దర్శకత్వం వహించారు. సాక్షి ధోని, వికాస్ హస్జా నిర్మించిన ఈ చిత్ర తెలుగు, తమిళంలో ఈ నెల 4న విడుదల కానుంది. తెలుగులో జేపీఆర్ ఫిల్మ్స్, త్రిపుర ప్రొడక్షన్స్ రిలీజ్ చేస్తున్నాయి. ''ప్రేమించిన అబ్బాయిని పెళ్లాడాలనుకున్న అమ్మాయి కాబోయే అత్తగారి గురించి తెలుసుకునేందుకు ఆమెతో కొద్ది రోజులు జర్నీ చేయాలనుకుంటుంది. ఈ పాయింట్‌తో సినిమా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

రాయలసీమ నేపథ్యంలో...



విషికా, రవి

రవి మహాదాస్యం, విషికా లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం సగిలేటి కథ'. నవదీప్ సి–స్పేస్ సమర్పణలో దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరులో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి మాట్లాడుతూ – ''రాయలసీమ నేపథ్యంలో సాగే చిత్రం 'సగిలేటి కథ'' అన్నారు. ''సగిలేటి కథ' అనే నవల నా సినిమాకి ప్రేరణ మాత్రమే.. కథ పూర్తిగా ఒరిజినల్‌గా ఉంటుంది'' అన్నారు రాజశేఖర్ సుద్మూన్. ''కేరాఫ్ కంచరపాలెం, బలగం' వంటి చిత్రాల కోవలోనే 'సగిలేటి కథ' కూడా ఉంటుంది'' అన్నారు సమర్పకుడు నవదీప్.

సాక్షి బిజినెస్
మంగళవారం
1-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	367	66,528
నిఫ్టీ ▲	108	19,754

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,432	▲	6
డోజోన్స్	35,490	▲	30
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,699	▲	5
డాక్స్	16,447	▽	23
షాంఘై	3,291	▲	15
నికాయ్	33,172	▲	413

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,567
బంగారం (99.5 స్వచ్ఛత)	59,328
వెండి (కిలో)	73,860

ఫ్లిప్‌కార్ట్‌లో వాల్‌మార్ట్ వాటా అప్

- టైగర్ గ్లోబల్ నుంచి కొనుగోలు
- డీల్ విలువ రూ. 11,500 కోట్లు



న్యూఢిల్లీ: ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో టైగర్ గ్లోబల్ వాటాను యూఎస్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ కొనుగోలు చేసింది. ఇందుకు 1.4 బిలియన్ డాలర్లు(సుమారు రూ. 11,500 కోట్లు) వెచ్చించినట్లు తెలుస్తోంది. 35 బిలియన్ డాలర్ల విలువలో 4 శాతం వాటాను సొంతం చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇంతక్రితం 2021లో 37.6 బిలియన్ డాలర్ల విలువలో ఫ్లిప్‌కార్ట్ నిధుల సమీకరణ చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే టైగర్ గ్లోబల్ వాటాను కొనుగోలు చేసినట్లు వాల్‌మార్ట్ ప్రతినిధి ధ్రువీకరించినప్పటికీ డీల్ విలువను వెల్లడించకపోవడం గమనార్హం! ఫ్లిప్‌కార్ట్‌లో టైగర్ గ్లోబల్ తొలి దశ(2009)లో 9 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. తదుపరి 2017కల్లా 1.2 బిలియన్ డాలర్లకు పెట్టుబడులను పెంచుకోవడం ద్వారా అతిపెద్ద వాటాదారు సంస్థలలో ఒకటిగా ఆవిర్భవించింది. 2018లో వాల్‌మార్ట్‌కు అత్యధిక వాటాను విక్రయించినప్పటికీ తిరిగి 2021లో ఇన్వెస్ట్ చేసింది. కాగా.. యాక్సెల్ పార్ట్‌నర్స్ సైతం 35 కోట్ల డాలర్లకు 1 శాతం వాటాను వాల్‌మార్ట్‌కు విక్రయించినట్లు తెలుస్తోంది.

జూన్‌లో మౌలిక రంగం పురోగతి

ఎనిమిది పరిశ్రమల వృద్ధి 8.2 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం వృద్ధి జూన్‌లో 5 నెలల గరిష్టాన్ని చూసింది. వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) ఈ ఎనిమిది పరిశ్రమల వెయిటేజ్ దాదాపు 40%. కాగా, ఆర్థిక సంవత్సరంలో గడచిన మూడు నెలల్లో (ఏప్రిల్–జూన్) గ్రూప్ 5.8% పురోగమించింది.

పరిశ్రమల వారీగా (శాతాల్లో)

రంగం	వృద్ధి
స్టీల్	21.9
సహజ వాయువు	3.6
బొగ్గు	9.8
రిఫైనరీ ప్రొడక్టులు	4.6
ఎరువులు	3.4
సిమెంట్	9.4
విద్యుత్	3.3
క్రూడ్ ఆయిల్(-)	0.6

మారుతీ లాభం హైస్పీడ్

క్యూ1లో రూ. 2,525 కోట్లు



న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా(ఎంఎస్ఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 2,525 కోట్లను తాకింది. పెద్ద కార్ల అమ్మకాలు ఊపందుకోవడం, మెరుగైన ధరలు, వ్యయ నియంత్రణలు, అధిక నిర్వహణేతర ఆదాయం ఇందుకు సహకరించాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 1,036 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 26,512 కోట్ల నుంచి రూ. 32,338 కోట్లకు జంప్‌చేసింది. కాగా.. మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్పొరేషన్(ఎస్ఎంసీ) నుంచి గుజరాత్‌లోని తయారీ ప్లాంటును సొంతం చేసుకోనున్నట్లు కంపెనీ వెల్లడించింది. తద్వారా క్లిష్టతను తగ్గిస్తూ ఒకే గొడుగుకిందకు తయారీ కార్యకలాపాలను తీసుకురానున్నట్లు తెలిపింది.

కాంట్రాక్ట్ తయారీకి టాటా

సుజుకీ మోటార్ గుజరాత్(ఎస్ఎంజీ)తో కాంట్రాక్ట్ తయారీ ఒప్పందం రద్దుకు బోర్డు అనుమతించినట్లు మారుతీ వెల్లడించింది. అంతేకాకుండా ఎస్ఎంసీ నుంచి ఎస్ఎంజీ షేర్లను సొంతం చేసుకోనున్నట్లు తెలిపింది. ఎస్ఎంసీకి పూర్తి అనుబంధ సంస్థ అయిన ఎస్ఎంజీ వార్షికంగా 7.5 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఉత్పత్తులను పూర్తిగా ఎంఎస్ఐకు సరఫరా చేస్తోంది. 2024 మార్చి31కల్లా లావాదేవీ పూర్తికాగలదని అంచనా వేస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. 2030–31కల్లా 40 లక్షల వాహన తయారీ సామర్థ్యంవైపు కంపెనీ సాగుతున్నట్లు ఎంఎస్ఐ చైర్మన్ ఆర్‌సీ భార్గవ పేర్కొన్నారు. వచ్చే ఏడాది తొలి బ్యాటరీ వాహనాన్ని విడుదల చేయడంతో సహా.. వివిధ ప్రత్యామ్నాయ టెక్నాలజీలవైపు చూస్తున్నట్లు చెప్పారు.

6 శాతం అప్

క్యూ1లో మారుతీ అమ్మకాలు 6%పైగా పుంజుకుని 4,98,030 వాహనాలకు చేరాయి. వీటిలో దేశీయంగా 9 శాతం వృద్ధితో 4,34,812 యూనిట్లను తాకగా.. ఎగుమతులు మాత్రం 69,437 యూనిట్ల నుంచి తగ్గి 63,218 వాహనాలకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో మారుతీ షేరు బీఎస్ఈలో 1.6 శాతం బలపడి రూ. 9,820 వద్ద ముగిసింది.

6.50 కోట్ల ఐటీఆర్‌లు దాఖలు

ఒకే రోజు 36.91 లక్షల రిటర్నులు

న్యూఢిల్లీ: ఆదాయపన్ను రిటర్నుల దాఖలుకు చివరి రోజు అయిన సోమవారం పెద్ద సంఖ్యలో పన్ను చెల్లింపుదారులు ముందుకు వచ్చారు. సోమవారం ఒక్కరోజే 36.91 లక్షల రిటర్నులు నమోదయ్యాయి. దీంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి దాఖలైన మొత్తం రిటర్నుల సంఖ్య 6.50 కోట్లకు చేరింది. వేతన జీవులు, ఆడిటింగ్ అవసరం లేని వారు రిటర్నులు దాఖలు చేసేందుకు జూలై 31 చివరి తేదీ కావడం గమనార్హం. గతేడాది జూలై 31 నాటికి దాఖలైన 5.83 కోట్ల ఐటీఆర్‌లతో పోలిస్తే 15 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. ''ఇప్పటి వరకు 6.50 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. ఇందులో 36.91 లక్షల ఐటీఆర్‌లు 31వ తేదీన సాయంత్రం 6 గంటల వరకు నమోదయ్యాయి''అంటూ



ఆదాయపన్ను శాఖ ట్వీట్ చేసింది. పన్ను ఎగవేతకు రెవెన్యూ యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు, నిబంధనలను అనుసరించే వారు పెరగడంతో పన్ను చెల్లింపుదారుల బేస్ విస్తృతం అవుతున్నట్టు పన్ను నిపుణులు అభిప్రా యపడుతున్నారు. డేటా అనలైటిక్స్, ఇతర సమాచారం ఆధారంగా అధిక రిస్క్ కేసులను ఆదాయపన్ను శాఖ గుర్తించి, వారికి వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపడుతుండడాన్ని ప్రస్తావిస్తున్నారు. నగదు డిపాజిట్లు, క్రెడిట్ కార్డు చెల్లింపులు, ప్రాపర్టీల కొనుగోలు, విక్రయాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో లావాదేవీల సమాచారాన్ని ఆదాయపన్ను శాఖ సమీకరించి, విశ్లేషిస్తున్నట్టు చెప్పారు.

నష్టాల నుంచి.. లాభాల్లోకి

- సానుకూల అంతర్జాతీయ ప్రభావం
- ఐటీ, ఆయిల్, విద్యుత్ షేర్లకు గిరాకీ
- అరశాతం పెరిగిన సూచీలు
- జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ఆరంభ నష్టాలను భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు సోమవారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల సంకేతాలు కలిసొచ్చాయి. అధిక వెయిటేజీ రిలయన్స్, టీసీఎస్ షేర్లు రెండు శాతం రాణించాయి. ఉదయం సెన్సెక్స్ నాలుగు పాయింట్ల స్వల్ప నష్టంతో 66,156 వద్ద, నిఫ్టీ 20 పాయింట్లు పెరిగి 19,666 వద్ద మిశ్రమంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో స్వల్ప అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 161 పాయింట్లు నష్టపోయి 65,999 వద్ద, నిఫ్టీ 48 పాయింట్లు పతనమై 19,598 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. తదుపరి ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో దేశీయ మార్కెట్లో తిరిగి కొనుగోళ్లు పుంజుకున్నాయి. దీంతో సూచీలు నష్టాలను భర్తీ చేసుకొని లాభాలను ఆర్జించగలిగాయి. చివరికి సెన్సెక్స్ 367 పాయింట్లు పెరిగి 66,528 వద్ద ముగిసింది. నిఫ్టీ 108 పాయింట్లు బలపడి 19,754 వద్ద ముగిసింది. బ్యాంకింగ్, ఐటీ, మెటల్, ఆయిల్, విద్యుత్ షేర్లకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు భారీ డిమాండ్ లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.31%, ఒకశాతం ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.701 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,488 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు క్షీణించి 82.29 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సోమవారం బీఎస్ఈలో రూ.2.50 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.306.66 లక్షల కోట్లకు చేరింది.
- దేశీయ అత్యంత విలువైన రెండో సంస్థగా టీసీఎస్ తిరిగి తన స్థానాన్ని దక్కించుకుంది. ఐటీ షేర్ల ర్యాలీలో భాగంగా టీసీఎస్ షేరు 2% లాభపడి రూ.3,421 వద్ద స్థిరపడింది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ విలువ రూ.12.51 లక్షల కోట్లకు చేరింది. దీంతో ఈ జూలై 20న రెండో స్థానానికి చేరుకున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(0.38%) రూ.12.45 లక్షల కోట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. కాగా ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ రూ.17.23 లక్షల కోట్లతో తొలి స్థానంలో కొనసాగుతుంది.
- జెట్ ఎయిర్‌వేస్ షేరు బీఎస్ఈలో 5% పెరిగి రూ.50.80 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) ఎయిర్ ఆపరేటర్ సర్టిఫికెట్ పునరుద్ధరించినట్లు జలాన్ – కల్రాక్ కన్సార్షియం తెలపడంతో ఈ షేరుకు డిమాండ్ పెరిగింది.

ఎల్‌అండ్‌టీ రూ. 6 ప్రత్యేక డివిడెండ్

ఇంజినీరింగ్, నిర్మాణ రంగ దిగ్గజం ఎల్‌అండ్‌టీ తమ షేర్‌హోల్డర్లకు రూ. 6 ప్రత్యేక డివిడెండ్ ప్రకటించింది. చైర్మన్ ఏఎం నాయక్.. ఆరు దశాబ్దాలుగా గ్రూప్‌నకు నిరంతరాయంగా సేవలు అందిస్తుండటాన్ని పురస్కరించుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దీనికి ఆగస్టు 2 రికార్డు తేదీ కాగా ఆగస్టు 14లోగా డివిడెండ్ చెల్లిస్తారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వ్యక్తిగా భారత కార్పొరేట్ చరిత్రలో నాయక్ పేరు చిరస్థాయిగా నిల్చిపోతుందని ఉద్యోగులకు రాసిన లేఖలో ఎల్‌అండ్‌టీ సీఈవో, ఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు. దశాబ్దాలుగా ఆయన అందించిన సేవలకు గాను గౌరవ సూచకంగా షేర్‌హోల్డర్లకు ప్రత్యేక డివిడెండ్ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఆగస్టు 9న జరిగే సిల్వర్ జూబ్లీ ఏజీఎంలో నాయక్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

రూ.16,499కే జియో ల్యాప్‌టాప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ తాజాగా దేశీయ మార్కెట్లో 4జీ సిమ్ ఆధారిత ల్యాప్‌టాప్ 'జియోబుక్' పరిచయం చేసింది. ధర రూ.16,499. బరువు 990 గ్రాములు. జియో ఓఎస్, డ్యూయల్ బ్యాండ్ వైఫై, 2 గిగా హెర్ట్జ్ ఆక్టా కోర్ చిప్‌సెట్, 4 జీబీ ఎల్‌పీడీడీఆర్4 ర్యామ్, 64 జీబీ ఇంటర్నల్ మెమరీ, 256 జీబీ ఎక్స్‌పాండబుల్ మెమరీ, 11.6 అంగుళాల యాంటీ–గ్లేర్ హెచ్‌డీ డిస్‌ప్లే, ఇన్ఫినిటీ కీబోర్డ్, లార్జ్ మల్టీ గెస్చర్ ట్రాక్‌ప్యాడ్‌తో తయారైంది. హెచ్‌డీ వెబ్ క్యామ్, స్టీరియో స్పీకర్స్, వైర్‌లెస్ ప్రింటింగ్, ఇంటిగ్రేటెడ్ చాట్‌బాట్, స్క్రీన్ ఎక్స్‌టెన్షన్, ఇన్‌బిల్ట్ యూఎస్‌బీ, హెచ్‌డీఎంఐ పోర్ట్స్ వంటి హంగులు ఉన్నాయి. 100 జీబీ క్లౌడ్ స్టోరేజ్ ఉందని కంపెనీ తెలిపింది. ఆగస్ట్ 5 నుంచి మార్కెట్లో అందుబాటులో ఉంటుంది. రిలయన్స్ డిజిటల్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్లతోపాటు అమెజాన్‌లో లభిస్తుంది.

జోస్ ఆలుక్కాస్ శుభ మాంగళ్యం బ్రైడల్ కలెక్షన్స్-2023



చెన్నై: పెళ్లిళ్ల సీజన్‌కు మరింత శోభను చేకూర్చేందుకు జోస్ ఆలుక్కాస్ ''శుభ మాంగళ్యం బ్రైడల్ కలెక్షన్ – 2023 ఫెస్టివ్ ఎడిషన్'' ను ఆవిష్కరించింది. చెన్నైలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆభరణాల కలెక్షన్‌ను సినీ నటులు కీర్తి సురేశ్, అనార్కలి మారికర్‌లు ప్రారంభించారు. ఇందులోని ప్రతి ఆభరణాన్ని భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రూపొందించామని సంస్థ చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు. స్వచ్ఛమైన బంగారు ఆభరణాలపై 4.99% తరుగు చార్జీలు ఆఫర్ చేస్తుంది. వజ్రాభరణాలపై 20%, ప్లాటినం వస్తువులపై 7% డిస్కౌంట్ అందిస్తుంది. ఎస్‌బీఐ కార్డు, పెళ్లి కోసం బంగారం కొనుగోలుపై 5% ప్రత్యేక క్యాష్‌బ్యాక్ ఆఫర్ లభిస్తుంది. ఇప్పటికే ఆభరణాల బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. కలెక్షన్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు వర్గీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కాలు పాల్గొన్నారు

ఆర్మీలో స్పెషల్ ఎంట్రీ

జాబ్స్ ఇన్ఫో

» ఎన్‌సీసీ పట్టభద్రులకు అవకాశం
» ఇంటర్వ్యూ ద్వారా నియామకాలు

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థుల కోసం ఇండియన్ ఆర్మీ ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ ద్వారా 55 పోస్టులను భర్తీ చేయనుంది. మహిళలు సహా అవివాహిత పట్టభద్రులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా శిక్షణకు ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు మంచి హోదాతోపాటు ఆకర్షణీయ వేతనాలు పొందవచ్చు.

» మొత్తం పోస్టుల సంఖ్య: 55(వీటిలో 50 పురుషులకు, 5 మహిళలకు). ఈ రెండు విభాగాల్లోనూ 6 పోస్టులు(పురుషులకు 5, మహిళలకు1) యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు కేటాయించారు.

ఎన్‌సీసీ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ ఆర్మీ.. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఏడాదికి రెండుసార్లు ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేస్తోంది.

అర్హతలు

కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే మూడు అకడమిక్ సంవత్సరాలు ఎన్‌సీసీ సీనియర్ వింగ్‌లో కొనసాగి ఉండాలి. ఎన్‌సీసీ సి సర్టిఫికెట్‌లో కనీసం బి గ్రేడ్ పొంది ఉండాలి. యుద్ధంలో మరణించిన ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ అవసరం లేదు.

» వయసు: 01.01.2024 నాటికి 19–25 ఏళ్ల మధ్య ఉండాలి. జనవరి 02,1999–జనవరి 1 2005 మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులు.

ఎంపిక ఇలా

వచ్చిన దరఖాస్తులను వారి అకడమిక్ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇలా వడపోతలో నిలిచినవారికి సెలక్షన్ కేంద్రాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు బెంగళూరులో ఇంటర్వ్యూలు ఉంటాయి. సైకాలజిస్ట్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, ఇంటర్వ్యూ ఆఫీసర్‌ల ఆధ్వర్యంలో ఇవి జరుగుతాయి. రెండు దశల్లో అయిదు రోజులపాటు ఇంటర్వ్యూలు కొనసాగుతాయి. మొదటి రోజు స్టేజ్–1లో అర్హత సాధించిన వారిని మాత్రమే ఆ తర్వాత 4 రోజులపాటు నిర్వహించే స్టేజ్–2 ఇంటర్వ్యూకు అనుమతిస్తారు. స్టేజ్–2లో విజయం సాధించిన వారికి మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణలోకి తీసుకుంటారు.

శిక్షణ-వేతనాలు

ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఆఫీసర్ ట్రెయినింగ్ అకాడెమీ, చెన్నైలో 49 వారాల శిక్షణ ఉంటుంది. ట్రెనింగ్ సమయంలో ప్రతి నెల రూ.56,100 స్టైపెండ్ అందిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి పీజీ డిప్లొమా ఇన్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ స్ట్రాటజిక్ స్టడీస్ డిగ్రీని మద్రాస్ యూనివర్సిటీ ప్రధానం చేస్తుంది.వీరిని లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఇలా పదేళ్లపాటు ఉద్యోగంలో కొనసాగవచ్చు. అనంతరం ఆర్మీ అవసరాలు, అభ్యర్థుల ఆసక్తుల మేరకు కొందరిని పర్మనెంట్ కమిషన్‌లోకి(శాశ్వత ఉద్యోగం) తీసుకుంటారు. మిగిలిన వారికి మరో నాలుగేళ్ల పాటు సర్వీస్ పొడిగిస్తారు. అనంతరం వైదొలగాల్సి ఉంటుంది.

పదోన్నతులు ఇలా

లెఫ్టినెంట్‌గా విధుల్లో చేరినవారు రెండేళ్ల అనుభవంతో కెప్టెన్, ఆరేళ్ల అనుభవంతో మేజర్, 13 ఏళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలకు చేరుకోవచ్చు. విధుల్లో చేరిన వారికి ప్రతి నెల రూ.56,100 మూలవేతనంతోపాటు మిలిటరీ సర్వీస్ పే, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సులు లభిస్తాయి. మొదటి నెల నుంచే రూ.లక్షకు పైగా వేతనంగా అందుకోవచ్చు. ఇతర ప్రోత్సాహకాలు పొందవచ్చు.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరి తేదీ: 03.08.2023
» వెబ్‌సైట్:www.joinindianarmy.nic.in

విద్య, ఉద్యోగ సమాచారం

నిమ్స్, హైదరాబాద్‌లో ఎమ్మెస్సీలో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్).. 2023 సంవత్సరానికి సంబంధించి జెనెటిక్ ఎంఎస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 02; కోర్సు వ్యవధి: రెండేళ్లు
» అర్హత: బీఎస్సీ(లైఫ్ సైన్సెస్)/బీఈ,బీటెక్(బయోటెక్నాలజీ/జెనెటిక్ ఇంజనీరింగ్/బయోమెడికల్ ఇంజనీరింగ్/బయోలాజికల్ సైన్సెస్) లేదా ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 31.12.2023 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.08.2023
» దరఖాస్తు హార్డ్‌కాపీలకు చివరితేది:09.08.2023
» వెబ్‌సైట్: nims.edu.in

మేటి ఐఐఎంలకు.. 'క్యాట్' దారి!

» విడుదలైన క్యాట్ 2023 నోటిఫికేషన్
» రేపటి నుంచే దరఖాస్తు ప్రక్రియ
» నవంబర్ 26న క్యాట్
» మూడు విభాగాల్లో పరీక్ష

మేనేజ్‌మెంట్ విద్యను అందించడంలో.. ఐఐఎం(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్)లకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. ఈ క్యాంపస్‌ల్లో అడుగు పెట్టేందుకు మార్గం.. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)! దేశవ్యాప్తంగా లక్షల మంది ఎంబీఏ అభ్యర్థులు ఆసక్తిగా ఎదురుచూసే క్యాట్ 2023 నోటిఫికేషన్ విడుదలైంది. నవంబర్ 26న ఆన్‌లైన్ విధానం(కంప్యూటర్ బేస్డ్)లో పరీక్ష జరుగనుంది. ఈ నేపథ్యంలో.. క్యాట్ 2023 వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఐఐఎంల ఎంపిక విధానంపై ప్రత్యేక కథనం..

ఐఐఎంలు మేనేజ్‌మెంట్ విద్యలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ.. భవిష్యత్ మేనేజర్లను తీర్చిదిద్దుతున్న మేటి ఇన్‌స్టిట్యూట్స్. వీటిలో ప్రవేశానికి ఏటా నిర్వహించే పరీక్ష.. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్). 2024 ప్రవేశాలకు సంబంధించి క్యాట్–2023ను నవంబర్ 26న నిర్వహించనున్నారు. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచి కృషి చేస్తే.. క్యాట్‌లో బెస్ట్ పర్సంటైల్ సొంతం చేసుకొని ఐఐఎంల నుంచి ఇంటర్వ్యూ కాల్స్‌ను అందుకునే అవకాశం దక్కించుకోవచ్చు. ఐఐఎంల్లో ప్రవేశాలకు పోటీ తీవ్రంగా ఉంటుంది. క్యాట్–2020కు 1,90,143 మంది, క్యాట్–2021కు 1,91,660 మంది, క్యాట్–2022కు 2,22,184 మంది అభ్యర్థులు హాజరు కావడమే ఇందుకు నిదర్శనం.

అర్హత

- క్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి(ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి).
- బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

20 క్యాంపస్‌లు.. 4 వేల సీట్లు

కామన్ అడ్మిషన్ టెస్ట్ స్కోర్ ఆధారంగా దేశంలోని 20 ఐఐఎం క్యాంపస్‌ల్లో ఎంబీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ల్లో దాదాపు 4 వేల సీట్లను భర్తీ చేస్తారు. ఐఐఎంలతోపాటు మరెన్నో ఇతర బీ స్కూల్స్ సైతం క్యాట్ స్కోర్ ఆధారంగా ఎంబీఏలో ప్రవేశం కల్పిస్తున్నాయి.

మూడు విభాగాల్లో పరీక్ష

ప్రతి ఏటా క్యాట్‌లో ఏదో ఒక మార్పు కనిపిస్తోంది. ఈ మార్పు ప్రశ్నల సంఖ్యలోనే ఉంటుందని.. విభాగాల్లో పెద్దగా మార్పు ఉండదని నిపుణులు పేర్కొంటున్నారు. సాధారణంగా క్యాట్ పరీక్షను మూడు విభాగాల్లో నిర్వహిస్తారు. ఆ వివరాలు..:

- విభాగం–1: వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్.
- విభాగం–2: డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్.
- విభాగం–3: క్వాంటిటేటివ్ ఎబిలిటీ.

ప్రశ్నల సంఖ్య

గత ఏడాది వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు చొప్పున మొత్తం 66 ప్రశ్నలతో.. 198 మార్కులకు పరీక్ష నిర్వహించారు. ఈసారి కూడా ఇదే తీరులో ఆయా విభాగాల నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించాలంటే.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ సబ్జెక్ట్ నాలెడ్జ్‌లను పెంచుకోవడానికి కృషి చేయాలి. యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా ఫ్యాక్ట్స్, ఇన్ఫరెన్సెస్, జంబుల్డ్ పేరాగ్రాఫ్‌లను ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే రీడింగ్ కాంప్రహెన్షన్‌లో.. బెస్ట్ స్కోర్ కోసం అసెంప్షన్, స్టేట్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి.

డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్

ఇందులో విశ్లేషణాత్మక నైపుణ్యం, లాజికల్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగంలో మెరుగైన స్కోర్ సాధించాలంటే.. టేబుల్స్, గ్రాఫ్స్, చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి. లాజికల్ రీజనింగ్‌లో క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి వాటిపై దృష్టిపెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మ్యాథమెటికల్, అర్థమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విభాగం ఇది. ఇందులో అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వాలంటే.. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, రేషియోస్, డిస్టెన్స్ అండ్ టైం వంటి అంశాలపై పట్టు సాధించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అల్‌జీబ్రా, మోడ్రన్ మ్యాథ్స్, జామెట్రీ టాపిక్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

కటాఫ్ పర్సంటైల్

క్యాట్‌లో ప్రతి సెక్షన్‌లోనూ నిర్దిష్ట కటాఫ్ మార్కులు పొందేలా కృషి చేయాలి. ఎందుకంటే.. ఐఐఎంలు మలి దశ ఎంపిక ప్రక్రియకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు క్యాట్‌లో నిర్దిష్టంగా సెక్షనల్ కటాఫ్, ఓవరాల్ కటాఫ్‌లను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఓవరాల్ కటాఫ్ కనిష్టంగా 85 పర్సంటైల్, గరిష్టంగా 90 పర్సంటైల్ పొందాలి. అదే విధంగా సెక్షనల్ కటాఫ్ 75 నుంచి 80 పర్సంటైల్ వరకూ ఉంటోంది.



క్యాట్-2023

కాన్సెప్ట్స్, ప్రాక్టీస్

క్యాట్‌లో మెరుగైన స్కోర్, పర్సంటైల్ సాధించేందుకు ప్రతి సెక్షన్ కీలకంగా నిలుస్తోంది. కాబట్టి అభ్యర్థులు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. తొలుత సిలబస్‌ను పరిశీలించి..అందులోని అంశాలు, వాటికి సంబంధించి కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత ప్రామాణిక మెటీరియల్‌ను ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. దీంతోపాటు ప్రతి టాపిక్ పూర్తయిన తర్వాత ప్రాక్టీస్ చేయాలి.

మాక్, మోడల్ టెస్టులు

అభ్యర్థులు గత ఏడాది క్యాట్‌లో ఎక్కువ వెయిటేజీ లభించిన అంశాలను గుర్తించి వాటిపై అధికంగా దృష్టి పెట్టాలి. ఆయా టాపిక్స్‌కు సంబంధించి ప్రామాణిక మెటీరియల్‌ను సేకరించి.. ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ప్రతి యూనిట్ చివర్లో ఉండే మోడల్ కొశ్చన్స్‌ను సాధన చేయాలి. అదేవిధంగా మోడల్ టెస్ట్‌లకు హాజరవడం ఎంతో మేలు చేస్తుంది. వీటి ఫలితాలను విశ్లేషించుకుని ఇంకా పట్టు సాధించాల్సిన టాపిక్స్‌ను గుర్తించి వాటిపై మరింత ఎక్కువ దృష్టి సారించాలి. ఇలా ఒకవైపు సబ్జెక్ట్ ప్రిపరేషన్ సాగిస్తూనే.. మరోవైపు నిరంతరం ప్రాక్టీస్‌కు, నమూనా పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్కోర్ పెంచుకోవచ్చు.

మలిదశలో.. మరో ప్రక్రియ

ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులకు మలి దశలో గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. వీటికి నిర్దిష్ట వెయిటేజీ కేటాయించే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఆయా ఐఐఎంల గత ప్రవేశ విధానాలను పరిశీలిస్తే.. క్యాట్ స్కోర్‌కు 50 నుంచి 70 శాతం, జీడీ/పీఐలకు 30 నుంచి 50 శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. కాబట్టి క్యాట్ స్కోర్‌తోనే ప్రవేశం ఖరారవుతుందని భావించకుండా.. అభ్యర్థులు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లలోనూ రాణించేందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలి.

జీడీ, పీఐలు ఇలా

గ్రూప్ డిస్కషన్స్(జీడీ)లో అభ్యర్థులను నిర్దిష్ట సంఖ్యలో బృందాలుగా విభజించి.. ప్రతి బృందానికి ఏదైనా టాపిక్ ఇచ్చి దానిపై మాట్లాడమంటారు. ఒక్కో బృందంలో ఎనిమిది నుంచి పది మంది అభ్యర్థులు ఉంటున్నారు. జీడీ సమయంలోనే కొన్ని ఐఐఎంలు రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌ను కూడా నిర్వహిస్తున్నాయి. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులు నిర్దిష్టంగా ఏదైనా ఒక అంశంపై తమ అభిప్రాయాలను పద పరిమితితో రాయాలని సూచిస్తున్నాయి. ఈ రెండు దశల్లోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థులు మేనేజ్‌మెంట్ విద్యనే అభ్యసించాలనుకోవడానికి కారణం ఏంటి.. భవిష్యత్తు లక్ష్యాలు, ఆసక్తులు, అభిరుచులు తదితర కోణాల్లో ప్రశ్నలు అడుగుతున్నారు. వీటన్నింటినీ విజయవంతంగా పూర్తి చేసుకుని తుది జాబితాలో నిలిస్తే ఐఐఎంలో సీటు ఖరారైనట్లే!

ఐఐఎంలు - పీజీ సీట్లు

అహ్మదాబాద్–445 సీట్లు; బెంగళూరు–412; కోల్‌కత–480; లక్నో–436; ఇండోర్–451; నాగ్‌పూర్–225; ఉదయ్‌పూర్–325; ట్రిచీ–260; కాశీపూర్–90; కోజికోడ్–375; బోధ్‌గయ–120; రోహ్‌తక్–264; రాంచీ–185; సిర్మౌర్–120; అమృత్‌సర్–160; షిల్లాంగ్–92, రాయ్‌పూర్ –90; జమ్ము–90; సంబల్‌పూర్–90; విశాఖపట్నం–120 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 02.08.2023
- దరఖాస్తులకు చివరి తేదీ: 13.09.2023
- అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్: అక్టోబర్ 25– నవంబర్ 26, 2023 వరకూ
- క్యాట్ పరీక్ష తేదీ: 26.11.2023
- ఫలితాల వెల్లడి: 2024, జనవరి రెండో వారంలో
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://iimcat.ac.in


క్లుప్తంగా...

మహిళా వర్సిటీకి ఫార్మసీ విభాగంలో 60వ ర్యాంక్



తిరుపతి సిటీ: జాతీయ స్థాయి ప్రభుత్వ సంస్థ నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) విడుదల చేసిన ర్యాంకుల్లో ఫార్మసీ విభాగంలో పద్మావతి మహిళా యూనివర్సిటీ 60వ ర్యాంకు పొందినట్లు వర్సిటీ వీసీ ఆచార్య డి.భారతి తెలిపారు. ఈ మేరకు యూనివర్సిటీకి నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్)–2023 సర్టిఫికెట్ అందినట్లు ఆమె సోమవారం వెల్లడించారు. యూనివర్సిటీ కేటగిరీలో పద్మావతి వర్సిటీ 151–200 ర్యాంక్ బ్యాండ్ నిలుపుకోవడంతో పాటు ఫార్మసీ విభాగంలో 60వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, ప్రొఫెసర్ వెంకటకృష్ణ తదితరులను వీసీ అభినందించి ఎన్‌ఐఆర్‌ఎఫ్ సర్టిఫికెట్‌ను అందించారు.

స్కౌట్స్ గైడ్స్, దివ్యాంగుల కోటా దరఖాస్తుల పరిశీలనకు నోటిఫికేషన్



సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లలో ప్రవేశాల కోసం స్కౌట్స్ గైడ్స్, దివ్యాంగ కోటా కింద రిజిస్టర్ చేసుకున్న విద్యార్థుల దరఖాస్తుల పరిశీలనకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. స్కౌట్స్ గైడ్స్ విభాగంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మంగళవారం విజయవాడలో ఉన్న విశ్వవిద్యాలయంలోని సిల్వర్ జూబ్లీ బ్లాక్‌లో దరఖాస్తుల పరిశీలనకు హాజరవ్వాల్సి ఉంటుంది. అదే విధంగా దివ్యాంగుల విభాగంలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు బుధ, గురువారాల్లో సిల్వర్ జూబ్లీ బ్లాక్‌లోనే విశ్వవిద్యాలయం మెడికల్ బోర్డ్ ముందు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరవ్వాలి. షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల పరిశీలనకు హాజరవ్వని విద్యార్థులను ఆయా విభాగాల్లో పరిగణలోకి తీసుకోబోమని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

నేడు ఏపీఎల్–2 వేలం



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్‌లో ఆయా ఫ్రాంచైజీల తరపున ఆడేందుకు ఆటగాళ్ల వేలం మంగళవారం విశాఖలో జరగనుంది. కోస్టల్ రైడర్స్, బెజవాడ టైగర్స్, రాయలసీమ కింగ్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, వైజాగ్ వారియర్స్ జట్లు రెండో సీజన్‌లో సత్తాచాటేందుకు ఆటగాళ్లను ఎంపిక చేసుకోనున్నాయి. ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు ఏపీఎల్–2 నిర్వహిస్తారు. స్థానిక వైఎస్సార్ స్టేడియంలో సోమవారం మీడియాతో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్‌ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా క్రికెటర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఏపీఎల్‌లో ఆరు జట్లు తలపడతాయని చెప్పారు. ఏపీఎల్ పాలకమండలి సభ్యుల పర్యవేక్షణలో చారుశర్మ ఆటగాళ్ల వేలం నిర్వహిస్తారని తెలిపారు. ఏపీఎల్ స్టార్ స్పోర్ట్స్ ప్లస్‌లో ప్రసారమవుతుందని వివరించారు. చారుశర్మ మాట్లాడుతూ ఈ టీ–20 మ్యాచ్‌లు రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' లోగో పోటీలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్‌లో నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను పురస్కరించుకుని లోగో, మస్కట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్ హర్షవర్ధన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి 7 వరకు http://sports.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లోగో, మస్కట్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలని తెలిపారు.

తులసమ్మ అప్లికేషన్‌పై విచారణ నేటికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన మిస్‌లీనియస్ అప్లికేషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ అప్లికేషన్ సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ముందుకువచ్చింది. దీనిపై మంగళవారం విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. వివేకా హత్య కేసులో బెయిలుకు దరఖాస్తు చేసుకోవడానికి కోర్టు ఉత్తర్వుల్లో స్పష్టత కోరవచ్చని శుక్రవారం జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడిన విషయం విదితమే.

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం.. అదో సామాజిక, ఆర్థిక నేరం

- రూ.371 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలున్నాయి.. ఈ దశలో ముందస్తు బెయిల్ సాధ్యంకాదు
- భాస్కర్‌ప్రసాద్ ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణాన్ని సామాజిక–ఆర్థిక నేరంగా హైకోర్టు అభివర్ణించింది. నేరాలందు సామాజిక–ఆర్థిక నేరాలు వేరని, బెయిల్ మంజూరు సమయంలో ఇలాంటి నేరాలను న్యాయస్థానాలు మరో దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందంటూ సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని హైకోర్టు గుర్తుచేసింది. ప్రాజెక్టు వ్యయాన్ని రూ.3,356 కోట్లకు కృత్రిమంగా పెంచారని, ఇందులో సీమెన్స్ మాజీ ఉద్యోగి గంటి వెంకట సత్యభాస్కర్ ప్రసాద్ కీలకపాత్ర పోషించారంటూ సీఐడీ తరఫు అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి చేసిన వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. రూ.371 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఇందులో భాగంగా భారీ కుట్రకు పథక రచన చేసినట్లు తీవ్రమైన ఆరోపణలున్న నేపథ్యంలో భాస్కర్‌ప్రసాద్‌కు ఈ దశలో ముందస్తు బెయిల్ ఇవ్వడం సాధ్యంకాదని హైకోర్టు తేల్చిచెప్పింది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు ఇది ఎంతమాత్రం అర్హమైన కేసు కాదంటూ భాస్కర్‌ప్రసాద్ పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్ రెడ్డి సోమవారం తీర్పు వెలువరించారు.

బెయిల్ ఇస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం..

'ఈ కేసుకు సంబంధించి అందుబాటులోని అన్నీ ఆధారాలను ఈ న్యాయస్థానం పరిశీలించింది. పిటిషనర్ భాస్కర్‌ప్రసాద్‌పై ప్రాజెక్ట్ హెడ్‌గా ప్రాజెక్టు వ్యయాన్ని పెంచి చూపడం.. రాష్ట్ర ప్రభుత్వం, సీమెన్స్, డిజీ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య కుదిరిన ఒప్పందంలో అవకతవకలకు పాల్పడటం.. రూ.371 కోట్ల ప్రజాధనం దుర్వినియోగంలో కీలక పాత్ర పోషించడం వంటివి ప్రధాన ఆరోపణలు. దర్యాప్తు సంస్థ భాస్కర్‌ప్రసాద్‌కు, ఇతర నిందితులకు మధ్య జరిగిన సంప్రదింపులకు సంబంధించిన ఈ–మెయిల్స్‌ను సేకరించింది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటూ భాస్కర్‌ప్రసాద్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తున్నా'.. అని న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి తన తీర్పులో వివరించారు. దర్యాప్తు దశలో నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే అది దర్యాప్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని చిదంబరం కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందని ఆయన తన తీర్పులో గుర్తుచేశారు.

కింది కోర్టుల మినీ ట్రయల్‌పై హైకోర్టు విస్మయం..

ఈ కేసులో భాస్కర్‌ప్రసాద్‌ను సీఐడీ అధికారులు ఈ ఏడాది మార్చిలో నోయిడాలో అరెస్టుచేశారు. ట్రాన్సిట్ వారెంట్ మీద విజయవాడ తీసుకొచ్చి గురువారం అతన్ని ఏసీబీ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరిచారు. రిమాండ్ రిపోర్ట్ పరిశీలించిన స్పెషల్ జడ్జి సెక్షన్–409 భాస్కర్‌ప్రసాద్‌కు వర్తించదంటూ అతని రిమాండ్‌ను తిరస్కరించారు. దీనిని సవాలు చేస్తూ సీఐడీ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది. రిమాండ్ సమయంలోనే కింది కోర్టులు మినీ ట్రయల్ నిర్వహించేస్తున్నాయని, ఇది అత్యంత ప్రమాదకర తీరు అని, దీనిని ఆదిలోనే అడ్డుకోవాలని సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. భాస్కర్ ప్రసాద్ రిమాండ్‌ను తిరస్కరిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసింది. రిమాండ్ సమయంలో మినీ ట్రయల్ నిర్వహించరాదని, ఏది ఎంతవరకు చేయాలో అంతవరకే చేయాలని స్పష్టంచేసింది. భాస్కర్‌ప్రసాద్ రిమాండ్ విషయంలో తిరిగి నిర్ణయం తీసుకోవాలని ఏసీబీ కోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో.. భాస్కర్ ప్రసాద్ ముందస్తు బెయిల్ కోసం ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ఏసీబీ కోర్టు ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది. దీనిపై ఆయన తాజాగా హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై గత వారం న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. భాస్కర్‌ప్రసాద్ తరఫున సీనియర్ న్యాయవాది, మాజీ అడ్వొకేట్ జనరల్ సీవీ మోహన్‌రెడ్డి వినిపించారు. ఓ ఉద్యోగిగా భాస్కర్‌ప్రసాద్‌ది చాలా పరిమితమైన పాత్ర అని మోహన్‌రెడ్డి వివరించారు. ఎంఓయూ విషయంలో ఆయనకు సంబంధంలేదన్నారు.

కీలకపాత్ర భాస్కర్ ప్రసాద్‌దే..

ఈ వాదనలను పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తోసిపుచ్చారు. ఇతర నిందితులతో కలిసి భాస్కర్‌ప్రసాద్ భారీ కుట్ర పన్నారని తెలిపారు. ఎంఓయూ తయారీ, ప్రాజెక్టు వ్యయాన్ని కృత్రిమంగా పెంచడం, బ్యాంకు గ్యారెంటీల క్లాజును తీసివేయడం వంటి కీలక విషయాల్లో ఆయనదే కీలకపాత్ర అని వివరించారు. కుట్రలో భాగంగానే ఐఏఎస్ అయిన తన భార్యను డిప్యుటేషన్‌పై స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ సీఈఓగా తీసుకొచ్చారని తెలిపారు. పలు షెల్ కంపెనీల ద్వారా రూ.371 కోట్లను దారి మళ్లించారన్నారు. సీమెన్స్ సంస్థ అంతర్గత విచారణ జరిపి ఆ సంస్థ మాజీ సీఈఓ, ఆయన బృందం ప్రజాధనాన్ని దుర్వినియోగంలో కీలకపాత్ర పోషించినట్లు తేల్చిందని కోర్టుకు నివేదించారు. ఇలా ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, సోమవారం తీర్పును వెలువరించారు. ఈ కుంభకోణంలో భాస్కర్ ప్రసాద్‌ది కీలకపాత్ర అన్న అదనపు ఏజీ వాదనలతో న్యాయమూర్తి ఏకీభవించి భాస్కర్ ప్రసాద్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేశారు.

'స్కిల్' కుంభకోణం ఇదీ..

2014–19 మధ్య కాలంలో చంద్రబాబు సీఎంగా ఉండగా రాష్ట్రంలో 40 చోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి సీమెన్స్, డిజైన్ టెక్ సంస్థలతో ఏపీఎస్ఎస్‌డీసీ ఒప్పందం కుదుర్చుకుంది. నిబంధనల ప్రకారం.. సీమెన్స్, డిజైన్ టెక్ సంస్థలు 90 శాతం నిధులు సమకూర్చాలి. మిగిలిన 10 శాతం బాధ్యత ప్రభుత్వానిది. ఇందులో ప్రభుత్వం తన వాటా కింద ఇవ్వాల్సిన రూ.371 కోట్లను సీమెన్స్, డిజైన్ టెక్ సంస్థలకు ఇచ్చేసింది. ఆ తర్వాత హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సరఫరా పేరుతో నిధులను కొల్లగొట్టేందుకు పలు షెల్ కంపెనీలు సృష్టించారు. వాటి ద్వారా రూ.వందల కోట్లను దారి మళ్లించారు. దీనిపై ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఫిర్యాదు మేరకు సీఐడీ పోలీసులు గత ఏడాది డిసెంబర్ 9న కేసు నమోదు చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీలో పనిచేసిన అధికారులతో పాటు పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులను నిందితులుగా చేర్చారు. సీమెన్స్ మాజీ ఉద్యోగి, అప్పటి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ సీఈఓ, ఐఏఎస్ అధికారి ఊర్మిళ భర్త గంటి వెంకట సత్యభాస్కర్‌ప్రసాద్‌ను కూడా నిందితునిగా చేర్చారు.

వారసులకు క్లెయిమ్ చేయని డిపాజిట్లు

ఇందుకోసం 100 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్

- ప్రతీ జిల్లాలో ప్రతీ బ్యాంకు టాప్-100 క్లెయిమ్ చేయని డిపాజిట్లు గుర్తించాలి
- ఈ సమయంలో వాటిని సెటిల్ చేయడానికి చర్యలు తీసుకోవాలి
- అన్ని బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలు జారీ



క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఇలా.. (రూ.కోట్లలో)

	ప్రభుత్వ బ్యాంకులు	ప్రైవేట్ బ్యాంకులు
31-03-2019 నాటికి	15,000	2,694
31-03-2020 నాటికి	19,425	3,380
31-03-2021 నాటికి	23,683	4,141
31-03-2022 నాటికి	27,921	5,013
31-03-2023 నాటికి	36,185	6,087

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలోని బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లను వారి చట్టబద్ధ వారసులకు చేర్చడమే లక్ష్యంగా ఆర్‌బీఐ 100 రోజుల ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టిందని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి భగవత్ కరద్ పార్లమెంట్‌లో వెల్లడించారు. ప్రతీ జిల్లాలో ప్రతీ బ్యాంకు క్లెయిమ్ చేయని టాప్–100 డిపాజిట్లను గుర్తించి, ఈ డ్రైవ్‌లో వాటిని సెటిల్ చేయడానికి చర్యలు తీసుకోవాలని అన్ని బ్యాంకులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆదేశించిందని ఆయన తెలిపారు. గత ఐదేళ్లలో క్లెయిమ్ చేయని డిపాజిట్లను సెటిల్ చేసి తిరిగి చెల్లించేందుకు రూ.5,729 కోట్లను బ్యాంకులకు బదిలీ చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

వచ్చేనెల 8 వరకు డ్రైవ్..

ఈ 100 రోజుల డ్రైవ్ కార్యక్రమం జూలై 1న ప్రారంభమైందని, సెప్టెంబర్ 8 వరకు ప్రతీ జిల్లాలో ప్రతీ బ్యాంకులో కొనసాగుతుందని మంత్రి భగవత్ కరద్ వివరించారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు '100 డేస్ 100 పేస్' పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వివరించారు. క్లెయిమ్ చేయని డిపాజిట్ల పరిమాణాన్ని తగ్గించడానికి, అటువంటి డిపాజిట్లను నిజమైన క్లెయిమ్‌దారులకు తిరిగి ఇవ్వడానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. క్లెయిమ్ చేయని డిపాజిట్‌దారుల చట్టబద్ధ వారసుల ఆచూకీని కనుగొనడం ద్వారా ఆ మొత్తాలను వారికి చేర్చడమే లక్ష్యంగా ఆర్‌బీఐ, బ్యాంకులు అనేక చర్యలను తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఒక ఏడాది కంటే ఎక్కువ కాలంపాటు ఎటువంటి కార్యకలాపాలు జరగని ఖాతాలను ఏటా సమీక్షించాల్సిందిగా ఆర్‌బీఐ అన్ని బ్యాంకులను ఆదేశించిందన్నారు.

సాకే భారతికి 2 ఎకరాల పొలం

- పట్టా అందజేసిన కలెక్టర్ గౌతమి
- భారతి అంగీకరిస్తే జేఎల్ పోస్టు ఇస్తామని ప్రకటన



కలెక్టర్ గౌతమి నుంచి పొలం పట్టా అందుకుంటున్న సాకే భారతి

అనంతపురం అర్బన్: పేదరికానికి ఎదురొడ్డి పీహెచ్‌డీ పూర్తిచేసిన అనంతపురం జిల్లా శింగనమల మండలం నాగులగుడ్డం గ్రామానికి చెందిన డాక్టర్ సాకే భారతికి రాష్ట్ర ప్రభుత్వం రెండు ఎకరాల పొలం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన పట్టాను కలెక్టర్ ఎం.గౌతమి సోమవారం కలెక్టరేట్‌లో సాకే భారతికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతి ఒకవైపు కూలి పనులు చేసుకుంటూనే.. మరోవైపు రసాయనశాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తిచేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా అనుకున్నది సాధించిన ఆమె ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శింగనమల మండలం సోదనపల్లి గ్రామ సర్వే నంబరు 9–12లో వ్యవసాయ యోగ్యమైన రెండు ఎకరాల భూమిని భారతికి ఇచ్చామని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న ఆమె ఇంటిని కూడా పూర్తి చేయిస్తామని తెలిపారు. ఎస్కే యూనివర్సిటీ పరిధిలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్ పోస్టు (కెమిస్ట్రీ) ఖాళీగా ఉందని, ఆమె అంగీకరిస్తే ఆ పోస్టు ఇస్తామని చెప్పారు. భారతికి ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతపురం ఆర్డీవో మధుసూదన్, శింగనమల తహసీల్దార్ ఈశ్వరమ్మ, భారతి భర్త శివప్రసాద్, కుమార్తె ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల రేడియల్‌గేటు పునర్నిర్మాణ పనులు పూర్తి



రేడియల్ గేటును పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్ట్ 16వ నంబర్ రేడియల్ గేటు పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంతో సోమవారం గేటు పనితీరును ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీరామకృష్ణ పరిశీలించారు. టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నాసిరకంగా అమర్చిన 16వ నంబర్ రేడియల్ గేటు 2021 ఆగస్ట్‌లో సంభవించిన వరద ముంపులో కొట్టుకుపోయింది. వెంటనే స్పందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసి సాగునీటికి ఇబ్బంది కలగకుండా కొట్టుకుపోయిన ఆ రేడియల్ గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ బిగించి ప్రాజెక్ట్‌లో ఫుల్‌గా అంటే 45 టీఎంసీల నిల్వ ఉంచగలిగింది. ఇప్పటి వరకు స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ వల్ల ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంది. వాటిని తొలగించాలంటే ముందుగా నూతన రేడియల్ గేటు బిగించాలి. ఇందుకుగాను ప్రభుత్వం నూతన గేటును అమర్చి, మిగిలిన 23 గేట్లను క్రమబద్ధీకరించేందుకు రూ.18 కోట్లు మంజూరు చేసింది. 2 నెలలుగా బీకేం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంజనీర్లు పునర్నిర్మాణ పనులను పూర్తి చేశారు. ప్రాజెక్ట్ ఇంజనీర్ నూతనంగా బిగించిన 16వ నంబర్ రేడియల్ గేటును 16 మీటర్లు పైకి లేపి ఆపరేటింగ్ సిస్టమ్‌ను నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రేడియల్ గేటు పూర్తి స్థాయిలో పనిచేయాలంటే గేటు ముందు భాగంలో బిగించిన స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్‌ను తొలగించాల్సి ఉంది. రెండు మూడు రోజుల్లో ప్రిన్సిపల్ సెక్రటరీ మరొక్కసారి పరిశీలించిన మీదట స్టాప్ లాంగ్ ఎలిమెంట్స్‌ను తొలగించి, 16వ నంబర్ రేడియల్ గేటును రన్నింగ్‌లోకి తెస్తారు.

గతేడాదిలానే కాఫర్ డ్యామ్‌లకు భద్రత

జలవనరుల శాఖకు డీడీఆర్పీ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: ప్రస్తుత నీటి సంవత్సరంలో గతేడాదిలానే పోలవరం కాఫర్ డ్యామ్‌ల భద్రత చర్యలు చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులకు డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్) దిశానిర్దేశం చేసింది. ఈ సీజన్‌లో కాఫర్ డ్యామ్‌ల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై వారంలోగా నివేదిక ఇవ్వాలంది. దాని ఆధారంగా కాఫర్ డ్యామ్‌ల భద్రతోపాటూ డయాఫ్రమ్‌వాల్‌పై ఆగస్టు 7న సమావేశంలో చర్చిద్దామని డీడీఆర్పీ చైర్మన్ ఏబీ పాండ్య అధికారులకు సూచించారు. సోమవారం ఢిల్లీలో పోలవరం ప్రాజెక్ట్ గ్యాప్–2లో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ స్థానంలో కొత్త డయాఫ్రమ్ వాల్ వేయాలా? లేదంటే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న చోట్ల మాత్రమే కొత్తగా నిర్మించాలనే అనే అంశం అజెండాగా ఏబీ పాండ్య అధ్యక్షతన డీడీఆర్పీ సమావేశమైంది. కానీ..ఈ సమావేశానికి సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా గైర్హాజరవడంతో డయాఫ్రమ్ వాల్ అంశంపై చర్చించలేదు. రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజనీర్–ఇన్–చీఫ్ సి.నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్‌బాబు పాల్గొన్నారు. కాఫర్ డ్యామ్‌ల భద్రతపై ప్రధానంగా చర్చించారు. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా గరిష్ఠంగా 16.30 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో సీపేజ్ నియంత్రణలోనే ఉందని వివరించారు. కాఫర్ డ్యామ్‌ల మధ్యన చేరిన ఊట నీటిని మోటార్లతో వెలుపలికి ఎత్తిపోస్తారా? లేదంటే గ్రావిటీపై పంపుతారా అన్నది తేల్చాలని అధికారులను ఏబీ పాండ్య కోరారు. సీపేజ్ నియంత్రణలోనే ఉన్నా.. కాఫర్ డ్యామ్‌ల మధ్యన ఊట నీరు చేరడానికి దారి తీస్తున్న పరిస్థితులను అధ్యయనం చేసి, వాటిని పూర్తి స్థాయిలో అడ్డుకోవడానికి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని ఎస్‌హెచ్‌పీసీ అధికారులకు సూచించారు.

తూర్పు నౌకాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ రాజేశ్



సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్‌ను నియమిస్తూ భారత రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈఎన్‌సీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్ గుప్తా పదవీ విరమణ చేశారు. రాజేశ్ పెందార్కర్ ప్రస్తుతం నేవల్ హెడ్‌క్వార్టర్స్‌లో డైరెక్టర్ జనరల్(నేవల్ ఆపరేషన్స్)గా ఉన్నారు. 1987లో నౌకాదళంలో చేరిన రాజేశ్.. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ స్పెషలిస్ట్‌గా పేరు సంపాదించారు. పలు యుద్ధ నౌకలకు కెప్టెన్‌గా విధులు నిర్వర్తించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఇన్‌స్ట్రక్టర్‌గా వ్యవహరించారు. కాగా, వైస్ అడ్మిరల్ రాజేశ్ పెందార్కర్‌కు ఘన స్వాగతం పలికేందుకు తూర్పు నౌకాదళం ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం ఐఎన్ఎస్ సర్కార్‌లో గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన బాధ్యతలు చేపడుతారు.

ఇంగ్లిష్‌లో పరీక్షలు

- 3 నుంచి 9 తరగతులకు..
- ఫార్మేటివ్ నుంచి ఈ విధానం అమలు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అంతర్జాతీయంగా రాణించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రణాళికను అమలు చేస్తోంది. తదనుగుణంగా ఇటీవల అందుబాటులోకి తెచ్చిన 'టోఫెల్'లో ప్రతి విద్యార్థి రాణించేందుకు అవసరమైన చర్యలు చేపడుతోంది. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే ఫార్మేటివ్ 1(మొదటి యూనిట్ టెస్ట్) అసెస్‌మెంట్స్‌ను మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఇంగ్లిష్‌లోనే నిర్వహించనున్నారు. ఏపీలో ఇంగ్లిష్ మీడియం చదువులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వం.. గత నాలుగేళ్లుగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో పాఠ్యపుస్తకాలను ముద్రించి పాఠశాలలకు పంపిణీ చేస్తోంది. అలాగే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు రోజూ నిర్దిష్ట పదాలను నేర్పించడంతో పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను అందించింది. రాష్ట్రంలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులు ఇప్పటికే చక్కటి ఇంగ్లిష్ భాషలో మాట్లాడుతున్నారు. దీంతో ఇటీవల టోఫెల్ పరీక్షలకు అనుగుణంగా పాఠశాలల్లో శిక్షణనిస్తున్నారు. ఈ పరీక్షల్లో విజేతలుగా నిలిచేందుకు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మంగళవారం నుంచి 4వ తేదీ వరకు మొదటి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గణితం, ఈవీఎస్, సోషల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ పరీక్షలను ఆంగ్ల మాధ్యమంలో రాసేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలని పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ జిల్లా విద్యాశాఖ అధికారులు, ఆర్జేడీలను ఆదేశించారు. ద్విభాషా పాఠ్యపుస్తకాలతో చదువులను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ఈసారి ప్రధాన సబ్జెక్టుల్లో పరీక్షలను విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో రాసేలా చూడాలని, దీనిద్వారా వారి ఆంగ్లభాష సామర్థ్యం తెలుస్తుందని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు ఉపాధ్యాయులు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేశారో విద్యార్థులతో మాట్లాడి వివరాలు తీసుకుంటున్నారు.

నగల కోసం వృద్ధురాలి హత్య

- గ్రేటర్ విశాఖలో దారుణం



వరలక్ష్మి (ఫైల్)

సింహాచలం/దొండపర్తి: గ్రేటర్ విశాఖ పరిధిలోని సుజాత నగర్‌లో కోటగిరి వరలక్ష్మి (72) హత్యకు గురైంది. వరలక్ష్మి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న రాయవరపు వెంకటేశ్ ఈ దారుణానికి ఒడిగట్టాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. సుజాతనగర్ శ్రీలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో గోపాలకృష్ణమూర్తి, అతని భార్య వరలక్ష్మి, కొడుకు శ్రీనివాస్ నివసిస్తున్నారు. శ్రీనివాస్ పురుషోత్తపురంలో మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వరలక్ష్మికి వినికిడి లోపం ఉండటంతో రాత్రి భర్త, కొడుకు వచ్చేవరకు ఇంటి ప్రధాన ద్వారం తలుపు లోపల గడియ పెట్టకుండా నిద్రిస్తుంటుంది. పురుషోత్తపురంలోనే ఉంటున్న వెంకటేశ్ గతంలో కొన్ని వ్యాపారాలు చేసి అప్పుల పాలయ్యాడు. 20 రోజుల క్రితం శ్రీనివాస్ నడుపుతున్న మొబైల్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనికి కుదిరాడు. రెండుమూడుసార్లు గోపాలకృష్ణ ఇంటికి వెళ్లిన వెంకటేశ్ అక్కడ పరిస్థితులను గమనించాడు. ఆదివారం రాత్రి మెడికల్ షాప్‌కి వెళ్తానని శ్రీనివాస్ దగ్గర బైక్ తీసుకున్న వెంకటేశ్ వరలక్ష్మి నివసిస్తున్న ఫ్లాట్‌కి వెళ్లాడు. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారం గొలుసుతీసే క్రమంలో వరలక్ష్మికి మెలకువ వచ్చి వెంకటేశ్‌ని గుర్తు పట్టింది. దీంతో ఆమెని దిండుతో గొంతు నొక్కి చంపేసి గొలుసు తీసుకుని ఫాస్ట్‌ఫుడ్ వాహనం దగ్గరకి వచ్చేశాడు. రాత్రి ఇంటికి వెళ్లిన తండ్రీకొడుకులు మంచంపై వరలక్ష్మి నిర్జీవంగా ఉండటాన్ని గమనించారు. ఆమె ముక్కు, నోటిలోంచి రక్తం రావడాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా వెంకటేశ్‌ని విచారించగా తానే చంపినట్టు ఒప్పుకున్నాడు.

'హంతకుడు వలంటీర్ కాదు'

వృద్ధురాలిని హత్య చేసిన వెంకటేశ్ ప్రస్తుతం వలంటీర్‌గా కొనసాగడం లేదని జీవీఎంసీ జోన్–3 జోనల్ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడం, ప్రవర్తన సరిగా లేదని స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ జరిపి జూలై 24న అతడిని విధుల నుంచి తొలగించినట్టు వెల్లడించారు. సచివాలయ వార్డు సెక్రటరీ ఉమామహేశ్వరరావు జూలై 3న వెంకటేశ్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని, ఆ ఆరోపణలు నిజమని తేలడంతో విధుల నుంచి తొలగిస్తూ ఉత్తరులిచ్చినట్టు పేర్కొన్నారు.

సీఎం జగన్ బాటలో తెలంగాణ సీఎం

- ప్రభుత్వంలో తెలంగాణ ఆర్టీసీ విలీనం
- 43,373 మంది ఆర్టీసీ సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు



సాక్షి, అమరావతి/ హైదరాబాద్ : సీఎం జగన్ పాలన మరోసారి ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయమైంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక విధానాన్ని తెలంగాణ అనుసరించింది. తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నిర్ణయించింది. తద్వారా ఏపీ చూపిన బాటలో తెలంగాణ పయనించింది. ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఆదర్శంగా నిలిచారు. 2020 జనవరి 1న ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైంది. తద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పటి నుంచి ఆర్టీసీ కార్మికుల దీర్ఘకాలిక కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సాకారం చేశారు. 52 వేలమంది ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)ను ప్రభుత్వంలో విలీనం చేయాలని.. తద్వారా 43,373 మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర మంత్రి వర్గం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు ఉన్నత అధికారులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆగస్టు 3 నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో ఈ మేరకు బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. తెలంగాణ సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన సమావేశమైన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ నిర్ణయాలలో కొన్ని ఇలా..

- ▲ రాష్ట్రంలోని అనాథ పిల్లలను 'చిల్డ్రన్ ఆఫ్ ది స్టేట్'గా గుర్తిస్తూ.. వారి సంరక్షణ, ఆలన పాలన చూసుకోవడానికి పకడ్బందీగా 'అనాథ బాలల పాలసీ'.
- ▲ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 'పెయిడ్' సేవలు.. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల తరహాలో 50 శాతం జనరల్ కన్సల్టేషన్ పడకలు, నిమ్స్ తరహాలో ఫీజు చెల్లింపు విధానంలో మిగతా 50 శాతం పడకలు.
- ▲ వరంగల్‌లోని మామునూరులో విమానాశ్రయం కోసం 253 ఎకరాల భూమి సేకరణ.
- ▲ రాష్ట్రంలో మరో ఎనిమిది వైద్య కళాశాల ఏర్పాటుకు ఆమోదం.
- ▲ హైదరాబాద్‌లో మూడో విడత భారీగా మెట్రో రైల్ విస్తరణకు నిర్ణయం.
- ▲ హకీంపేట ఎయిర్‌పోర్ట్‌ను పౌర విమానయాన సేవలకు వినియోగించేందుకు అనుమతించాలని రక్షణ శాఖకు విజ్ఞప్తి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.